

అన్నపూర్ణా వారి
చదువుకున్న అమ్మాయిలు
నిర్మాత దు. మధుసూదన రావు B.A.
దర్శకుడు. ఆదుర్తి సుబ్బారావు
సంగీతం. రాజేశ్వరరావు
శ్రీ సారథి స్టూడియోస్. హైదరాబాద్
నవయుగ విడుదల
ఇద్దరతివలున్న
ఇరకాటమేనయా
విశ్వదాభిరామ
వినుర వేమ—

ఒకరా !　　　　　　　　　　　　ఇద్దరా !

అందరిదీ ఒకటేమాట. విద్యార్థుల విజయానికి రాచబాట

రవి ట్యుటోరియల్ కాలేజి

బాలికా శాఖ 2 వలైను	బ్రాడీపేట గుంటూరు—2	బాలుర శాఖ 3 వలైను

మెట్రిక్, యస్. యస్. యల్. సి, ప్రీ యూనివర్సిటీ తరగతులకు శిక్షణ. లాబొరేటరీ, హాస్టల్సు గలవు.

ఉద్యోగస్థులకు, స్త్రీలకు, ఇతర రాష్ట్రములవారికి పోస్టలు ట్యూషను యివ్వబడును. మీ సేవే మా లక్ష్యం.

ప్రిన్సిపాల్
C. V. N. ధన్ M. A.

జ్యోతి ప్రకటన రేట్లు

లోపల పూర్తి పేజీ	—	రూ.	100/-
లోపల అర పేజీ	—	రూ.	50/-
రెండవ, మూడవ కవర్స్	—	రూ.	125/-
నాల్గవ కవర్ ఒకే రంగులో	—	రూ.	150/-
,, ,, రెండు రంగులలో	—	రూ.	175/-
,, ,, మూడు రంగులలో	—	రూ.	200/-

మీ వ్యాపార ప్రకటనలకు ఉత్తమ సాధనం జ్యోతి

వివరాలకు : అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజరు, జ్యోతి, బకింగ్‌హాంపేట పోస్టు, విజయవాడ - 2.



సచిత్ర మాస పత్రిక
బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ-2.

మేనేజింగ్ ఎడిటర్ : వి. వి. రాఘవయ్య

విడిప్రతి వెల : 60 న. పై. ఏడాది చందా ఏడు రూపాయలే

సంపుటి 1 ఏప్రిల్ 1963 సంచిక 3

ఇదీ వరస....

సంపాదక వర్గం :
నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకట రమణ,
బాపు, వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.

Edited and Published by V. V. Raghavaiah
and Printed by him at Andhra Printers Ltd.,
Buckinghampet Post, Vijayawada-2.

రాజకీయ వాతావరణం

కొత్తబడ్జెట్ 'పన్ను'గడ

పండగ పూటా ఈ హెడ్డింగేమిటని పాఠకులు చిరాకు పడవచ్చు. కాని ఏం చేస్తాం, తప్పదు. గత మాసంలో జరిగిన పెద్ద సంఘటనలలో పెద్దది కొత్త బడ్జెట్టే. ఉగాది నాడు పొద్దునే తీపి, పులుపు, చేదు కలిసిన వేపపువ్వు పచ్చడిని ఆరగించినట్టే, ఈ సంచికలో ప్రచురించిన రచనలలో తీపి, పులుపు, చేదు, కారం మొదలైన రుచులను ఆస్వాదించినట్టే ఈ కొత్త బడ్జెట్టును కూడా దిగమింగక తప్పదు.

ఫిబ్రవరి 28 వ తేదీన ఆర్థిక మంత్రి శ్రీ మురార్జీ దేశాయ్ కొత్త బడ్జెట్‌ను ప్రకటించారు. అది భారీ యెత్తున వుంటుందని చాలా మంది మొదటి నుంచి అనుమానిస్తూనే వున్నారు గాని ఇంత భారీ యెత్తున వుంటుందని ఎవరూ అనుకోలేదు. ఆ బడ్జెట్ దెబ్బతో 44 కోట్ల భారతీయుల ప్రైవేటు బడ్జెట్లన్నీ తారుమారై పోయాయి. ప్రభుత్వమైతే తన బడ్జెట్ లోటును భర్తీ చేయడానికి పన్నులు వేసింది. కాని ఆ పన్నులై పోయిన సామాన్య ప్రజల బడ్జెట్ లోట్లు పూడే మార్గమేది?

ఉత్తరాన హిమాలయాల శిఖరాల వెనకాల శత్రువు పొంచి కూర్చున్నాడు. అతడు తిరిగి మనపై దండెత్తే ప్రమాదం లేకపోలేదని ప్రధాన మంత్రి పదే పదే హెచ్చరిస్తున్నారు. సైనికంగా మనమెంత దయనీయ స్థితిలో వున్నామో గడచిన అక్టోబరు, నవంబరు నెలలలో తేలిపోయింది. ఈ సారి శత్రువు మళ్ళీ దండెత్తి వస్తే అదే స్థితిలో వుండడమా, అతడిని తిప్పి కొట్టడానికి తగినంత బలం సమకూర్చుకుని వుండడమా అన్నది మనం నిశ్చయించు కోవాలి.

మన దేశ రక్షణను పటిష్ఠం చేసుకొనడానికే నిర్ణయించుకున్నప్పుడు సైనిక సమీకరణ కోసం, ఆయుధ సేకరణ కోసం ఎంత ఖర్చు చేసినా తక్కువే. ఈ దృష్టితోనే ఆర్థిక మంత్రి కొత్త బడ్జెట్‌ను రూపొందించారు. వచ్చే సంవత్సరంలో మొత్తం ఆదాయం 1585 కోట్ల రూపాయలు కాగా, వ్యయం 1852 కోట్లు. ఇందులో రక్షణకు 867 కోట్లు కేటాయించారు. బడ్జెట్ లోటును పూడ్చడానికి 275 కోట్ల మేరకు కొత్త పన్నులను ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు.

ఈ పన్నులు కొంచెం ఎక్కువ తక్కువలతో అన్ని వర్గాల ప్రజలపైన వడగళ్ళ వానలా కురిశాయి. ముఖ్యంగా ఎక్సైజు పన్నులు, దిగుమతి సుంకాలు విపరీతంగా పెంచేశారు. కిరసనాయిలు, టీ, కాఫీ, సిగరెట్లు, పొగాకు, పెట్రోలు, సబ్బులు ఒకటేమిటి రకరకాల వస్తువులపై పన్నులు పెరిగాయి. యంత్రాలు, ఉక్కు వస్తువులు, ముడి ప్రత్తి, రబ్బరు, మోటార్ల విడి భాగాలు, ఫిలిములు మొదలైన అనేక వస్తువులపై దిగుమతి సుంకాలు పెరిగాయి. ఎక్సయిజ్ పన్నుల పెరుగుదల వల్ల 106 కోట్లు దిగుమతి సుంకాల మార్పులవల్ల 87 కోట్లు అదనంగా ఆదాయం రాగలదని అంచనా.

పోతే, కంపెనీలకు కూడా పన్నుల ఒత్తిడి బాగానే తగిలింది. కొత్తగా సూపర్ ప్రాఫిట్స్ టాక్స్‌ను (అదనపు లాభాలపై పన్ను) ప్రతిపాదించారు. ఈ పన్నుద్వారా వచ్చే సంవత్సరంలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం 25 కోట్లే. అయినా ఇది వాటాదారుల డివిడెండ్లపై బాగా దెబ్బ తీస్తుంది. ఈ పన్ను ప్రతిపాదనపై పారిశ్రామికులందరు పెద్ద ఆందోళన లేవదీశారు పరిశ్రమలకు కావలసిన పెట్టుబడి నిధులకు(క్యాపిటల్ ఫార్మేషన్) ఈ పన్ను పెద్ద అవరోధం కలగజేస్తుందని, పారిశ్రామికాభివృద్ధికి ఇది దోహదం చేయదని విమర్శించారు. ఇదే విధంగా రాబడి పన్నులపై సర్‌చార్జీలు పెంచారు. వీటివల్ల ప్రభుత్వానికి 45 కోట్ల ఆదాయం వస్తుంది.

వీటన్నిటికంటే విచిత్రమైనది నిర్బంధపు పొదుపు పథకం. స్వచ్ఛందపు పొదుపు పథకం శుష్కపండగగా ఏనాడో తేలిపోయింది. అందుచేత ప్రజల చేత నిర్బంధంగా పొదుపు చేయించడానికి శ్రీ మురార్జీ దేశాయ్ సంకల్పించారు. నెలకు 150-250 రూపాయల మధ్య జీతాలు, ఆదాయాలు తెచ్చుకుంటున్న కోట్ల కొలది ఉద్యోగులకు, తద్దితర వర్గాల వారికి ఈ పథకం తగులుతుంది. వీరు తమ ఆదాయంలో నూటికి మూడు వంతులు ప్రభుత్వం వద్ద డిపాజిట్ చేయాలి. వ్యవసాయదారులైతే 1959-60 సంవత్సరపు శిస్తులలో నూటికి 50 వంతులు డిపాజిట్ చెయ్యాలి. ఇలా డిపాజిట్ చేసిన మొత్తాలను అయిదేళ్ళ తరవాత వడ్డీతోసహా ప్రభుత్వం తిరిగి ఇచ్చివేస్తుంది. కాని, ఈ పథకం దిగువమధ్య తరగతి అనబడే వర్గం ప్రజలకు తలకు మించిన భారంగా తయారుకాక తప్పదు. నిత్యజీవితావసరాలకే చాలీచాలని రాబడులతో తలకిందు లవుతున్న జనాన్ని పొదుపు చేసి తీరాలనడం కొంచెం బాధాకరమే. ఈ విధంగా ప్రభుత్వానికి 12కోట్ల రూపాయలు ఆదాయం రాగలదని అంచనా. నిజానికి ఇంకా ఎక్కువే రావచ్చు.



"ఎన్ని జోకులేసినా ఆయన నవ్వడేం;"
"ఆయనకి 22 క్యారట్ల బంగారపుపళ్ళ రెం డున్నాయట."

బంగారంపై కంట్రోల్

చైనావాడి దాడివల్ల దేశంలో విప్లవాత్మకమైన మార్పులు అనేకంగా వస్తున్నాయి. వీటిలో చెప్పుకోదగింది బంగారంపై ఆర్థిక మంత్రి విధించిన నిబంధనలు. దేశంలో వ్యక్తుల వద్దగాని, సంస్థల వద్దగాని రెండు వేల కోట్ల రూపాయల బంగారం మూలుగుతున్నదని ఒక అంచనా, నాలుగు వేల కోట్ల బంగారమని మరొక అంచనా, ఏమైనా చాలా బంగారమే వృథాగా పడివుంది. ఇదంతా నిజానికి దేశాభివృద్ధికరమైన పరిశ్రమలపై పెట్టుబడి రూపంలో వినియోగ పడవలసివుంది. దీనిలో ఎక్కువ భాగం ఆభరణాలుగా వుంది. మరి కొంత దొంగ నిల్వలుగా దాక్కునివుంది. దీన్ని బయటకి తీయించే వుద్దేశంతో శ్రీ మురార్జీ భాయ్ బ్రహ్మాండమైన పథకం వేశారు.

ఇక నుంచి తయారు చేసే నగలకు 14 క్యారట్ల బంగారాన్ని తప్ప 18 క్యారట్లు, 22 క్యారట్ల బంగారాన్ని వాడరాదని శాసించారు. ఇతర దేశాలలో, ముఖ్యంగా అమెరికా, యూరప్ దేశాలలో ఇలాంటి నిబంధన వుంది. అదే విధమైన నిబంధన విధించడం వల్ల ప్రజలలో బంగారంపై వ్యామోహం తగ్గిపోగలదని, దానివల్ల గిరాకీ తగ్గి అంత

ర్జాతీయ ధర కంటె దాదాపు రెట్టింపు వున్న బంగారం ధర తగ్గిపోతుందని, ధర తగ్గిపోతే ఏటేటా 55 కోట్ల నుంచి 60 కోట్లవరకు మనకు విదేశీ మారకపు ద్రవ్యాన్ని నష్టపరుస్తున్న బంగారం దొంగరవాణా ఆగిపోగలదని శ్రీ మురార్జీ ఆశిస్తున్నారు. ఆయన పట్టిన బంగారపు కత్తికి ఒక అంచు బంగారం బాండ్లు (ఇది అంత పదునుగాలేదు)కాగా. మరొక అంచు బంగారం కంట్రోలు.

ఆయన ఆశలు ఎంత వరకు ఫలిస్తాయో చూడవలసివుందిగాని. ఈలోగా బంగారం వ్యాపారం దాదాపు స్తంభించిపోయింది. దేశంలోని అయిదులక్షలమంది స్వర్ణకారులలో పెక్కుమంది నిరుద్యోగు లయ్యారు. వీరికి మరొకవిధమైన జీవనోపాధి కల్పించే బాధ్యత ప్రభుత్వం స్వీకరి స్తేతప్ప నిరుద్యోగ సమస్య మరింత జటిలం కాక తప్పదు.

నదీ జలాలు

ఇవన్నీ దేశీయమైన సమస్యలు. ఇక ఆంధ్ర ప్రదేశీయమైన సమస్యలలో ముఖ్యమైనది కృష్ణా, గోదావరీ జలాల వివాదం. ఈనదుల నీటిని ఏ రాష్ట్రం ఎంతెంత వాడుకోవాలో 1951 లోనే ప్లానింగ్ కమిషన్ ఆధ్వర్యాన నిర్ణయమైంది, ఆ నిర్ణయం పనికిరాదని మైసూరు, మహారాష్ట్ర ప్రభుత్వాలు మూడేళ్ళ క్రిందట లేవదీసిన పేచీ నేటికీ అపరిష్కృతంగానేవుండిపోయింది. ఇది ఈమధ్య మరీ ముదిరిపోయి మూడు రాష్ట్రాల మధ్య తీవ్రావేశాలకు దారి తీసి జాతీయ సమైక్యానికే గొడ్డలిపెట్టుగా తయారైంది.

ముందు తమ ప్రాజెక్టుల అవసరాలు తీరిన తరవాతనే మిగులు నీటిని ఆంధ్రకు ఇవ్వాలని మైసూరు, మహారాష్ట్రల వాదం. వీటి నీటి అవసరాలు ఉబ్బిడి ధనాశలా విపరీతంగా పెరిగిపోతున్నాయి. కృష్ణ నీటిలో వెయ్యి శతకోటి ఘనపుటడుగుల నీరు తనకు కావాలని మైసూరు కోరుతున్నది. అంత నీరు మైసూరు వాడుకుంటే ఆంధ్రలో నాగార్జున సాగర్- శ్రీశైలం ప్రాజెక్టులకు ఏమీ మిగలదు. ఈ ప్రాజెక్టులను ఆంధ్ర నిర్మించడానికి వీలు లేదని మైసూరు అభ్యంతరపెడుతున్నది. శ్రీ శైలం, పోచంపాడు ప్రాజెక్టుల పైననే ఆంధ్ర ప్రదేశ్ భావ్యభివృద్ధి ఆధారపడి వుంది. వీటిని ప్లానింగ్ కమిషన్ ఆమోదించి తృతీయ ప్రణాళికలో చేర్చింది. వీటికి మైసూరు, మహారాష్ట్రలు ఎగనామం పెట్టాలని కుట్రపన్నాయి. ఈ వివాద పరిష్కారానికి కేంద్రం నియమించిన గుల్హాతీ కమిషన్ నివేదిక ఇంత వరకు విడుదల కాలేదు గాని అది మనకు ప్రతికూలమేనన్నది సుస్పష్టం.

ఈ వివాదం మరింత ముదరక ముందే కేంద్రం తన తీర్పును నిష్పాక్షికంగా ఇవ్వడం అవసరం.

రాజర్షి

ఫిబ్రవరి 28 వ తేదీన మాజీ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ నిర్యాణంతో ఆధునిక భారతచరిత్రలో ఒక ఘట్టం అంతమైందని చెప్పాలి. 1920 నుంచి గాంధీజీ నాయకత్వాన జరిగిన స్వాతంత్ర్యోద్యమంలోని అతిరథ, మహారథులలో ఆయనొకరు. అతి సరళస్వభావుడు, నిరాడంబరుడు, గాంధీజీ సిద్ధాంతాలను మనోవాక్కర్మలలో అనుసరించిన రాజర్షి అయిన రాజెన్‌బాబు భారత ప్రథమ రాష్ట్రపతిగా ఆ పదవికే వన్నె తెచ్చారు. ఆయన లేని లోటు భారత దేశాని కెన్నటికీ తీరదు. ●

ఆమని

దిగంత వీథుల ప్రశాంత శీతల
సుగంధానిలం వీచింది
విపంచికా మృదుల తంత్రి, నా యువ
హృదంతరం పలికించింది.

చివుళ్లెత్తినది రసాలమై హృది
కోకిల లైనవి కోరికలు!
రెమ్మ రెమ్మ కో పువ్వుల తురాయి
కొమ్మ కొమ్మ పై సన్నాయి!

మేఘమాలికలు హర్షీసకముల
నాడి మేను మరపింపగా
లతలు పూల దోసిళ్ళ నెత్తి పు
ష్పాళ్ళ వల్లి మురిపింపగా

పరిమళించినది పరవశించినది
జగతి నందనోద్యానమై
ప్రతి పరమాణువు పలుకరించినది
అతి సౌందర్య నిధానమై

ఎన్ని భయంకర ఋతువులైన తరి
యింతు నీ వసంతానికై
ఎట్టి దుర్గమాధ్వమున నైన పయ
నింతును నీ స్నేహానికై

రాగ శాఖివై, సోమ రేఖవై
నింపవే సుధారస పాత్ర
సేదదీరి నవజీవ కళల సా
గింప నిమ్ము ఈ చిరయాత్ర-

— భమ్మి శెట్టి



మానసోల్లాసం

వి.ఎ.కె. రంగారావు

ఆనందాన్వేషకులకు ఆలోచన అతి ముఖ్యం. అసలు ఆనందసాధనలో ఆలోచనా శక్తి మొదటి సోపానమేమో. ఈ సంగతి ప్రాముఖ్యాన్ని గ్రహించేవారు బహు కొద్ది. "మీరు ఆలోచిస్తారా?" అని యెవరినైనా అడిగారా? అడిగివుండరు. ఒకవేళ అడిగి వుంటే మీరు యెగతాళికి అడిగారు అనుకుంటారు పరిచితులైతే. క్రొత్తవారైతే మీ వంక సార్థకంగా వింతగా చూసి అదోలా నవ్వేసి వూరుకుంటారు. వేరొకరి సంగతి యెందుకు? ఆ ప్రశ్న మిమ్మల్నే అడిగితే యేమంటారు? ఆలోచించని మానవమాత్రులు వుంటారా? అని తిరిగి నన్నే ప్రశ్నిస్తారు. 'ఆలోచన' అంటే ఈరోజు సాయంత్రం సినిమాకి వెళ్దామా, నాటకం చూద్దామా అని సతమత మవడం కాదు. కాఫీహోటలు కెళ్ళి తీపి ముందు తిందామా, కారమా అని యోచించడమూ కాదు. "ఆలోచన" అంటే ఈ సందర్భంలో- ఒక విషయం గురించి సాంగోపాంగముగా మంచి చెడ్డలు విచారించి సక్రమమైన పద్ధతిలో ఒక నిర్ణయానికి రావడానికి మెదడులో జరిగే తంతు.

ఈ మాటంటేనే ఒక ప్రబుద్ధుడు నన్ను వెక్కిరించాడు. "రైలు స్టేషనుకి వచ్చిన తరువాత వెళ్దామా మానివేద్దామా, యెక్కుదామా వద్దా అని సాంగోపాంగముగా ఆలోచించుకొని ఒక నిర్ణయానికి వచ్చేసరికి ఆ బండికాస్తా వెళ్ళిపోతుంది కదా. అప్పుడు యేమిటి చేసేది?" అని. ఇటువంటి విపరీతార్థాలు తీస్తే ఎంతటి విలువైన సూత్రాన్నైనా అసంబద్ధంగా నిరూపించవచ్చు. ఎంతటి సత్యప్రామాణికాన్నైనా త్రోసిపుచ్చవచ్చు. నన్నడిగిన ధోరణిలోనే నే నొక ప్రశ్న అడిగాను. "ఆలోచన అనవసరమని మీ అభిప్రాయమైతే యెప్పుడు రైలు వచ్చినా అందులోకి యెక్కిపోరే"మని. దాని కతను జవాబు చెప్పలే దనుకోండి. అది వేరేసంగతి. ఇటువంటి కుతర్కానికి దిగితే యెటువంటి ప్రయోజనమూ వుండదు.

మంచీ చెడులను వేరుపరచే విచక్షణాశక్తి ఒక్క మానవమాత్రులకే వుందని, ఆ శక్తి మనలను జంతువులనుండి వేరుపరచిందని విజ్ఞులు అంటారు. ఆ మాటను కాదనేవారు ఎవరూ వుండరనే నా వూహ. ఇది భగవంతుడు (నాస్తికుల దృష్టిలో ప్రకృతే కానీండి) ప్రత్యేకంగా మానవులకు ప్రసాదించిన శక్తి. ఉన్న శక్తిని ఉపయోగించక పోవటం ధార్మిక దృష్ట్యా, సృష్టి పరిణామ దృష్ట్యా దోషమే.

ఆలోచించగలముకదా అని యేదో ఒక అనవసరమైనదాన్ని గురించి ఆలోచించి

కాలాన్ని వ్యయించడ మెందుకని కొందరడుగవచ్చును. ఆలోచనా విధానాము నేర్చుకొనేప్పుడు అటువంటి నిబంధనలతో పని లేదు. చిన్న పిల్లలు చదువు నేర్చుకొనేప్పుడు కదప గడప తడక అనే మాటలే గద మొదట నేర్చేది! పెద్దవారైన తరవాత వారి దైనందిన జీవితంలో ఆ మాటలతో అవసరం యెంతవరకు వుంటుందీ అన్న ప్రశ్న రాదు. భాష నేర్చుకొనటానికి ఒక మార్గ మది అనే మాట తప్ప.

ఆలోచిద్దా మనుకున్న వెంటనే ఆలోచించదగ్గ విషయం మీకు తట్టకపోవచ్చును. ఈసారి యేదైనా పుస్తకం చదివినప్పుడు అందులో విరుద్ధాభిప్రాయాలు రేకెత్తించే రచయిత ప్రతిపాదన నొకమారు సూక్ష్మంగా పరిశీలించండి. నిష్పక్షపాతమైన బుద్ధితో శక్తి వంచన లేకుండా మొదట ఆ ప్రతిపాదనకు అనుకూలంగా, తరువాత దానికి ప్రతికూలంగా వాదించండి. మీకు మీరే ప్రతిపక్షులుగనుక ఎవరు గెలుస్తారనే ప్రసక్తి రాదు. పుస్తకాలు చదివే అలవాటు లేనివారు దినపత్రికలు చూచి అందులో తమకు నచ్చని రాజకీయవేత్త నిన్న సాయంత్రం తేనీటి విందులో చేసిన అసంబద్ధ ప్రేలాపన గమనించి దానికి అనుకూలంగా, ప్రతికూలంగా వాదించుకోవచ్చు.

ఇటువంటివాటిని గురించి ఆలోచించడం అలవాటు చేసుకున్న తరువాత మరి కొంచెం క్లిష్టమైన వాటి గురించి ఆలోచించడం ప్రారంభించవచ్చు. ప్రపంచంలో పాపమంటే ఏమిటి? పుణ్యమంటే ఏది? ఆ మాత్రం తెలియదా? మంచి వన్నీ పుణ్యం చెడ్డవన్నీ పాపం అంటారా! అయితే మంచికీ చెడుకీ నిర్వచనా లేమిటి? దీనికి పెద్దవాళ్ళ మాటలే ప్రమాణాలా? అలాగయితే ఛాందసుల ఉద్దేశం ప్రకారం హోటల్లో భోజనం చేయడం క్షమించరాని పాపమే. అందుకోసమని హోటళ్ళకు వెళ్ళడం మానివేస్తారా? కులేతరులతో సమపంక్తిని కూర్చొనడం కూడా తప్పుక్రిందే వస్తుంది కొందరి దృష్టిలో. మరి పాఠశాలలలోను, కళాశాలలలోను కులానికొక బెంచీని కేటాయించరే! అప్పుడు?

ఈ విధంగా ఆలోచిస్తే మంచి చెడ్డలు, పాపపుణ్యాలు కాలక్రమాన క్రమ పరిణామం చెందుతాయనే మాట తెల్లమవుతుంది. ఎవరికి వారు ఆ యా కాలాలకు తగినట్టుగా ఆలోచించుకొనకపోతే యేది చేయాలో యేదీ చేయకూడదో యెలా తెలుస్తున్నది? ఈ సందర్భంలో వేదంలో వున్నది విస్సన్న చెప్పినది అని ప్రమాణం చూపించి దానిని నమ్మడం కన్న పొరబాటు మరొకటి వుండదు. ఈనాటి జగత్తులో యెవరికి వారే ఆలోచించుకోడం అత్యుత్తమమైన మార్గం, ఆధునిక మానవుని విజ్ఞతా చిహ్నం.

పిచ్చివాళ్ళలాగా ఎవరికి వారే ఆలోచించుకోడమేమిటని అనుకోవద్దు. ఈ మానసిక పరిశ్రమ వలన మేధ పదునుదేరుతుంది. ఆకళింపు శక్తి పెరుగుతుంది. ఇతరుల దృక్పథానికి కూడా తగు ప్రాధాన్యం ఇచ్చే ఓర్పు నేర్పు అలవడుతాయి. ఎంత మేధావియైనా తా పట్టిన కుందేలుకు మూడే కాళ్ళంటే మూర్ఖుడని అపహసిస్తారు. ఎదటి వాదాన్ని విని దాన్ని నేర్పుతో తునాతునకలుగా ఖండించ నేర్చి తన వాదనను ప్రతిపాదించగలవాడే మేధావి అన్న పదానికి అర్హుడు.

ఆనందాన్వేషణకు ఈ మేధావి బిరుదు తోడ్పడకపోయినా ఆ బిరుదును సంపాదించిన ఆలోచనశక్తి తప్పకతోడ్పడుతుంది. ●

కూనలమ్మ పదాలు
ఆరుద్ర

నీరు యెత్తున కేగు
నిజము చాటున దాగు
నీతి నేడొక ప్లేగు
ఓ కూనలమ్మా



సన్యసించిన స్వామి
చాలినంత రికామి
చాన దొరికిన కామి
ఓ కూనలమ్మా



తములపాకులు నములు
దవడతో మాట్లాళు
తానె వచ్చును తమిళు
ఓ కూనలమ్మా

రెండు శ్రీల ధరించి
రెండు పెగ్గు బిగించి
వెలుగు శబ్ద విరించి
ఓ కూనఃమ్మా

పెరిగె ఇన్ కమ్ టాక్సు
పెరిగె సూపరు టాక్సు
టాక్సు లేనిది సెక్సు
ఓ కూనలమ్మా

మినిమి మెచ్చెడి తులువ
పసిడి కిచ్చును విలువ
నాకు చాలును చెలువ
ఓ కూనలమ్మా




కొంటె బొమ్మల బాపు
కొన్ని తరముల సేపు
గుండె వుయ్యాల నూపు
ఓ కూనలమ్మా



అణువు గుండెను చీల్చి
అమిత శక్తిని పేల్చి
నరుడు తన్నున ? బాల్చి !
ఓ కూనలమ్మా

జాలి కరుణలు మాని
ఆలి నేలని వాని
జోలి కెళితే హాని
ఓ కూనలమ్మా

మనసు కుదరని పెళ్ళి
మరుదినమ్మున కుళ్ళి
సుఖము హళ్ళికి హళ్ళి
ఓ కూనలమ్మా



ఆలి కొన్నది కోక
అంతరిక్షపు నౌక
అంతకన్నను చౌక
ఓ కూనలమ్మా

పసిడి వన్నియ తరిగె
పన్ను లెన్నియొ పెరిగె
ప్రజల వెన్నులు విరిగె
ఓ కూనలమ్మా *



వివిధ నీతులు గలవి
పెక్కు బుక్కులు చదివి
నేను చేసెద మనవి
ఓ కూనలమ్మా

* దీనికి అభ్యుదయ పాఠాంతరం :
పసిడి వన్నియ తరుగు
ప్రజల కెంతో మెరుగు
పాత మౌఢ్యము విరుగు
ఓ కూనలమ్మా

కలలు - కలవరింతలు

*మంజుశ్రీ

సావిత్రికి అంతా తీరితే, అందుకే మరీ పదిహేనురోజులనుంచీ పొద్దుటే ఆయనాఫీసుకెళ్ళినప్పటినుంచీ మళ్ళీ సాయంకాలం ఆరు గంటల దాకా చిరాకెత్తి పోతున్నది సావిత్రికి. ఏమీ తోచి చావదు. కోపగించుకుందామనుకున్నా కూడా మనుషులెవ్వరూ లేరు. ఎవరి మీద కోపగించుకోవాలో కూడా తెలీటం లేదు.

నగరానికి దూరంగా విసరివేయబడ్డట్టుగా వున్న యీ భవనంలో యెట్లా పొద్దుపోతుంది! మనస్సు కేమిటో దిగులుగా వుంటుంది. వొంటరి తనం. బిక్కు బిక్కుమంటున్నట్లుగా వుంటుంది.

ఆయన పిసినారి తనం కలవారు కాదు కాని, మొదట నగరానికి దూరంగా, ప్రశాంతంగా వుండేందుకు తాను కూడా ఉత్సహించింది. అందుకే ప్రోత్సాహ పరచింది. పైన తాను ఇప్పుడు బాధపడుతున్నట్లుగా, మొదట మొదట బాధపడవలసిన అవసరం లేక పోయింది. నిజానికి తాను వొంటరిదైనా ఇన్నాళ్ళూ ఇతరులకు తాను వొంటరిదికాని, ఇప్పుడు తనకే తెలిసిరావటం బాధాకారణమైంది. మొదట్లో పక్కింటి పిన్నిగారు, ఏడుగురు పిల్లల తల్లి "నీకేవమ్మా సావిత్రమ్మా, అంతా తీరికే, ఎంత సుఖం ఎంతహాయి. నాకు చావొస్తున్నది యీపిల్లలతో వేగలేక' అంటే నిజంగానే తాను సుఖపడి పోతున్నాను కాబోలును అనుకునేది. కాని ఇప్పుడు అలా అనిపించటంలేదు, విచిత్రమే! అసలు యీ రెండు భాగాల వాళ్ళూ ఒక్కసారిగా ఖాళీ చేసి పోకపోయినట్లైతే ఇప్పటికీ తనకు తెలిసేదికాదు యీ బాధ. వాళ్ళు వున్నంత కాలం, యెప్పుడు వెళ్ళిపోతారా భగవంతుడా అనుకునేది ఇప్పుడనిపిస్తున్నది. వాళ్ళు వుండి వుంటేనే బావుండేది అని. మనస్సు పీకుతున్నది అయ్యో వాళ్ళను ఇంకా ప్రేమించలేదే అని, ఇంకా అభిమానించలేదే అని! అయోమయం మనుషులని యెందుకు విసుక్కున్నానా! అని, కాని వాళ్ళు వెళ్ళి పోయారు. మళ్ళీ ఏ వూళ్ళోనో, ఏ ఇరుకైన అద్దె కొంపలోనో, మూడవ తరగతి రైలు పెట్టెలా, వాళ్ళ జీవితం సాగిపోతూనే వుంటుంది.

నగరానికి కొంచెమేం, బాగానే దూరంగా వున్న ఆ పేటలో విశాలమైన ఆ మేడలో చౌకగానూ, సౌకర్యంగానూ, ఒక భాగం అద్దెకు దొరుకుతున్నదికదా అని సావిత్రి వాళ్ళు అద్దెకు తీసుకున్నారు. నగరాల్లో ఇళ్ళు చౌకగా అద్దెకు దొరకవు. ఆఫీసులూ ఇళ్ళ దగ్గరగా వుండవు. రోజూ ఊరికి పోయి వచ్చినట్లుగా, సన్నకారు ఉద్యోగస్తులంతా లోకల్ ట్రెయిన్స్

(2)

కోసమూ, సిటీ బస్సుల కోసమూ, యెదురు చూస్తూ, విసుక్కుంటూ, వేసారుతూ, మళ్ళీ సాయం కాలానికి దీపాలు పెడుతుండగానూ, పెట్టిన తరువాతనూ పగిలిపోయిన చీమల పుట్టలు పుట్టలులాగా, మేతకు పోయిన పక్షులు గూళ్ళు చేరుకునే రీతిగా, అలసిపోయి ఇళ్ళకు వస్తారు. నిజానికి సావిత్రీ వాళ్ళు, ఆయన ఆఫీసుకు అంత దూరంగా వుండవలసిన అవసరమేమీలేదు. వాళ్ళకు ఇల్లు అంత చౌకగా దొరకవలసిన అగత్యమూ లేదు. అయినా ప్రశాంతత కోసమే అంత దూరం వచ్చారు.

ఆ ఇంట్లో చేరిపోగానే ఆయన అన్నారు"అమ్మయ్య ప్రాణం లేచి వచ్చింది. ఇక్కడ అంతా చూస్తుంటే చిన్నప్పుడు మా ఊళ్ళో వున్నట్లుగానే వుందినాకు. ఈ పెరట్లో చెట్ల పాదులు పెంచుకోవచ్చును. మనం గేదెను కొనుక్కున్నా ఇబ్బందిలేదు ఇక్కడ" అంటూ యెంతో ఉత్సాహం చూపారు. ఆయన గారి అంత ఉత్సాహాన్ని చూసి సానిత్రి కూడా నిజమే కాబోలుననుకుంది. కాని ఎత్తైన వరండాలోంచి. దిగులైన సాయంకాలపు వేళల దూరంగా లోకల్ రైల్వే స్టేషన్ వేపూ, ఆ పట్టాల వేపూ అటూ ఇటూ అరుచుకుంటూ వెళ్ళిపోయే రైళ్ళ వేపూ చూస్తుంటే "చుట్టు చుట్టు పక్షులెల్ల చెట్టు వెదకు రీతిగాను, పట్టు లేక నీపదములు పట్టుకొందు, త్యాగరాజ వినుత, రామా" అన్న కృతి మాత్రమే గుర్తు వస్తున్నది. కాని, ఆయన గారు వర్ణించిన సౌఖ్యమంతా, వర్ణనల లోనే వుండిపోయినట్లనిపిస్తున్నది సావిత్రికి.

ఆ మేడలో మూడు భాగాలున్నాయి. మేడపై భాగాన ఇంటి వాళ్ళు సామాను భద్ర పరచుకుని, పెద్దపెద్ద తాళాలు వేసుకుని, యెక్కడికో వెళ్ళి పోయారు. క్రింద మూడు భాగాలున్నాయి. మూడున్నూ సమానమైన భాగాలే అయినప్పటికి, మధ్య భాగం తక్కిన రెండింటి కన్నా ఇంకొంచెం సౌకర్యంగా వుంటుందని పక్క రెండు భాగాల వాళ్ళు అనుకుంటూ వుంటారు. అందులో ఏకొంచెమో నిజం లేకపోలేదు. సావిత్రి వాళ్ళు వచ్చేసరికి మధ్య భాగం ఖాళీగాలేదు, అందువలన వాళ్ళు పక్క భాగంలోనే చేరిపోయారు. ఆ మధ్య భాగంలో వుంటున్నాయన సావిత్రి వాళ్ళాయనకు స్నేహితుడు కావటమూ, ఆయన ప్రోత్సాహం వల్లనే దూరమైనా సావిత్రి వాళ్ళు ఆ ఇంట్లో చేరటమూ జరిగింది. ఆ ఇల్లాలే యేడుగురు పిల్లల తల్లి. ఆమెకు యెంతో వయస్సు కూడా లేదు. ఆమెను సావిత్రి పిన్నిగారని పిలిచినా, అలా పిలవటానికి ఒప్పుకోవటమే కాకుండా మౌనంగానైనా వుండక అ పిలుపుకి 'ఊ' కొట్టేది. ఇంతాచేస్తే ఆమె సావిత్రి కంటె మహా అయితే పదేళ్ళు పెద్దది కావచ్చు. ఒట్టి వెర్రి బాగుల్ది. పిల్లలు పుడితే వుట్టినే వయసు పైబడుతుంది కాబోలు. అంటే క్షమా, ఓర్పు, నిగ్రహమూ, నిండుతనమూ అన్నీ వచ్చేస్తవి కాబోలు. సావిత్రికి ఆ పొరుగు పిన్నిగారి పిల్లలగోల తట్టుకోవటం కష్టంగానే తోచినా, ఒకరకంగా ఆమెతో బాగా కాలక్షేపం జరిగిపోయేది. అయితే అలా యెక్కువ కాలం సాగలేదు. వాళ్ళు బదిలీ అయి మరోఊరు వెళ్ళిపోయారు.అప్పుడే సావిత్రివాళ్ళు మధ్య భాగంలోకి వచ్చారు. పదిరోజుల పాటు ఆ మధ్య భాగంలోకి వచ్చిన తరువాత



సావిత్రికి చిర్రెత్తిపోయింది. పిల్లల సౌఖ్యం తెలిసి వచ్చింది. నవ్వొవచ్చింది. గోడల నిండా "అ ఆ" లు ఇంకా ఆంజనేయ స్వామి బొమ్మలూ, ఇస్త్రీ బట్టలు, పాలవానికి, బొగ్గులకు- మొదలైన పద్దులు. అల్మారాలలో పగిలి పోయిన గోలీలు, తీనేసిన సిగరెట్ పెట్టెలు మొదలైనవన్నీ యెక్కడబడితే అక్కడే ప్రత్యక్షమైనాయి. సుద్ద ముక్కలతో వ్రాసినవిమాత్రం వోపిగ్గాచెరిపేసింది సావిత్రి. పెన్సిళ్ళ ఉపయోగాన్ని బాగా తెలుసుకున్న వాళ్ళ పిల్లలు చాకలి పద్దులను శాశ్వతం చేసిపోయారు కొన్ని గోడలమీద. ఇక వాళ్ళు వేసిన ఆంజనేయ స్వామి బొమ్మలూ, బాతులూ, చిలకలూ, అవ్వన్నీ చూసి. వాళ్ళ కళాకౌశలానికి అబ్బురపడకపోగా"మీ బొమ్మలే వేసుకున్నార్రా!" అని లోలోపలే కోపం తెచ్చుకుంది సావిత్రి. సరే అలా కొన్నాళ్ళు కాలక్షేపమైంది. అదీ నయమే! తరువాత తాము ఖాళీచేసిన భాగంలోకి యెవరో వచ్చారు. ఈ వేపు ఇదివరకే వున్నారు. ఈ వేపు భాగంలో వో కుటుంబమూ, ఆవేపు భాగంలో వోకుటుంబమూ వుండటం మూలాన, సావిత్రికి తోచకపోవటమంటూ లేకపోయింది. ఇది ఇదివరలో కథ.

ఇప్పుడు ఆరెండు భాగాల వాళ్ళూ వది పదిహేను రోజులు అటూ ఇటూగా ఖాళీచేసిపోయారు.ఉన్నన్నాళ్ళూ వాళ్ళను విసుక్కున్నా వాళ్లు వెళ్ళిపోయిన తరువాత, వాళ్ళ విలువ తెలిసి వచ్చింది సావిత్రికి, వాళ్లు వెళ్ళిపోతున్నారన్నప్పుడే దిగులైంది. వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత మరీ దిగులైంది. సావిత్రి వాళ్ళను విసుక్కోక పోయేదే! ఏం చేస్తుంది, ఒక భాగంలో వున్నవాళ్ళ చంటిపాప యేడ్చినప్పుడు ఆ భవనం తాలూకు పునాదులన్నీ కదిలిపోయేట్లు యేడ్చేవాడు. వాడు ఆకలైతేనే యేడ్చేవాడు. వాడికి "యెప్పుడూ ఆకలే" అని వాళ్ళమ్మ విసుక్కునేది. పాలు కలిపి పట్టేలోపునే గందరగోళం చేసేవాడు ఆపాపడు. ఇంకయీ వేపు భాగంలో వో ముసలాయన వుండేవాడు. అర్ధరాత్రి మొదలుకొని మనుషులను నిద్రపోనిచ్చేవాడు కాదు, పాటలూ పద్యాలూ. "బధ్వాకశైర్యమ భటా బహుభర్త్సయన్ని, కర్షన్ని యత్రపధి పాశశతైర్యదామామ్, ఏకాకినం పరవశం చకితం దయాళో, లక్ష్మీనృసింహా మమదేహి కరావలంబమ్" మొదలుకొని "రామారామాయనవే పాపపు జింహ్వే..." వరకూ ఎన్నో పాటలు పాడేవాడు. అర్ధరాత్రి లేచికూచుని యమభటులు వచ్చి ఎదురుగా నిల్చినట్లూ, వారిబారి నుండి తనను రక్షించమని వేడుకుంటున్నట్లూ మొదలు పెట్టేవాడు. ఓసారి వుండబట్టలేక చిన్నగా పాడుకోమని చెపుదామని సావిత్రి వెళితే, జగన్మిధ్యా తత్త్వమూ, జీవేశ్వర సంబంధమూ మరీ బోధించిగాని ఆయన వదలి పెట్టలేదు. అందుకని అప్పటి నుంచి ఆయన యెదుట పడటానికే భయపడేది సావిత్రి. ఆయన పాటలను, పద్యాలను, చచ్చినట్లు విధిగా భరించేది. ఆపాప మరీ చిన్న పాప. ఈ తాతగారు మరీ పెద్దవారు. వీళ్లిద్దరినీ తలుచుకున్నప్పుడల్లాసావిత్రి వెడనవ్వు నవ్వుకునేది, పిల్లలు లేకపోతె మానె అనీ, కుటుంబంలో పెద్దవాళ్ల లేకపోయినా సరే అనీ అనుకునేది.

ఓసారి ఎవరో జాలిని వ్యక్తపరిచారు. సావిత్రికి పెద్దదిక్కు యెవరూ లేరే అని. ఇంకోసారి ఇంకోరు చిన్నదిక్కు కూడా యెవరూ లేరే అని (అంటే పిల్లలు) సానుభూతి చూపబోయారు. సావిత్రికి కోపమొచ్చింది అప్పుడు. తనబాధ వీళ్ళకెందుకూ అనిపించింది. అలా కాలంగడుస్తూ వచ్చింది.

ఇప్పుడైనా మరీ తోచక ఆమె బాధ పడుతున్నది కానీ, మరెందుకూ కాదు. అంటే ఇవి లేకపోయెనే అనీకాదు. ఇవి వుంటే బావుండునే అనీకాదు. మరీ బాధాకరమైన విషయం యేమిటంటే, రెండుభాగాలూ ఖాళీగావున్నవని ఆయనకు తెలుసు. తెలిసినా "నీకు యెలాపొద్దు పోతోంది. పుస్తకాలేమైనా తెచ్చి ఇవ్వనా? పోనీ ఇవాళకు సినిమాకు వెళ్దామా" అనికానీ అడగక పోవటం. అసలాయనకు అంతదూరం ఆలోచన పోతే కదా! తన పెండ్లి అయి పదేళ్లు కావస్తోంది ఆయన ఇకమారేది లేదు అనుకుంటుంది సావిత్రి. కాని, అనుకోకుండా ఒకరోజున హటాత్తుగా ఆయన తనకొక సంతోషకరమైన వార్త చెబుతారని సావిత్రి అనుకోలేదు. ఆయన చెప్పారు, "తన స్నేహితుడే ఒకడు ఆ ఇంట్లోకి వస్తాడుట. ఇవాళ ఆఫీసులో కన్పించి చెప్పాడుట. ఈ వూరికి కొత్తగా బదిలీ అయి వచ్చాడుట అతను, అయితే ఇంకా నెల రోజులు పట్టవచ్చునట అతడు సంసారం తీసుకొచ్చుకునే సరికి. గుడ్డిలో మెల్ల అని సంతోషించింది సావిత్రి.

మర్రోజు సాయంకాలం ఆయన తన స్నేహితుణ్ణి వెంటబెట్టు కొచ్చారు, తాళంతీసి భాగమంతా చూపించారు. అవతలివేపునున్న భాగంకూడా ఇంతేనని చెప్పారు. ఆ తరువాత తను వరండా బయట గదిలో కూచున్నారు. తాను కాఫీ తీసుకపోయి యిచ్చినప్పుడు, ఆయన తనను స్నేహితునికి పరిచయమూ చేశారు. తాను చనువుతీసుకుని ఆడవాళ్ళను త్వరగా తీసుకరమ్మనీ చెప్పింది. అతడా పూట అక్కడ భోజనమూ చేశాడు. చిట్టచివరి లోకల్ట్రెయిన్‌కు వెళ్ళిపోయారు. సావిత్రికి ఆనందమూకాదు, విచారమూ కాదు, ఎందుకో ఒకందుకు మనసున చాలా వింత అనిపించింది, అతడు గుర్తుపట్టాడో లేదోకాని, తనకు జ్ఞాపకంవచ్చాడు. పదేళ్ళకిందట ఇతడే పెళ్ళిచూపులకు వచ్చినప్పుడు, తెగబడి, యెవరు చెప్పినా వినిపించుకోక, ఖండితంగా 'నేను చేసుకోను, ఈ సంబంధం నా కొద్దు' అని చెప్పింది తాను. తన మొండితనానికి తమవాళ్ళంతా ఆశ్చర్యపోయారు. అప్పటికి కుర్రవాడు ఇంటర్‌మీడియట్ మాత్రమే ప్యాసుకావటమూ, చేస్తున్న ఉద్యోగం చూడబోతే, సెక్రెటేరియట్ గుమాస్తాగిరీ, ఇంకా రూపవంతుడా అంటే, ఇన్నాళ్లూ తన కళ్ళల్లో అవుపడుతున్న పురుషునికి చేరువగానైనారాకపోవడమూ, డబ్బులేక, చదువులేక, అందం లేక, ఆర్జనలేక, హోదాలేక ఏమని చేసుకోవాలి? అని ప్రశ్నవచ్చి, సమాధానం రాక. ఆ సంబంధానికి ఒప్పుకోలేదు సావిత్రి అప్పుడు. పైన అదీకాక, అప్పుడప్పుడే, అంటే అదే కొత్తగా పెళ్ళి సంబంధాలు రావటమూ. పెళ్ళి చూపులకు యెవరెవరో రావటమూ మొదలైందేమో, మనస్సును అసలు సరిపెట్టుకోలేకపోయింది సావిత్రి, కలలు యెంత చెడ్డవి?! ఓడిపోతేనేకదా, రాజీపడడం. సరే తరువాత సావిత్రికి పెళ్ళయింది.

ఇవాళ రాత్రి సావిత్రి భర్తను అడిగింది. ఆ సాయంకాలం వచ్చిన స్నేహితునికి ఉద్యోగ మేమిటని? జీత మెంతని? పిల్లలెందరని? అతడు చెప్పాడు ఉద్యోగం తనకంటే పెద్ద ఉద్యోగమేనని, జీతంకూడా యెక్కువేనని, పిల్లలుకూడా వున్నారని. సావిత్రి విసుక్కుంది పిల్లలెంత మందో తనకు తెలీదని భర్త చెప్పినందుకు. ఆయనకన్నా మీరు యెక్కువ చదువుకున్నారు కదా! ఆ ప్రమోషన్ మీ కెందుకు రాలేదు? అని అడిగింది. "అతడికి సర్వీసు యెక్కువుంది." అని చెప్పారు ఆయన. గవర్న

మెంటుగురించికూడా విసుక్కుంది సావిత్రి. ఆ సుబ్బారావు భార్యా, పిల్లలూ గురించి ఆలోచించుకుంటూ నిద్రపోయింది.

ఆ తరువాత రెండురోజులకు సుబ్బారావు వచ్చి ఆ పక్క భాగంలో చేరిపోయాడు. కాని సావిత్రికి కాలక్షేపం ఏముంది? పైన సావిత్రికి సుబ్బారావు తమ పక్కభాగంలోకి అద్దెకు రావడం అంత ఇష్టంకూడా లేక పోయింది. వచ్చి చేరిన తరువాత, ఒకవేళ ఆ సుబ్బారావు తనను గుర్తుపట్టి వెనుకటి విషయాలనుజ్ఞాపకం చేసుకుంటాడేమో నని, ఆమెకు భయం కాదుగాని, ఇష్టం లేదు. ఆ సుబ్బారావు భార్య వచ్చిన తరువాత చెబుతాడో యేమో! అయినా సుబ్బారావు భార్యా పిల్లలూ యెప్పుడు వస్తారా, తాను వాళ్ళని యెప్పుడు చూస్తానా? అని ఆమె మనసు ఎదురుచూడసాగింది. ఇంతలో ఇంకో వింతకూడా జరిగింది. ఇంకొక పక్క భాగంలోకి ఒకరోజు ప్రొద్దున తట్టా బుట్టా, ఉయ్యాలా జాడీలూ, పెట్టెలు, బెడ్డింగు, రేడియోలతో సహా యెవరో వచ్చి దిగారు. ఆ సాయంకాలం సావిత్రి యెలాగైనా వాళ్ళతో పరిచయం చేసుకోవాలని అనుకుంటూ వుండగా నాలుగైదేళ్ళ వాళ్ళ చిన్నపాప వచ్చి "అమ్మ అగ్గిపెట్టె ఇప్పించుకరమ్మంటోంది" అన్నది ముద్దు ముద్దు మాటలతో.

సావిత్రి ఆ పాపను పంపించి ఆలోచనలలో మునిగిపోయింది. పోనీ ఇంకా కొన్నాళ్ళ వరకూ సుబ్బారావుగారి సంసారం కోసం యెదురు చూడవలసిన అవసరం లేదు. ఈ భాగంలో వీళ్ళు వచ్చి చేరిపోయారు కదా! అనుకుంది. మర్రోజు ఆ కొత్తగా వచ్చి పక్క భాగంలో చేరిపోయిన గృహిణే మధ్యాహ్నంవచ్చి మాటా మాటా కలిపింది. ఆయన టూర్ వెళ్ళారట. నెలకు పది హేను రోజులు ఇంటి వద్దనే వుండరనీ, ఉద్యోగం చూడబోతే గొప్ప మంచి ఉద్యోగం కాదనీ, ఏదో బ్రతకటానికి చెయ్య వద్దా? అనీ, ఆవిడ చెప్పిన దాంట్లోని సారాంశం గ్రహించింది సావిత్రి. చిత్రం అనుకుంది. బాగానేవుంది అనుకుంది. తరువాత ఆ యిల్లాలు తరచూ సావిత్రి వద్దకు వచ్చి కూచుంటూ వుండేది. ఆమెకు ముగ్గురు పిల్లలు. పెద్ద పిల్ల. లిద్దరూ మగ పిల్లలు, చిన్నది ఆడపిల్ల. చిన్న పిల్ల సావిత్రి దగ్గరకు చనువుగా రావడం కూడా నేర్చుకుంది. ఆ చిన్న పిల్ల పేరు సరళ. మగ పిల్ల లిద్దరూ రామం, గోపీ. వాళ్ళు సావిత్రికి దూరంగా నిలుచుని బిక్కు బిక్కుమంటూ చూసే వాళ్ళు. వాళ్ళు కొంచెం పెద్ద పిల్లలు కాబట్టి అంత చనువుగా వచ్చే వాళ్ళు కాదు మొదట.

ఆ రోజు ఆదివారం కాబోలు, "రేపు మా వాళ్ళు వస్తారు" అని వారోజు, ఆయన గారికి సుబ్బారావు చెపుతుంటే సావిత్రి విన్నది. సావిత్రికి వుత్సుకత కలిగింది. నవ్వూ వచ్చింది తన కుతూహలానికి. సుబ్బారావు ఆవాళంతా ఇల్లు సర్దుతునే వున్నాడు. అన్ని సంభారాలు వొక్కొక్కటీ తెచ్చిపడేస్తూ వున్నాడు. సావిత్రికి అతడి శ్రద్ధ చూసి ముచ్చటైంది. నవ్వూ వచ్చింది.

మర్రోజు ప్రొద్దున్నే ఇవాళ సుబ్బారావు గారి పిల్లలూ, భార్యా వస్తారు కాబోలు ననుకుంటూ, ఏదో ఆలోచించుకుంటూ. సావిత్రి పెరట్లోకి వెళ్ళింది యధాలాపంగా ఇన్నాళ్ళనుంచీ తాను చూదామను కుంటున్న వ్యక్తిని చూసింది. బాయిలర్‌తో నీళ్ళు పోస్తున్నాడాతడు. జన్మంతా నెలకు పది హేను రోజులు ఇంటి దగ్గర వుండకుండా,

టూర్ మీద తిరిగే వ్యక్తి. సావిత్రికి నవ్వొచ్చింది. ఇందుకేనేమో ఆయన పదిహేను రోజులు నెలలో టూర్ మీద పోవటం అనిపించింది. ఆమె యేంచేస్తున్నదో. ఇంటి దగ్గర వున్న పదిహేను రోజులూ యీయనే నీళ్ళు కాగబెట్టుకోవాలేమో! అనుకుంది సావిత్రి. కొంచెం పరిశీలనగానే చూసింది. సావిత్రికి భయమూ దిగులూ కాదుగాని, చాల ఆశ్చర్యం, కొంచెం విచారమూ కలిగాయి. తానొకప్పుడు అందంగా వున్నాడను కొన్న వ్యక్తి. ఒకప్పుడు పెళ్ళి చూపుల విషయకంగా తనను చూడటానికి వచ్చిన వాడు. తాను చేసుకుంటానని అన్నది కూడా అప్పుడు. తరువాత అతడు పిల్ల నచ్చలేదన్నాడని-తమ ఇంట్లో వాళ్ళు చెప్పుకున్నప్పుడు కోపంతోనూ, అవమానంతోనూ దహింప బడ్డది. ఆ సావిత్రే యీ సావిత్రి. చప్పున వంటింట్లోకి వచ్చేసింది. గుమ్మంలో నిలబడి పరిశీలించి చూసింది. సందేహం లేదు. కృష్ణమూర్తే! అప్పుడు "ఎమ్. ఏ" చదువుకుంటున్నాడు. తనను చూడటానికి వచ్చినప్పుడే కూచున్న నాలుగు నిముషాలూ అందరినీ నవ్వించాడు. తానూ ఎవరికీ కనపడకుండా నవ్వినట్లు చాలా రోజుల వరకూ తనకు జ్ఞాపకమున్నది. సావిత్రికి యెందుకో దిగులైంది. బయట పాలమనిషి కేక వినిపించి ఆలోచనల్లోంచి తేరుకుని గిన్నె పట్టుకుని వచ్చింది. పాల మనిషి పాలు పోస్తున్నాడు. పక్క భాగంలోంచి గిన్నె పట్టుకుని అతనూ వచ్చాడు. అతనే కృష్ణమూర్తి. పిల్ల నచ్చలేదని చెప్పిన వాడు. తనను చేసుకోనన్న వాడు! ఒకప్పుడు అందమైనవాడే సుమా అని తాననుకొన్నవాడు. గిన్నె పట్టుకుని వచ్చాడు పాలు పోయించుకోవటానికి.

పదేళ్ళ క్రితం ఆ ముక్కు ఇంకా బావుండేది. ఆ జుట్టు ఇంకా నిగనిగలాడుతూ వుండేది. ఆ కళ్ళు ఇంకా అల్లరి చేస్తూ వుండేవి. ఆమాట! ఇప్పుడసలు వినపడదేం! వాళ్ళావిడ పోనీ నెలకు పదిహేను రోజుల లెక్కచొప్పునైనా నవ్వినట్టు తనకు వినపడదు. సావిత్రి విషాదంగా నవ్వుకుంది.


సుబ్బారావుగారు ఆవాళ వంటచేస్తుంటే సావిత్రి ఆయనగారి చేత చెప్పించింది సుబ్బారావుకి. "పోనీ యీ పూటకు మా ఇంట్లో భోజనం చెయ్యవచ్చును. ఏమీ మేమంత తగనివాళ్ళమా. ఒక్కపూట మీకింత భోజనం పెట్టలేమా!" అని. కాని సుబ్బారావు వినలేదు. వాళ్ళ ఆదరానికి ప్రాణం లేచివచ్చినట్లుగా, సస్నేహంగా నవ్వుతూ జవాబిచ్చాడు. "ఇంకోసారి తప్పకుండా మీ ఇంట్లో భోజనం చేస్తాము లెండి" అని. సుబ్బారావు పచ్చడి నూరుకుంటూ వుంటే, కూర తిరగమోత వేస్తూవుంటే, సుబ్బారావుకి భార్యయెడల, సంసారం యెడల గల అనురాగానికి, అభిమానానికి సావిత్రి ముచ్చట పడింది. ఆమె మనస్సులో యెన్నెన్నో ఊహలు చెలరేగినయ్. విషాదంగాను, విచిత్రంగాను నవ్వుకుంది. సుబ్బారావు ఆఫీసుకి వెళ్ళిపోయాడు. కృష్ణమూర్తి మళ్ళీటూర్ మీద వెళ్ళాడుట. మధ్యాహ్నం కృష్ణమూర్తిగారి భార్యవచ్చి చెప్పింది. కృష్ణమూర్తి తనను చూడలేదులావుంది. చూస్తే గుర్తుపడితే ఏమను కుంటాడో. అని చిత్రంగా ఆలోచించింది సావిత్రి. కృష్ణమూర్తి చిన్నబిడ్డ వచ్చిపిలవకుండానే

వాళ్ళోకూచుంది. సావిత్రి వద్దననూ లేకపోయింది. ఎంత విచిత్రం అనుకుంది.

మధ్యాహ్నం సుబ్బారావుగారు ఏనుగెక్కి వచ్చినంత సంతోషంగానూ, కొత్తగా ఇల్లు కట్టుకుని గృహప్రవేశం చేస్తున్న వాడిలా గానూ, ముగ్గురనో, నలుగురినో యెత్తుకోవటంచేత కాక, ఇద్దరిని యెత్తుకుని తక్కిన ఇద్దరినీ నడిపించుకుంటూ, వీళ్ళనలుగురి తల్లికీ, మహారాణీగారి ముందు నడిచే వేత్ర హస్తుడికి మల్లే ముందు నడుస్తూ, ఇల్లో ప్రవేశించాడు. ఆ దృశ్యం చాలా ముచ్చట గొల్పింది సావిత్రికి. వచ్చినవాడు వెంటనే తన ఆఫీసూ, పనీవుండదూ! వెళ్ళిపోవచ్చునా వెళ్ళిపోలేదు. ఆమెకు ఆ ఇంటిలోని సదుపాయాలను గూర్చి చెపుతూ, ఆ ఇంటి సౌకర్యమంతా తెలుగు ప్రబంధంలాగా వర్ణించి చెప్పాడు రాణీగారికి. ఆ తరువాత వాళ్ళను భోజనానికి కూచోబెట్టాడు కాబోలు, తన పాకశాస్త్ర ప్రావీణ్యాన్నిగురించి వాళ్ళకు ఉపన్యసిస్తూ, తనని తానే పొగడుకుంటున్నాడు. సావిత్రికి నవ్వూ వచ్చింది సుబ్బారావు సోదిని చూసి, ఆ రాణీగారిపై జాలీ కలిగింది. ఇంతలోనే ఆమె అదృష్టాన్ని అభినందించకుండా వుండలేకపోయింది మనసులోనే.

తరువాత సుబ్బారావుగారు ఆమె చెప్పిన లిస్టంతా వ్రాసుకుని నాలిగింటికో, ఐదింటికో బయటపడటమూ చూసింది. సుబ్బారావుగారి భార్య, ఇల్లు సర్దుకుని సాయంత్రం కాగానే తనకు తానై వచ్చి సావిత్రితో పరిచయమూ చేసుకుంది. సావిత్రి ఆవిడ మాట తీరునూ, మనిషి తీరునూ చూసి ప్రమాన్పడిపోయింది. ఆమె అంత అందమైంది, అంత మాటా మన్ననా తెలిసినది. పిల్లలంతా తల్లి పోలికే. బిడ్డలను చూస్తే ముద్దుపెట్టుకుందా మనిపించేటట్లుగా వున్నారు. పెద్ద పిల్లలిద్దరూ సావిత్రికి చెరివక పక్కా చేరిపోయారు. తక్కిన పిల్లలు ఎడపిల్లా, పసిపిల్లవాడూ. పెద్ద పిల్ల లిద్దరూ మగపిల్లాడూ, ఆడపిల్లా, మూడోది మళ్ళీ ఆడ పిల్ల. పెద్ద పిల్లవాడికి ఎనిమి దేళ్లుంటాయి. రెండో పిల్లకు ఏడేళ్ళు. మూడోదానికి మూడోయేడు. పసిపిల్లాడికి ఏడాది వెళ్ళిందట. వాళ్ళ పేర్లు కృష్ణుడూ కాత్యాయనీ, రాధా, మధూ, వాళ్ళు రత్నమాణిక్యాలూ. వజ్రాలూ వైడూర్యాలూ. వాళ్ళ తల్లివేపు కన్నార్పకుండా చూసింది సావిత్రి. సుబ్బారావు పెళ్ళి సంబంధానికి వచ్చి తనను చూడటం జ్ఞాపకానికి వచ్చింది. కారూ బంగాళా, పిల్లలూ, నగలూ అన్ని కలలూ జ్ఞాపకానికివచ్చాయి అప్పుడు. కాని ఆ జ్ఞాపకాలను వెంటనే విస్మృతిలోకి నెట్టివేసింది.

ఆతరువాత తరువాత కృష్ణమూర్తి తనను గుర్తుపట్టాడు అనీ ఆమె అనుకోలేదు. తనను చూశాడా అనీ అనుకోనూ లేదు. సుబ్బారావు భార్యాను గురించీ అనుకోలేదు. ఈ భాగంలోంచి ముగ్గురూ, ఆ భాగంలోంచి నలుగురూ వచ్చి తమ భాగంలోనే ఆడుకుంటారు. వాళ్ల బొమ్మల పెళ్ళిళ్ళు చేసుకుంటూ వుంటే, ఆ సంభారాలన్నీ తానే వాళ్ళకు సమకూర్చిపెడుతుంది సావిత్రి. సరళనూ కృష్ణణ్ణీ ఒకపక్కగా తనదగ్గరకు తీసుకున్నప్పుడు గాని, రామాన్నీ, 'కాచి'నీ ఒకదరిగా తీసుకున్నప్పుడుగాని తనకు కృష్ణమూర్తి, సుబ్బారావూ ఇద్దరూ గుర్తువస్తారు. మల్లెపువ్వుల్లాంటి ఆ చిన్న పిల్లలను ఆ తీరున తన దగ్గరకు తీసుకున్నప్పుడు, ఎంత ముచ్చటకలిగినా ఆ తరువాత అంటే వాళ్ల భవిష్యత్తులో పెద్దవాళ్ళయిన తరువాత, వాళ్ళ జీవితాలను గురించి ఆలోచించడానికి సావిత్రి యెందుకో మనసులో భయపడిపోయేది. ●



ఆమె నడచి వచ్చిన ట్లనిపించును
చుక్క లాకసమ్ము నెక్కినపుడు
ఆమె కానుపింప అది నాకు పున్నమ,
మగువలేక పున్నమయె అమాస.

చలిని భరియింపలేను, వెచ్చదనమన్న
ఇచ్చగింపను; చెలిలేక యేది నచ్చు?

ఆమె చందమామయై అందగించిన
నేను నల్లమొయిలు నైన చాలు.

ఊర్వశికిని ఆమె కొక్కటే భేదమ్ము,
ఒకతె లేదు, ఒకతె ఉండి రాదు.

ఆకు రాలు కాల మరుదెంచె, ఆయమ
భుజమునుండి పైట పొరలి పడెను

చల్లగాలి వీచు చాడ్పున వచ్చును,
వేడిగాలి వోలె వెడలి పోవు.

ఎచట పువ్వు పూయ నచటనే ఆయమ
నవ్వుమన్నయట్లు నాకు తోచు

పొగడపూవువోలె పొలతి వాడు కొలంది
కొత్త పరిమళాలు గుప్పసాగు

రవిచంద్రిక

మల్లాది రామకృష్ణశాస్త్రి

ఇది,— శివుని కథ అనుకునేరు:-
శ్రీనాథుని కథ:—

అంతా వాని కథ కాదు; ఆ చిన్నదాని కథ కొంత; యిక, సాంతం వినండి.

అప్పటికి రమారమి; పది పద్దెనిమిది సంవత్సరాలకు పూర్వం శ్రీనాథుడు దక్షారామంలో ఆరామం జేరుకుని, తన కవనం భీమ నాథునికి ధార పోసే,- ఆరోజుల్లో,—-

అత డలా ప్రబంధ నిర్మాణం జేస్తూ, తనకు తానుగానే ఆ కేళీవనంలో కాలం గడుపుతూండగా,- అవసరమైనప్పుడు తప్ప సాటివారూ, తోటి వారూ, ఆ చాయలకు వెళ్ళేందుకు జంకినారు కాని, నరసాలేలేందుకు వీరకంకణం కట్టుకున్న సాని కూతుళ్ళు ఊరకుంటారా?

భీమనాథుడే తమ వాడకు ప్రాత కాపాయెనే, యీ శ్రీనాథుడు లౌక్యానికి బింకాన బోయేను కాని, తగిన తీరున వాని తీరెరిగి లాలించితే, అయిన వేళ, తనకు తానై చనవునేయడా,- తమకించడా..

అనుకున్న వారై,- దర్శనానికని, దరి మ్రొక్కులకనీ, పాయస మందించేందుకనీ, పాన్పు సవరించేందుకనీ, దోరవయసు వారు..

తొంగలి చూపులతో
తోరపు నవ్వులతో

దొంతర విడె మందుకున్న వారై, బిడియముతో,- తడబడు వయారపు అడుగులతో, పలుకరించిన మారు వలుకనేరని అమాయకపు మోములతో,- గిలిగింతల వలె,— కేళీవనం క్రమ్ముకున్న వారై,—

ఎదుటపడి,, పలుకరించి,- కుశలమడిగి, వీవన — సేవలు జేసి, — ఏమరుపాటున ఏమో అన్నట్లు,— పయ్యెదకొంగు వాని మోమున సోకజేసి,- తెలుసుకుని త్రుళ్ళి పడినట్లు,-పడబోయినట్లుమీదకువ్రాలి,- ఇలా వారి చిత్తము వచ్చినట్లు,— వలరాయడు ఉపదేశించినట్లు,- వయారాలకు పోవంగా,— ఆనాడు పోనీ అనుకుని,— మరునాడు, మన కేల అనుకుని,— ఆ మరునాడు పోనీ అనుకుని,— చూసి చూసి, కలిపించుకుని,- వారం దరినీ చేరబిలిచి,-

వేడి సోకినా,- వెన్నెల కురిసినా,- పర్వతానికి ఒకటేనే,—

పడుచుదనపు పోకడలదానా!

భీమనాథుడూ మాణిక్యాంబా నను కన్న వారు.

యిది వారి కేళీవనము—నను బోలిన వారికి తపోవనము.

నేను మీ పుణ్యాన బోలేనే,- వగలాడీ!- యిలా మృదువుగా తెలియజెప్పగా, వారిలో ఓ జాణ....

ఏమయ్యా— మహాకవులని పేరు తెచ్చుకున్నారు,—

ఏ వగలాడి చేసోకనిదీ,— మీకవనం చేవలు దేరిందా? కొండవీటి సీమలో,— మగ, రాయడన్న వానికి, కొమ్మలకు కొదువ లేదట— తమ ఖ్యాతి మేమూ వినకపోలేదు—

యిది,- తపమను కొనలేదు-

తపన అనుకున్నాం.

మహాకవి మా సీమకు రాంగనే మొగబిడియ మాయె నేమో,- అయ్యో పాపమా అని,- చనవీయ వచ్చినాము -

కాదన్న-కూడదనములే!-

మీ కృష్ణా మండలమువారు,— మాటవాసి వారేనా?—

వీరు గడిదేరిన వేడుక కాడని,- వేడుకకు చేయించుకున్న ప్రచారమన్న మాట,-

అన్నమాటేకదా!— కవితకు దాల్చిన అతిశయోక్తులను,— విని,— వీరెంతటి వారౌదురో కదా అని,— యింత దూరము రావలసి వచ్చినది,-

యిలా బాలబోధ చేయవలసి వచ్చినది,-

మేము రప్పించుకునే వారమే కాని, రాకపోకల వారము కాము!

అది మా కులానికి బిరుదు - పరువీయ నేర్చినవారికి, - మా పరువాన మరియాద చేయడం,- మా వాడ బుట్టిన పడుచులకు ఘనత - రాజుల మన్నన లందినవారు,- రసిక రాజు లను కొంటిమి.

మాటల పొందిక నేర్చిన మానసమ్మున మదనుని సింగిణి మార్మోగు ననుకొంటిమి!

కవనాల రాయడు, - గడిదేరిన కమనుడను కొంటిమి-

అని - వింటిమి!-

అమ్మక చెల్ల:- ఆ ముచ్చటలెల్ల కల్లలని,- మోముజూసి, తెలుసు కుంటిమి..,"

యిలా ఎకసెక్కెములు పలికి,— తోటి వారిని పేరుపేరున పిలిచి,- "ఓసి వాలు జూపులదాన, వయారంపు నడకలదాన, - తమ్మి మోముదాన, తలిరు - మోవిదాన ఉవ్విెత్తుల సువారముదాన- ఉలికే కౌనుదాన,- చిక్కని కటిదాన,- చిగురు నవ్వుల దాన, మంచి ముత్తెపు చినుక, రతిచేతి రాచిలుక.- మన కేలనే వీనితోడి చెలిమి!-"
అని అందరినీ కూడగట్టుకున్నదై,- తామందరూ కలసి పకపకలాడి,- కవితాకాముకా! సెలవయా!- చలించ నేరని మగరాయా సెలవయా! - నవరసాలు చదువగ చదివీ, సరసం నేరని సర్వజ్ఞా - సెలవయా!-" అని మరి మరి కవ్వించి,- ఎట్టకేలకు, ఏదో వేళకు,- ఆయన మానాన ఆయనను విడిచి కదలి పోయినవారు కాగా,-శ్రీనాథుడు, అమ్మయ్యా! అనుకుని నిశ్వాసమంత చిరునవ్వు తెచ్చుకుని, "స్వామీ! యీ జగజంతలతో ఎలా వేగుతున్నావయ్యా,- చేతకాని వానితో





చెలగాట మాడి రమ్మని,- తగిన వారిని వెదకి దండు పంపినావా ?- మా తల్లి కనుల చలువను. పడి లేచిన చిలుకహుమాయి దొర,- అంతో యింతో, నీ మీద గింకిరి తనము చేసేనుకాని,- నీ లెంకల జోలికి వచ్చేనా,- రానిచ్చేవా ?- అని నమ్మకంగా, అనుకున్నవాడై,- మళ్ళీ తన ధ్యాసలో తాను ఉండగా.—

సంజె నీడలు పారాడే వేళ,- చక్కందనమే,- తానైన బాల.- మనసే తోడుగా, మక్కువే చేదోడుగా,- సోగకనుల తళుకే వాదోడుగా కవనం చిగురించే ఆ వనంలోకి,- మలయ పవనం తీరున,- సోకినంతలో,- శ్రీనాధుడు,- అటు జూచి



పెదవి విరిచినాడు. ఆ చిన్నది కన్నులతో మందలించినది. పొమ్మని సైగ చేసినాడు : చివాలున వెమకంజవేసి,- దోసెడు మల్లెలు దూసి,- చిరునవ్వు విసిరి,- ఉన్న చోటనే ఉండి,- వానిమీద విరజల్లినది : ఆ విసురుకు,- ఉలిపొర పయ్యెద చెరగు,- మిడిసి పడంగా,- మారన్న కుమారునికి,- అప్పటికి నవ్వు వచ్చింది,- ఆ నవ్వులలో నవ్వుగా,-

"దరిజేరనీని దైవాన్ని, చిత్తము వచ్చి నటుల సేవించు తున్నాను-" అన్నది....

"సేవల కని వచ్చిన కొమ్మను చేర దీసేందుకు అలయంలో ఉన్న ఆ ఘనుడే సరి-"

"ఆ ఘనుడు కైవల్య మిచ్చేను; యీ కవిరాయడే నా కామితము దీర్చేను-"

"కవి రాయడు కాసులకు పేద!"

"కావచ్చునేమో కాని, బాసలకు పెన్నిధి:

నేను కోరినది, కొంగున బంగారము కాదు, ఒక్క దీవెన!– మరి కొసరను!....

మన తనయుడు,– తండ్రిని మెప్పించే మహాకవి కావలె!..."

"ఓసి ముద్దరాలా!– ఒక్క మొగ్గను రెండు పూవులు చేసినావు కదవే!– నీవెంత కీర్తి కాముకివే!– కోరిన కోరిక పరువైనదే–

కాని,– తీరా,– ఆ మగబిడ్డ.– మహాకవి అయేనో,– మార్దంగికుడౌనో,– చేత మనది కావచ్చునేమో కాని.

వాని గీత మన చెప్పుచేతలలో లేదుగా– అదిన్నీగాక,-

దేవుడు వరమిచ్చినా,- నరుడు పరువీయని, వాడకట్టున మగపుట్టుక పుడితే.- అయిన వాడినీ కానివాడినీ,- బావా అని పిలవాలిసిన అగదేగాని,- అందలం ఎక్కేనా?-

అందలాన బెట్టినా కుందనాన బెట్టినా, ఆడ పోడిమికి వసరుగాని,- అర్భకు డెందుకులే!– అంతగా, సంతుమీద మనసైతే,- ఆడపిల్ల కలగాలని కోరుకో: అంతో యింతో నా ఓపిన కొలది నేనూ దీవించేను. ఆలయంలో అయ్యే దీవెన మీ కులానికి ఎలాగూ ఉండనే ఉన్నదిగా!– తల్లి పోలికే వచ్చిందా,- చిరునేతలు మరగిన వాడెవ్వడో,- పడకటింట చిదిపి దీపం పెడతాడు. కనుముక్కు తీరు సలక్షణంగా ఉండి,- అన్ని హంగులూ అలంకారాలు ఒంటపట్టిన కల్యాణికి,- కవనం అబ్బటం అదేమంత మహా భాగ్యమా ?- కదళీ ద్రాక్షాపాకాలూ పలుకుల్లోనే ఉంటవి; శయ్యే అంటావా,- అది,- సహజ సౌభాగ్యమే,– బంధ– చిత్ర కవిత్వాలంటావా,- అది, కృతిపతి అదృష్టాన్ని పట్టి వాటంతట అవే రూపొందుతాయి;

కనుక,- నీ మనస్సు ఎట్టిదైనా,- లోకకల్యాణం దృష్ట్యా- నీవు కుమార్తెల తల్లివైతే,- యిటు యీ నరుడూ,– అటు ఆ దేవుడూకూడా మెచ్చడం జరుగుతుంది; దేవుని పెళ్ళికి అందరూ పెద్దలే కనుక, దైవ కృపను నీకు సంప్రాప్తించే సంతానం చేత "నాన్న" అనిపించుకునేందుకు, నేను ఎన్నటికీ వెనుకాడను. దైవం రక్షించి,– నీ బిడ్డ యీడేరి,- నా కళ్ళ ముందరనే గ్రంథ సాంగురాలైతే,- యిహ చెప్పనా?

యిదిగో,– చక్కని దానా!- నేను పుట్టి బుద్ధెరిగి,– ఎన్ని సీమలలో కలయదిరిగాను,- ఎంద రెందరితోనో,– కలుపుగోలుతనంగా ఉన్నాను. కవనాలు వెదజల్లాను; ఘనంగా కట్టబెట్టించుకున్నాను. యింతవరకూ, మనకు రాబడే కాని పోబడి లేదు. యిన్నాళ్ళకు,– నీవంటూ వచ్చి,- ఎదుట బడి,– సరసంగా దేహీ అన్నావు.- కాదంటానా,– నిన్ను అమ్మా అన్న నోటనే ఆ బిడ్డ, నన్ను "నాన్న" అని పలుకరించి,– కవనాన గడితేరితే–అహో!- యిక అంతకన్న అనందం ఏముంటుంది! భీమనాధుడు నిన్నూ నన్నూ కరుణించి,- మన జన్మ చరితార్థం అమేట్టు చేయగలడులే,– యిక స్వామి సేవలకు పో–"

అది,- అప్పటి ముచ్చట.

మరి, వారు కలుసుకోలేదు:

శ్రీనాధునికి,– అది జ్ఞాపకం కూడా లేదు:

కాని,- భీమనాధుడు,- మరువలేదు,–

మహాకవి దీవెన ఫలించింది. ఆడపిల్ల కలిగింది: వాడలో,- జాణలు,- నడికట్టు వేళ,- బాలపాప తండ్రి పేరు చెప్పించాలని జూశారు: ఉహుఁ: పరగణాలో,- సరసుడెవ్వరూ తనకా ఘనత ఆపాదించుకోలేదు:

పసిపాప ఒక్కనాడు,– గారుగీరుమన లేదు: చిరునవ్వల్లే పుట్టింది: చిరునవ్వే వెంట తెచ్చుకుంది: వయసు వచ్చినా,- పలుకు రాలేదు. పకపక హెచ్చింది. పాపం బంగారమంటి పిల్ల,– కాని,- మూగా,- పిచ్చి.–

అయిన వారూ, కాని వారూ,- పిల్లను చూసి,- కన్ను తుడుచుకునే వారు: కన్నతల్లి మట్టుకు చిన్నబోలేదు: ఏడాది వెళ్ళగానే,– ఆలయానికి తీసుకు వెళ్ళింది: అప్పటికి నడకరాని పిల్లకు,- నడకా నాట్యం ఒక్కసారే వచ్చినవి: కులపు సానులకు అబ్బురం వేసింది: అందరూ తమ విద్యలు చూపించారు: యీ చిన్నది అందరికన్నా ఒక్క ఆకు పైనున్నది: అప్పటికి, వారికి తెలిసివచ్చింది: యీ బిడ్డ,– ఏసామిచ్చిన వరమో;–

ఆనాడు,- ఆలయానికి వచ్చిన బిడ్డ,- మరి యింటికి పోలేదు: ఉనికీ మనికీ అక్కడనే,- మూడు వేళలా నాట్యాన భీమనాధుని ఆరాధించేది: అప్పుడు ఊరూ నాడూ అంతా అక్కడే ఉండేది: పోను పోను మరి తీర్థప్రజ: దూరాభారమన కవచ్చేవారు: వచ్చిన వారు ఓ పట్టున తరలి; పోయేవారు కారు; దక్షారామం, రాజధానికన్న ఎక్కువ సమ్మర్దంతో ఉండేది ఆ కథ, అక్కడికి అది,-

యిక్కడ,- శ్రీనాధుడు,-

అలా, స్వామివారి కేళీవనంలో నిష్ఠగా కూర్చుని,- భీమనాధుని మహిమను కొనియాడి, అప్పటికి ఓం తత్ సత్-అని మనసులో అనుకుని,- అతదుపరి రాణ్మహేంద్రవరంలోనే,- శివైక చిత్తాన, ఉంటున్న వాడాయెను గద; మహామంత్రి బెండపూడి అన్నయ్యకు తానంటే ప్రాణమే,- రాజ్య పాలన జేసే వీరుడికి,- తానంటే దేవుడే,- తన కవనమంటే అమృతమే; అతగాడికి అక్కడ ఏ కొరతా లేదు : అసలు ఏ కోరికా లేదు:

ఒక్కనాడు సభకు పోయినదిలేదు,- మనసైనప్పుడల్లా మహారాజులే, దర్శనానికి దయచేసేవారు; అన్నయ మంత్రి,- ఒక్కక్షణం తీరిక చిక్కిందో,– యిక్కడే పడి ఉంటాడు. ఎన్నడన్నా, దక్షారామం వెళితే తప్ప; అదన్నా-మునుపటి లాగా,- తలచుకున్నప్పుడల్లా కాదు,- శ్రీనాధుడు, పోరగా పోరగా,- యిహ తప్పని సరిగా,-

యిన్నాళ్ళూ, దక్షారామం భోగట్టా అతడికి తెలియకుండానే ఉందా!- అన్నయ్యమంత్రికి ఎప్పుడూ అదే స్మరణైపాయె; శివుని మాటమరచిపోయి. ఆ చిన్నదాని ముచ్చటలే ఏకరువు బెట్టటమాయె-

తాను స్వామివారి కేళీవనం విడిచి,- ఆ దివ్యమూర్తులను సెలవడిగి,- అప్పుడు రావటం,- అంతే,- మరల అటు పదతలనం చేయలేదు.

అయినా,- దక్షారామంలో, సారసాక్షికి, అది ఏనాడో చేసుకున్న పుణ్యాన ముత్తె మంటి కూతురు పుట్టిందని,- ఆ ముత్తెం, తళుకుదేరి రత్నం అయిందనీ,- అది,— రత్నం కాదు.- స్వామి వారు జడలకెంపుల్లో తురుముకున్న నెలవంక,- వరమంది,- రూపంది, తెలిసో తెలియకో,- అయ్యె రసెక్కిన మిడిసిపాటుకు పరిహారంగా, యిలా సేవించు కుంటూన్నదవీ.- ఆ పుట్టుక అలాటి దేవ రహస్యం కనుకనే,. ఎవరికి పుట్టిన బిడ్డా కానట్టూ పేరన్నా లేకుండా యింతవయసుకు వచ్చిందనీ,- పిల్ల దానికి ప్రాయం రావడం,- ఎలా ఉన్నదంటేను, అది, లేతవెన్నెల ముదిరిన పోణెం కాని.- మనిషికీ, ప్రాసుకూ అబ్బే మామూలు నేవళం కాదనీ,-

మరో విశేషం,- ఆ చిన్నది.- స్వామి వారి సన్నిధిలో కింకిణులు ఝణఝణ మని పించేసరికల్లా,— మొయిలు పెట్టున తుమ్మె దలు,- ఆ ప్రాంగణములో చిక్కచిత్తుగా కమ్ముకుని,— నాట్యకలాపం సాగినన్ని ఘడి యలూ, తంబురల ఝూంకరింపున,- వంత చేస్తాయనీ — యీ వైనం పసిపిల్ల బాలాదికి తెలుసునే; ఆయన చెవిని పడి ఉండదా ?

అలా ఎన్నేళ్ళు గడచినవి?- పదా, పాతికా?- ఆ లెక్క రాయసంవారికి తెలి యాలి కాని,- శాశ్వతుని,- సన్నిధిలో ఉన్న ఆ కవిరాయనికి,- ఆ గణన ఎక్క డిది. ఆ సీమ ఆనందానికి ఏనాడో కాణాచి అయినది. పసిపిల్ల లెదిగివచ్చి,- కొమాళ్ళ తండ్రులైనారు: తాను ఆలయంలో కుదురు కున్నప్పుడు,— కుదుళ్ళు కట్టిన మారేడు మొలకలు, మహా వృక్షములైనవి; రెడ్డిరాజు కృతినందిన సుకృతము గణించి, తరించినాడు: అన్నయమంత్రి కూడా, బాగా పండబారినాడు, అంతకు మునుపు ఎన్నడూ లేనిదీ,- ఆ నాడిలా ప్రస్తావించడం జరి గింది,

అన్న మంత్రి ఆ సంజెవేళ, ఆలయా నికి వచ్చిరావడంతోనే అన్నాడు కదా:- "మామా! యిప్పుడున్న సత్తువ యింకోక్షణా నికి ఉండటం లేదు! చూడగా, యిదేదో వార్ధక్య లక్షణం లాగా ఉన్నది: అయితే కానూవచ్చునేమో! కవివి గనుక,- నేనో నారీ మన్మధుణ్ణి తాటాకుల్లో కట్టుదిట్టం చేశావు! కాని,- కాలాన్ని అరికట్టగలమా! నాకు మూడు వెనుకలబుట్టి,- నిన్న మొన్న టిదాకా నాకళ్ళముందు సిగ్గూ బిడియం లేక గంతులేసింది,- మా పెద్ద మనుమరాలు దాని పిల్లవాడికి,- నిన్న పుట్టిన రోజట,- వెయ్యేళ్ళకూ మూదేళ్ళు వెళ్ళినాయట! అవునోయీ,— యిప్పటికీ యిదో ముచ్చట!- యింతకూ నేను చెప్పవచ్చిం దేమిటంటే— తెల్లవారు ఝామున మెలకువ వచ్చే వేళకు కల వచ్చింది: నీవూ నేనూ దక్షారామంలో స్వామి సన్నిధిలో ఉన్నామట! మనమే కాదు — వేలాది ప్రజ!— మహా శివరాత్రా యెను: అక్కడ ఆ చిన్నది నాట్యం చేస్తూ న్నది- సరే— ఆ తుమ్మెద రొద యథా ప్రకారమే! తెల్లవారు ఝామైంది. ఒక్క తుమ్మెదలేదు! అదేమో అని,— అందరం దిగ్భ్రాంతులం!- ఒక్క రెప్పపాటు!- మళ్ళీ కమ్ముకున్నాయి. ఎవర్ని? ఆమెను! తేనె చినుకులతో అభిషేకించినాయి.. అప్పుడా చిన్నది ఎలా ఉన్నదని,— శివజటాజూటం వలె! ముద్ద మందార ధగధగలాడినట్లు,

అంతలో,— కర్పూర దీపములై,- అంతలో కెంపుల రాశిమలై!- ఆ తుమ్మెదలన్నీ గుంపు కట్టి,— శ్రీగిరి-పర్వతమల్లే మేటి వేసినాయి— అన్ని గొంతులూ శంభో! అన్నాయి;— తుమ్మెదలు మాయమైనాయ్,- ఆ-చిన్నదీ మాయమైంది!- యిదీ కల;- కలే లేస్తూ:- అని ఎంతగా సంభాళించు కున్నా,— మనసు నిలవడంలేదు, తీరా,- రేపే కద శివరాత్రి!- ఏం కానున్నదో!- యీ కళ్ళకు ఆ ప్రాప్తం కూడా లేకుండా పోతుందేమో!-" యిలా కొందల మంది నాడు.

"పోనీ, వింతగా పుట్టింది - విడ్డూరంగా పెరిగింది. దేవికీ దేవరకు వేడుక చేసింది. అందుకు మెచ్చి, వరమిచ్చిన వేలుపు - గిరిపై నిలిపెనేమో!-" అనినాడు శ్రీనాధుడు:

"నీ వన్నదే నిజమైతే .... యీ జన్మ కింతేగద!. లే. కదులు దక్షారామం పోదాం!-"

"ఎందుకూ—"

"నీవు యాత్రకు వచ్చిన విశేషాన, నా కల అబద్ధమయేందుకు!-"

"శివుడు తలచుకుంటే శ్రీనాధుడు ఆపు తాడా!- నీకు కలలిచ్చినవాడు,- నాకు కదిలేందుకు ముగుదల యివ్వవద్దూ!- తత్ప రుణ్ణై వానిని కొనియాడి కొలుచు కున్నం దుకు, తన కనుచూపు మేరలోనిలువనీయ కుండా తరిమి కొట్టాడు, తానే యీ నీడ చూపినాడు. వాని దయ ఆ తీరు. నే నెలా రాగలనయ్యా?—

మామా!- కోయిల ఎల్లకాలం, ఒక్క కొమ్మమీదనే ఉంటుందా?- యిక్కడ పుట్టిన మబ్బు యిక్కడే వర్షిస్తుందా?- కలలోనైనా నీకు శ్రీశైల శిఖర దర్శన భాగ్యం లభిం చింది— అది చాలదా?—

నీవు రావా;—

ఆమెను సాగనంపేందుకు యిద్ద రెందుకు?

శివశివ-

శివులిద్దరు కారు - ఒక్కడే - అద్దము లెన్నో,- అన్ని ప్రతిబింబాలు- కాని,- అధారమొక్కటే - అంతటా ఆ తళుకే!- అని మనకు తెలియనిది కాదుగా మామా!

నిజానికి,- తానొక్కడే,- తనకు నిలయ మొక్కటే కాని,- సీమ కొక్క తీరున,- మరో పేరున,- కొలువు దీరడం దేనికి,- చిత్తాన జేర్చిన వారెక్కడి కక్కడే తరించడానికి!-

చకోరం కంటికి ఒక్కొక్క వెన్నెల చిందు ఒక్కొక్క చంద్ర బింబం, మన తీరూ అంతే!-

నరులలో కొందరు చకోరాలు, కొందరు చంద్రకాంతశిలలు,అర్థమయిందిగా మామా! ఎగిరిపో!-"

అన్న మంత్రి మరి మాటాడ లేదు. ఎదుట నున్న స్వామికి మ్రొక్కి,- ఎదురు చెప్పిన కవిరాయని - మ్రొక్కినంత కసురు చూపున చూచి, కదలి పోయిన వాడు కాగా,-

అక్కడ,- ఆ దక్షారామంలో ఆ మరు నాడు,- అన్న మంత్రి కల ఆరుదూరుగా నిజమై ఊరుకున్నదట- అదెలాగంటేను.

స్వామి సన్నిధిలో,- కుహూ, నాట్యము ఆరంభమైంది.

ఆ యింతకు ముందు చెప్ప మరచాను!

ఆ చిన్నదాని పేరు - కుహూ. ఆ పేరు ఎలా,- ఎలా వచ్చింది?

ఎవరూ పెట్టారు?—

స్వామివారి వనంలో-కోయిల-

కుహూ- అని వినిపించగానే,- యీ విన్నది.—

వెనువెంటనే ఆవంకకు బదులు చూసే దట—

ఆపేరే— పేరుకాగా,—

అలా నాట్యమాడే తరుణాన,— నిత్యకృత్యంగా, వచ్చే తుమ్మెదలు రా వ డ ం,— మ్రోయడం,— అది పరిపాటేకదా,— కాని, ఆనాడు,— అంతకు ముందెన్నడూ లేనిది,— ఆ బంభరాలన్నీ,—ముఖమంటపంలో ఆసీనులై ఉన్నవారిని కమ్ముకుని,— కన్నుమన్ను కాన నీయకుండా,— చికాకు చేయడంతో,— అక్కడే ఉన్నవారందరూ, తలకొక దిక్కుగా చెదిరి పోవడం తటస్థించింది:

అందరూ,— అ ం టే,— అన్నమంత్రి తప్ప తతిమ్మా వారందరూను:

ఆయనకు, చీమకుట్టి నట్టన్నా లేదా?

లేదు,— తనధ్యాసే లేదు.

ఉన్నట్టుండి- కనులముందు, మబ్బు కమ్ముకున్న ట్టనిపించింది. మరల చూపు అబ్బేసరికి,— ఆమె కనిపించ లేదు.

ఆయన గగ్గోలు పడలేదు.

సరేలే తండ్రి నీ చిద్విలాసమే— సాగనీ అనుకున్నాడు. వేకువ వరకూ అక్కడనే కూర్చున్నాడు.

అనుష్ఠానం తీర్చుకొని,— స్వామివారి కేళీవనం జేరుకునే సరికి— అక్కడ కనిపించిన దెవరు?- ఆ చిన్నది.

చేర రమ్మని సైగ చేసింది.

ఆసీనులు కమ్మని, కనులతో మనవి చేసింది. అన్న మంత్రి,— తనకు తోడుగా,— ఉంచుకునే ఆ గ్రంథాల వంక జూసింది. అవి ఏమిటి,- భీమఖండం - కాశీఖండం!— చదివి వినిపించమని తల ఊచింది. అన్న మంత్రి పారాయణ చేసినట్లు వినిపించినాడు-

విన్నది,— అచిన్నది ఒక్కరితేనా?-

ఉహూఁ గ్రామానికి గ్రామం అక్కడే ఉండెనే!—

అలా చదివించు కున్నది.

విన్నది—

శంభో!— అన్నది!—

అది, మరింత విడ్డూరం కాదూ!-

అన్నాళ్ళకు పలుకు వచ్చిందా?—

వాడు అప్పటికి పలుక నిచ్చాడా?

ఏమోలే!— అది మన ఊహకు మాలిన విషయం.

వినడం పూర్తికాగా,— యిక ఉన్నచోట ఉండలేదు.

కదిలింది,

అమ్మా అమ్మా అంటూ అందరూ ఆక్రోశించినారు. వెంటకదిలినారు. అన్న మంత్రి వారినందరినీ నిలుపు జేసి,- తానొక్కడే,— ఆమెను, అనుసరించినాడు.

కేళీవనం,- విడిచి వచ్చినారు,

ఏడడుగులు వేశారు.

"తాతా!— మల్లెల పూజల మక్కువల వాడు— మనసుపడి రమ్మని మరులంపినాడు.

సిగపూవా, రావే యనె— నగుమోమున

చెరిసగమ్ము నాదేయనె, నీ సొగసుల వసుగై సేయవె, జిగికెంపుల మోవి సుధలు జిలుకన్ రావే-

అని తుమ్మెదలు వార్తలం దించినవి కదా! ... ఆ అయ్య కెరిగించ వయ్యా శివానందా!...."

అలా పలికిందై,- కుహూ,- ముందుకు సాగి పోతూండగా,- అన్నమంత్రి మనసు పరిపరి విధాల పోయింది,- కాని, కాలు కదల్చ లేకపోయినాడట- ఆమె కనుచూపు మీరి పోయేంత వరకూ అలాగే నిలుచున్నాడట...

నిలుచున్న దెవరు?- అన్నమంత్రి కాదు-

శివానందుడు. ఆక్షణం నుంచీ శివానందుడు.

అడుగు దానంతట అదే కదిలింది- కేళీవనం జేరుకున్నాడు. అక్కడే ఉండిపోయినాడు. ధన్యాత్ముడు కదా!-

అలా ఆచిన్నది. అక్కడ నుంచి కదలిందా?

తిరిగిన దేశంకాదు - వెంట ఎవరూలేరు.

ఒక్కగా నొక్క ఆడకూతురు.... ఏళ్లగడచి, ఊళ్లగడచి,- ఎలా జేరుకున్నది శ్రీశైలం?-

ఎలాగేమిటి?- వాడే చేదుకున్నాడు.

అంతే కద!-

సరే అంతదూరం వెళ్ళింది? ఆలయం లోనికి వెళ్ళింది. అక్కడ ఏం జరిగిందనుకున్నారు?-

దైవదర్శనం జేసివస్తున్న ముమ్మడి కొంతయ్య అనే ఒక చిన్నవాడు అడుగు బెడితి,- కొండల పెట్టున కూలబడటం సంభవించింది. కొండల పెట్టున- అంటే తేలిపోవడం లేదూ- పైగా ఆ పద్ధ పాటు సామాన్యమా?- ముందు చతికిలబడి,- వెంటనే సాగిలపడగా,- చూసే వారికి, ఎలాఅనిపించిందంటే- యీ పెద్దమనిషి ఎదురొచ్చిన ఆడమనిషికి మొక్కుతున్నట్టూ తోచింది-

అదిసరే- మరొకరూ మరొకరూ అయితే అది చూసి,- ఎలా విరగబడి ఉండేవారో,- కాని,- పద్దవాడు,- పెద్దశెట్టి- కుబేరుడి తమ్ముడు, ఎదుటి మనిషిని దేవుడల్లే చూసుకునేవాడు. అలాటి వాడు,- నిజంగానే,- పడ్డాడే అనుకుందాం- చూసి నవ్వేవల్లనా?- అలా అని. నలుగురూ ముందుకు వచ్చిచే ఆసరా యిచ్చి లేవదీశారా?- అలాంటి స్థితిలో, ఆయన ఉండగా,- తాము ముందుకు రావడం తగునో- తగదో అనే అంచాయింపు ఉంటుంది కద!- కాగా,- అలాపడ్డ వాడు,- అలాగే ఒక్కనిమేషం ఉండి — అమ్మా! అనుకున్నాడు- యీ చిన్నది,- అన్నా!- అన్నది పసిపిల్లవాడిని లేవనెత్తినట్లు లేవదీసింది.

అలాపడటంలో,- కాలు కొంచెం మెలిక పడినదేమో - అడుగువేయ లేకపోయినాడు. "అయ్యా మల్లికార్జునా,-" అనిగంట మ్రోగినట్టు మ్రోగినాడు. అడుగు తిన్ననైనది.

"అమ్మా! చూడగా నాకన్న చిన్నదానవు. చూడకుండానే మ్రొక్కాను, వాడిదయ-

"అన్నా"- అన్నావు - వాడనిపించాడా అమ్మా?-

నాకు, తోడబుట్టిన వాడు లేరు-

వాడు యివ్వలేదు.

సీమలో వారందరూ, మా తాత తండ్రుల కలిమిచూసి,- నన్ను- గౌరవిస్తారు కాని,-

అన్నా- అని అన్నది సీవాక్కు_ర్తె వే!- నాకు యిన్నాళ్ళకు తల్లీ తోడూ అంటూ అబ్బింది- సరేనమ్మ- నా చెల్లెలు పేరేమో-"

"చెల్లెలే"

"తల్లితోడూ-"

"దైవమే."


"ఆలనా పాలనా జేసేది-"

"ఆలయంలో- వారే!"

"అర్థం కాలేదమ్మా:"

"నాకూ అర్థం కాలేదన్నా!- వాడిని అడిగేందుకే వచ్చాను, నేను రావడమా? తప్పించు కున్నారా?

అన్నా. దక్షారామంలో.- స్వామివారి కేళీవనానికి- కవనం వచ్చింది. వనానికి వసంతం వచ్చింది. ఆ వసంతంలో.- ఒక



పువ్వుపూసింది, ఒక కాయ కాచింది ఒక తల్లి కడుపున.

తల్లి ఒడిలో బిడ్డను- ఆలయంలో వాడు లాక్కున్నాడు- మూగను చేసి నాట్య మిచ్చాడు. సాగిపోవే అని పలుకిచ్చాడు. పొమ్మన్న తావుకు జేరుకున్నాను. రమ్మన్న దెందుకో!___"

"మరెందు కమ్మా!- మా క న్ను ల వెన్నెల కాచేందుకు. యిప్పటికి తెలిసి వచ్చినదమ్మా!- నీరాకతో శ్రీగిరి ఘుమ ఘుమ లాడుతూంది. ఆలయ భాగమంతా ఏకంగా మల్లికా నికుంజమైనది- యెంతటి దయా నీదయ మల్లికార్జునా!-"

యిలా వారు పలుకాడి బాసాడిన వారు కాగా,-

అనంతరం ఏమైనది?-

ఆలయంలోకి స్వామి దర్శనానికని వచ్చిన చిన్నది.- ముందుకు అడుగు వేయకుండా వెను దిరగంగా.- శాంతయ్య.- "అదేమమ్మా" అన్నాడు.

"వారు నన్ను యిక్కడ ఆగమన్నారు- నా ఎదుట పడేందుకు- వారికి బిడియమేమో- పోనీ – అన్నా,- యిదో, యీ చెంపను,- పది బారలిటు నడచి పది బారలటు నడచి,- నడచి నడచి,- వంచిన తల ఎత్తగనే ఎదుట మల్లెల వనమున్నది. అందులో,- మంచిగంధపు మ్రానున్నది. ఆ మ్రాను నీడను, నన్ను నిలువమన్నాడయ్యా-" అంటూ సాగిపోతున్నది- "అన్నా వెన్నెల వేళకు. యీ చెల్లెలిని చూడరావా!, అని,- కనుచాటైంది.

అలాగే,- వెన్నెల ముసిరే వేళకు,- శాంతయ్య.- అడుగులో అడుగు వేసుకుంటూ మల్లెల వనం జేరుకున్నాడు.

వెన్నెల మరింత వెలుగులో ఉన్నది- అంతలో రవ్వంతమేర,- ఎర్రని చీకటి! అందులో ఆ చిన్నది- హిమనగ శృంగంవలె నున్నది.-

బాల నాగము లామెకు సొమ్ములు,-

పైన మిణుగురులు,- వెలుగు పట్టినవి.

అచెంపా ఈచెంపా,- పడిగలు విచ్చి కోడె త్రాచులు ఆ మూర్తికి వీవన సేవ జేస్తూన్నవి.

శాంతయ్యకా నెలవు కైలాస మనిపించినది—

అలాగే - తెలవారినది;—

శ్రీ శాంతయ్య భిక్షావృత్తి యతీంద్రులు,-

తమ మూలభృత్యుడైన దేవయ శాంతయ కోసం కలయ జూసినారు; అతడు కానరాలేదు;-

యతీంద్రులకు పుష్పోపహారము సమర్పించడం వానివిధి. ఆ పూవులు తానై లెంకలకు ప్రసాదంగా పంచి యివ్వడం నిత్యకృత్యము; అతను లేనిదే ఆ వైభవం జరుగదు -

ఆనాడు,- ఆ వేళకు- రాలేదు-

తీరుబడిగా, వచ్చినవాడు- మనవులిచ్చుకోలేదు,- యతీంద్రులకు తామసం-ఆగలేదు మృదువుగానే గద్దించినారు- ఆతడూ, వినయంతోనే బదులు పలికినాడు ఏమని?

"యీ గిరిని పూచిన పూవు, దైవానికే గాని, దైవ స్వరూపులని మేము భావించే తమకైనా సమర్పించడం అపచారమేమోనని భావన కలిగింది."

యిలా పలుకడం అపచారమని వారు భావించినారు. కాని, లోకజ్ఞులు కావడంతో- అదిన్నిగాకుండా శమదమాదులు కొంత మట్టుకైనా అలవడి ఉన్నవారు కావడంతోనూ వారు.- మందహాసము చేసి, మౌనము వహించినారు; కాని,శాంతయ్య ఆ మౌనాన్ని సహించలేదు.

"గిరిని వెలసిన వాడు,-కింకరుల సేవలు యింతకాలము చేకొన్నవాడు.- మనకు కైవల్య మీయ దలచిన వాడు. తన మహిమ జూపినాడు గురుస్వామీ!

పూజకై పుట్టి.— పుణ్యాన పెరిగి.- నాట్యాన సేవించి. నవకమ్ము దేలి—

"సీమకాని సీమలో.- సుమ్ము కోమలి పరిమళించిన దాయెనయ్యా- పరిమళ మిచ్చిన దేవర. పరవశమిచ్చి బంభర నాదాన మెచ్చి.- తన సేవలకై తానై తర లించుకు వచ్చినాడు—

"కనులతో వెదకితే కానని వనములో.-
కల్యాణి కాపురమ్మాయెనయ్యా-
తన తెలిదళుకా తరుణి కొసంగి.-
తన సొమ్ములు నెమ్మెనికి దార్చి.-
తన పూజాద్రవ్యము నాఘనుడేలే నయా!-"

—యిలా శాంతయ్య పలుకంగా.- ఆ సన్నిధిలో ఉన్నవారికి ఎలా అర్థమవుతుంది? శాంతయ్య చపలచిత్తుడాయెనేమో అనుకున్నారు. యతీంద్రులు మట్టుకు ఆకళింపు జేసుకుని.- శాంతయ్యా! మా కనులకు ఆ పుణ్యము దాపురించేనా.- అనగా.- అయ్యా - మీకూ ఆ ప్రాప్తము వాడే అనుగ్రహించేనేమో—" అని. వెనుదిరిగి పోగా యతీంద్రులు తామొక్కరూ, వానిని అనుసరించి పోయిన వారైరి? ఎక్కడికి?

అక్కడికే.- కాని, దర్శనం లభించిందా?- లేదు— అల్లంత దూరాన ఉండగానే.- నాగు పాములు బుసలుకొట్టి.-తరిమి కొట్టినవి. ఎవరిని?. యతీంద్రులను. శాంతయ్య.- తన కులాన బుట్టిన విరికి తనాన్ని యతీంద్రుల వెంట సాగనంపిన వాడు కావడంచేత.- జంకూ గొంకూ లేక పోయింది. యతీంద్రులు.— ఏక బిగివిని. వెనుజూడకుండా తమ ధర్మాసన స్థలి జేరుకున్నారు. శాంతయ్య మరో ఝాముకు తిరిగి సన్నిధికి వచ్చిన వాడైనాడు. అప్పటికి యతీంద్రులు తెప్పరిల్లినారు. మరల ఎప్పటి తీరైనారు.

అక్కడి కథ — ఆది!—

యిక్కడ రాజమహేంద్ర వరములో— అన్న మంత్రి వర్తమానం తెలిసింది. శ్రీనాధునికీ తెలిసింది— అతడు స్వామి వంకజూసి.- ఆలయం విడిచి వచ్చినాడు! ఆకసం వంక జూసినాడు.-

స్వామి ఆలయంపైన మబ్బు కట్టింది.

కట్టిన మబ్బు. గాలి తరుము తున్నట్లు సాగిపోయింది.

శ్రీనాధుడూ కదలినాడు- దక్షారామం జేరుకున్నాడు-

శివానందుడు. కవిరాజును చూసి పకపకలాడినాడు-

కుహూ పలికిన పలుకులు వినిపించినాడు-పైగా అన్నాడు కదా- మామా!- యిక నేనిక్కడ - నీ వక్కడ! వనంగాని వనంలో, ఘనంగా మంచి గంధపు పరిమళం-శ్రీ గిరి పురమై-కాపురమైన వానికి.- ఆ చందన చర్చ నీవు లేనిదీ జరుగదట.- పోయేవా?- నీ కవనం. ఏ కాలానికి మా పరమై.- తెలుగు తనానికి వరమై నిలవా లని.-

శివానందుడి తపస్సు.
నీ కవితే - నా కైవల్యం-
యిక నీవూ తరించేవులే-
తరలిపో.-" అంటూ కౌగలించుకున్నాడు; శ్రీనాధుడు శివానందునికి.- సాష్టాంగ ప్రణామము జేసి:- కదలి పోయినాడు-

శ్రీశైలంలో, యతీంద్రుల సన్నిధిలో ధర్మబోధ ప్రారంభమైనది. వారు - యీశాన సంహితలోని సుకుమారుని కధను వివరించినారు. వినిన వారిలో శ్రీనాధుడూ ఉన్నాడు. ఏ మాకథ-

సుకుమారుడు - వేదశాస్త్ర సంపన్నుడు.

దానికి తోడు సంపన్నుడు-

తలిదండ్రుల కొక్కడే బిడ్డ- వరప్రసాది, మాంచి రూపసి. అలాటి చిన్నవాడు యౌవనోదయంతో వెర్రి మరులెత్తి.- సీమనున్న కన్యలను నిలవనీయలేదు. ఏలేవాడు యీ ఆతతాయి తనాన్ని మన్నించుతాడా.- బ్రాహ్మణుడు కావడంతో తల దీయించకుండా ఆ సీమ నుంచి తగిలేయించాడు. యిక అక్కడితో వానిగతి మరో అధోగతి. చాండాలికి ప్రియుడైనాడు.- కన్న కూతుళ్ళతో కాపురము చేసినాడు.- చివరకు దిక్కుమాలి అంతరించినాడు; వాని కోసం యమ దూతలతో శివ దూతలు హోరాహోరీ పోరాడి - జయించినారు; సుకుమారునికి శివసాయుజ్యం లభించింది.

ఎందుచేత?-

ఒక శివరాత్రినాడు.- తినుటకు ఏదీ దొరకకపోవడంతో వానికి ఉపవాసం. శివనామం చెవిని బడ్డది. అదీ వాని సుకృతం

ఎంతటి పాపాత్ముడైనా తరించేందుకు అవి చాలును!-

యిదీ సారాంశం.

శ్రీనాధు డనలేదు- అనకపోగా.- పైగా. సంశయాత్ముడైనాడు.

చిత్తశుద్ధిగా చేసిన పాపం- శివనామం తుడిచివేస్తుందా? పుణ్యాన బోయేందుకు. పాపుల కథలు వినవలెనా?

యిలా అని మనసులో అనుకోలేదు- యతీంద్రులకు విన్నవించినాడు. వారనినారు కదా— "శ్రీనాధకవీ— అందరూ నీవంటి వేత్తలుండరు. యీ ప్రసంగము నీకోసము కాదులే.— వీరికోసము. వీరిని బోలిన వారు వేలాది ఉన్నారు. అందరూ తరించవలెగద. అది.— జగదీశ్వరుని అభిమతము కద!- యీ కథను కావ్యముగా రచించమని.— నీకు ఆదేశించమని శివాజ్ఞ అయినది -.." విన్న వారు అందుకు హర్షించినారు.

శ్రీనాధుడనినాడు కదా "స్వామీ నన్నెన్నడూ కానిపని చేయమని శివుడు ఆదేశించలేదు. అజ్ఞ నేయలేదు— నాకవనం నాకడలేదు- వానికై వసమైనది—

కావ్యము రచించిన వాడే రచించవలెగాని.- యిక నాతరమా?-

అయినా,- తరించేందుకు.- కావ్యాలాపమవసరమా! శివస్మరణ చాలదా?- అందుకు అనుజ్ఞ యివ్వండి!-

యతీంద్రులు అన్నారు కదా-

"యిది, శివాపరాధం"

"నేను పాపరాధినే,- కనుకనే తరింపవలెననే తపనలో ఉన్నాను, నాకు యీ పుట్టు విచ్చినవాడు,- నాచేత కవన మల్లించినాడే కాని పాపకర్మని చేయలేదు. పాపులను వర్ణించేందుకు పలుకీయలేదు- అందుకు తామే సమర్థులని తోచుచున్నది" యీ మాటలు విని - అందరూ ప్రమాన్పడినారు. ఒక్క శాంతయ్య మాత్రం. ఆతరుణానికి,- ఎక్కడనుండో

పరుగున వచ్చి,— యతీంద్రులనూ, మరెవ్వరినీ గమనించకుండా, శ్రీనాథునికే ప్రమొక్కి — ప్రమొక్కిన చేతులతోనే కౌగిలించుకొని,

కవిరాయా, నీ కవనం వనమైనది.

వనానికొచ్చిన చిరునవ్వే వనమాలైనది.

కదలి వచ్చిన ఘనసార కళిక

సామేని వానికి ఆరతమ్యేను - జనకారమ్మన్నది.

అనడం ఏమిటి, శాంతయ్య వెంట శ్రీనాదుడు కదలడ మేమిటి—

కానరాని వనంలో ఘనసార కళిక,

కనువిప్పి చూసింది - కలకల లాడింది-

జనకా అన్నది,- చేయెత్తి ప్రమొక్కింది-

శాంతయ్య,- తనలో తాను లేడు-

నాగములు. కంకణ బంధము విచ్చి బరాబరులుగా, బుసలు కొట్టినవి. శ్రీనాథుని వాణి శంభో, అని మార్మోగింది - ఘనసార కళిక ప్రజ్వలించింది.

స్వామివారి ఆలయంలో, వేయి మెరుపులు మెరసినట్లు, ముమ్మారు తళుకు క్రమ్మినది.

యతీంద్రుల మనసు మహా దేవా: అన్నది.

ఏడీ శ్రీనాదుడు!

తన కవనాన లేడా! ●

● చిలకని పెంచాలనే మోజు పుట్టి ఒకడు బజారుకెళ్లి బేరం చేశాడు. "మీకుగనక యాభైరూపాయలకే ఇస్తున్నాను. దీని అసలు ఖరీదు వంద రూపాయలు. ఇది మాట్లాడ్డమేకాదు, పాటలుకూడా పాడుతుంది. అచ్చు లతా గొంతుకే ననుకోండి," అన్నాడు అంగడివాడు.

యాభైరూపాయలూ ఇచ్చి కొన్న ఆసామీ మూడోనాటికల్లా చిలకని తిరిగి తీసుకొచ్చాడు.

"ఏంసార్, చిలక బాగాలేదా? పాటలు పాడ్డంలేదా?" అన్నాడు అంగడివాడు.

"పాడకేం? పాడుతోంది. కాని లతా గొంతిక కాదు ఆశా భాన్స్లే గొంతిక. నా కక్కర్లేదిది," అన్నాడు ఆసామీ.

ఇంక్రిమెంటాలిటీ




ఉభయ తారక మంత్రాలు:

మన స్తత్వాలు అనేకవిధాలు. గవర్నమెంటాలిటీ, డిపార్టుమెంటాలిటీ, ఆర్గ్యుమెంటాలిటీ...కాని ఇంక్రిమెంటాలిటీలో ఒక విశేషం వుంది. ఇది యజమానికి, ఉద్యోగికి కూడా వర్తిస్తుంది. ఇంక్రిమెంట్ కూడదని వీరికి, ఇవ్వాలని వారికి. ఇది నిరంతర ద్వయం.

ఒకరినొకరు జయించే ఉపాయాలు ఈ తరువాత పుటలలో వున్నాయి. మా పత్రిక కొన్నవారికే ఇవి పనిచేయవచ్చు.


గుమాస్తత్వం



యజమానిలో పితృవాత్సల్యం కలిగించో, జాలిగొలిపో సాధించడానికిగాను మాసినవీ, మాసికలు వేసినవీ బట్టలు [ఆర్ట్ డైరెక్టర్ల సలహా పొందండి] వేసుకుని, సినిమాలో నేపథ్యంపు 'శాడ్ సాంగ్' కి బీద హీరో నటునలా తిరగండి. ఆయన గుండె కరిగిపోవచ్చు [బట్టలు బాగులేకపోతే డిస్మిస్ చేస్తాను అనే ప్రమాదం వుంది, జాగ్రత్త]



సేవాపరాయణత : యజమాని లేనప్పుడు బల్లమీద పిన్నులు కిందజల్లేసి, ఆయన ఇంకో క్షణానికి వస్తున్నాడనగానే, అవన్నీ ఏరి శ్రద్ధగా పిన్ కుషన్ కి గుచ్చుతూ కంటపడండి. ఆయన మురిసిపోవచ్చు [నౌకర్లపని నీకెందుకు. నీపని నువ్వుచూసుకో అనే ప్రమాదంవుంది, జాగ్రత్త.]



యజమాని ఇంటికి వెళ్ళే సమయానికి బోయ్‌ని పిలిచి కాఫీ తాగమని డబ్బిచ్చి పంపేయండి. ఆయన ఫైళ్ళు, ఫ్లాస్కు తీసుకెళ్ళి కారులో పడెయ్యండి. ఆయన బోయ్‌ని తిట్టి మీ జీతం పెంచవచ్చు. [మిమ్మల్ని పర్సనల్ అటెండెంట్ గా డిప్రమోట్ చేసే ప్రమాదంవుంది, జాగ్రత్త]




ఆదివారాలు శ్రీవారింటికెళ్లి పిల్లలతో పసివాడిలా ఆడుకోండి. వాళ్ళని ఎత్తుకుని ముద్దాడండి. మీ బట్టలు మాసినా ఫరవాలేదు, మరీ మంచిది. [ప్రతిరోజూ పొద్దున, సాయంత్రం వచ్చి పిల్లల్ని ఆడించమనే ప్రమాదం, అలా రానిరోజున చివాట్లేసే ప్రమాదం వుంది, జాగ్రత్త.]




అయిదో, పదో అప్పోసప్పో దొరికినప్పుడు బజారుకెళ్ళి కూరలు, పళ్ళు బుట్టలనిండా కొనేసి యజమాని కివ్వండి. "మా తోటలోవేలెండి" అని చెప్పడం మరచిపోకండి. [మీకు కూరలు, పళ్ళు పంచేపాటి తోటలుంటే ఇంక్రిమెంటు దేనికని యజమాని నవ్వేసే ప్రమాదం వుంది, జాగ్రత్త]



యజమాని విట్టేసినప్పుడు [ఆయన చిరునవ్వుతో మాట్లాడి నట్టుంటే అది విట్టే] గొల్లున నవ్వి కిందపడి దొర్లండి. ఆయన మీ సెన్సాఫ్ హ్యూమర్‌కి మురిసిపోతాడు. [మీరు తనని హేళన చేస్తున్నారని కోపగించే ప్రమాదం వుంది, జాగ్రత్త.]



యజమాని మొండిఘటమై, మీ అభినయం, అతి వినయం అన్నీ వృథా అయిపోతుంటే - ఇహ తెగించి అడిగెయ్యండి: "అయ్యా! ఇంక్రిమెంటు కావాలి" అని. ఇవ్వొచ్చు [ఇవ్వకపోయే ప్రమాదం వుంది, జాగ్రత్త.]



మీరు ఎంత తాపత్రయపడ్డా ఇవ్వనిపక్షంలో మీరు తీసుకోబోయే ఎడ్వాన్సుమీద అప్పుచేసి భగవద్గీత కొనండి. గీతలో కృష్ణుడు చెప్పిన మహా వాక్యం — "కర్మణ్యేవాధికారస్తే — —" [కర్మ నీది, ఫలితం నాది] అనేది యజమాని ఎదట లోపల, యజమాని చాటున బయట మననం చేసుకుంటూ, ఇది నా గీత అనుకుంటూ, అప్పులు చేసు కుంటుకుంటూ నడవండి.


ప్లేటుకి రెండో వేపు

యజమానులకు మాత్రమే

వెనక పేజీలలో చెప్పిన చిట్కాలు మీచేత ఇంక్రిమెంట్లు ఇప్పించడానికేనని అపోహపడి, మాకేసి చిల్లుల కిటికీలోంచి చూసి "మోహన్ ;" అని మా పత్రిక చందా రద్దు చేయకండి. అవి కేవలం ట్రిక్కులేనని మీరు పసిగట్టడానికి వీలుగా వేసినవి. ఉద్యోగుల ఇంక్రిమెంటాలిటీ అణచడానికి విరుగుడు చిట్కాలు ఇవిగో:




ఇతనికి ఇంక్రిమెంటు చాలా అవసరం అనిపించేటంత దీనస్థితిలో వున్న ఉద్యోగిని తరుచు మీ గదిలోకి పిలిచి, అతడు నోరెత్తేలోగా, మీ హీనస్థితిని వెళ్లబోసుకుని కంపెనీ నష్టంమీద నడుస్తోందని ఘోరు మనండి. కంపెనీ తాలూకు పెద్ద రహస్యాలు తనతో చర్చించినందుకు అతడు మురిసిపోయి కాలరెత్తుకుని సంతోషంగా తిరుగుతాడు[ఢోకాలేదు.]



సమ్మె కడతారనే ప్రమాదంవుంటే, వ్యాపారం సాగులేనందువల్ల కొందరిని తగ్గించదలచామనండి. దీన్నే రిట్రెంచి మెంటాలిటీ అంటారు. ఆ దెబ్బతో తగ్గిపోతారు [తక్షణం సమ్మె కట్టే ప్రమాదం వుంది, జాగ్రత్త]



బోనసు ఇచ్చిచూడండి. ఇంక్రిమెంటుకన్న ఇది చవక. [తమకు తెలీదా యేవిఁటి ?] కొన్నేళ్ళపాటు కిమ్మనరు. [ఆ డబ్బు చేతపట్టుకుని సమ్మెకట్టే ప్రమాదం వున్నది జాగ్రత్త.]



ఎందుకొచ్చిన గొడవ, ఇంక్రిమెంటు ఇచ్చెయ్యండి. అలా తప్పని సరి అయి ఇస్తే ఎగుడు దిగుడుగా యివ్వండి. పక్షపాతం చూపండి. ఐదారేళ్ళపాటు ఇంక్రిమెంటాలిటీ తలెత్తకుండా ఇది టీకాల మల్లే పని చేస్తుంది.

గమనిక

ఇంతవరకు మీరు చదివినది ఉగాదినాడు మీ ఉబుసుపోకకోసం రాసిన అభూత కల్పన. అంతేకాని, నిజంగా ఇలాంటివి జరుగుతాయని కాదు. పొరపాటున ఇందులోంచి గుమ్మడికాయ లేవైనా వాటంత టవి ఎగిరిపడితే పక్కవాళ్ల బుజాలు తడవండి.

(4)

ఓడిపోయిన మనిషి

బాలగంగాధర తిలక్

తెరచి ఉన్న కిటికీలోంచి వొంటిమీద జల్లుపడి చటుక్కున మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి కిటికీలోంచి చూశాను. సన్న చినుకులతో వాన. గాలి మాత్రం తీవ్రంగా వీస్తోంది. సగం నలుపూ, సగం తెలుపూ గల తెలవారగట్ల సన్నని చినుకుల దారాలు గాలిలో కదలిపోతున్నాయి, చెదరిపోతున్నాయి. ప్రహరీ గోడ దగ్గర మందార చెట్టు పువ్వులు ఎర్రగా వానలో తడుస్తున్నాయి. చల్లని గాలికి వొళ్ళంతా ఏదో హాయిగా వుంది. చల్లదనం మనస్సులోకి వెళ్ళి బాధ్యతల్నీ, సమస్యల్నీ, భయాల్నీ దాచుకున్న వేడి నెరిబెల్లానికూడా చల్లపరుస్తోన్నట్టు అనిపించింది.

కళ్ళు మూసుకున్నాడు. ఎవరో మంచు కొండలమీద స్కేటింగ్ చేస్తోన్న దృశ్యం. విశాఖపట్నంలో డాల్ఫిన్స్‌నోస్ దగ్గర తెల్లని ఓడ కదలుతూన్న దృశ్యం. మద్రాస్ కాలేజి ఆవరణలో ఎవెన్యూలో నడుస్తూన్న దృశ్యం. ఈ మూడింటికీ ఏదైనా సంబంధం వుందా? హాయిలో హాయి అనే పర్ధుపులో నన్ను నేను చుట్టబెట్టుకున్నట్టు ఏదో ఫీలింగ్; ఈ ఫీలింగ్‌ని పోనివ్వకూడ దనుకుంటూనే వొళ్ళు ముడుచుకుంటూ, కళ్ళు మూసుకుంటూ చల్లని వానని మనసులో కురిపించుకుంటూ, చెయ్యి పక్కకి జాపాను. మెత్తగా ముదురుగా లావుపాటి పాత రబ్బరులాగ చేతికి తగిలింది. అంతవరకూ పక్కమీద నా పక్కనే సుభద్ర పడుకుని వుందన్న మాట మరిచిపోయాను. పంద్రెండేళ్ళ క్రితం తాకగానే కొత్త ఉద్రేకాలూ, రహస్యాలూ నాలో ప్రసరింప చేసిన యీమె శరీరం, యిన్నేళ్ళ పరిచయంలో, అనుభవింపబడడంలో, పిల్లల్ని కనడంలో వయస్సు పెరిగి యీనాడు ఆకర్షణని కోల్పోయి "ఇల్లాలు" అనే ఒక వ్యర్థ గౌరవపదమైపోయిన యీమె శరీరం, నా చేతికి తగలగానే వానా, వేకువా, మందార చెట్టూ గబుక్కున మాయమైపోయాయి.

వాటిస్థానే పెళ్ళికి ఎదుగుతూన్న ఆడపిల్లా, టాన్సిల్స్ ఆపరేషన్ చేయించవలసిన చిన్న కొడుకూ, బ్యాంకిలో తరిగిపోతూన్న డబ్బూ, ఎప్పుడూ రిపెయిర్స్ కొచ్చే కారూ వచ్చి నిలుచున్నాయి. కాసేపు కూడా

కల్పనా సుఖాన్ని ఊహించుకో నివ్వని కఠిన వాస్తవికతలా కనపడింది భార్య. ఆమెవైపు తిరిగి చూశాను. వొంటిమీద సగం సగం బట్టతో, రేగినజుట్టుతో గృహిణీ ధర్మాన్ని రోజంతా నిర్వహించిన అలసట కనుపించే కను రెప్పలతో, లావెక్కి వొంపులు మాయమైపోయిన వొంటితో జాలిగా కనుపించింది. ఏదో బాధ అనిపించింది. ఎవరో నన్ను దగా చేస్తున్నా రనిపించింది. మాంచి ట్యూన్ వినిపించే రేడియో గొంతుని ఎవరో నొక్కేసి వికటంగా నవ్వినట్టనిపించింది. ప్రథమ యౌవన దినాలు లీలగా జ్ఞాపకం వచ్చాయి. సుతారపు అత్తరువాసన లాంటి జ్ఞాపకాలు—ఆ రోజులు!

మళ్ళీ అటు తిరిగి పడుకున్నాను. చల్లని గాలి మొహానికి తగులుతోంది. వెనక్కి వెళ్ళిపోతున్నాను—ముదిరిన ఏళ్ళ పర్వతాల మీదనుంచి వెనక్కి వెనక్కి లోయల్లోకి, పచ్చిక బయళ్ళలోకి వెళ్ళిపోతున్నాను. రొమాన్సూ, ఆదర్శాలూ, అమాయికత్వం కలిసిన వేడి వేడి రక్తం. పడుచు పిల్లలన్నా, కవిత్వం అన్నా, సోషలిజం అన్నా బలే బలే యిష్టం. జేబు నిండా డబ్బూ, సినిమాలూ పైలా పచ్చీసుగా వుండేది. భావ కవిత్వం మీదా, సుభాష్‌బోస్ నాయకత్వం మీదా మోజు. ఇంగ్లీషు వాళ్ళన్నా, ఉద్యోగస్తులన్నా చిరాకూ, ద్వేషమూ.

ఆ వయస్సులోనే చిన్న చిన్న రొమాన్సులు ప్రారంభం. రెండు కలువ రేకుల లాంటి కళ్ళుగాని, చివరకి—జవ్వాడే నడుం మీద నాట్యంచేసే వాల్జడగాని కవిత్వంలోకి పంపివేసేది. సామ్రాజ్య వాదాన్ని, సంప్రదాయాన్ని ఎదిరించాలనే సాహసం. కాని మరి కొంచెం ఎదిగేటప్పటికి నాకు తెలియకుండానే ఎన్నో జాగ్రత్తలు వచ్చి కూర్చున్నట్టు తెలుసుకున్నాను. లోపల—నా లోపల ఎవడో పెద్దమనిషీ బుద్ధిమంతుడూ అయిన వాడు పరివ్యాప్త మౌతున్నాడు, మెడచుట్టూ కండువా వేసుకుని, కొంచెం వొంగి, కర్ర నానుకుని జీవితాన్ని భద్రంగా యిటూ అటూ చెదరిపోకుండా తాళం వేసుకుంటున్నాడు. బాలని ప్రేమించాను. అలాగని చెప్పాను కూడా. అయినా చివరికి ఏమీ ఎరగనట్టుగా తప్పుకున్నాను. పెళ్ళి పందిట్లో ఆ రాత్రి నేను తలనొప్పితో విడిది మేడగదిలోనే పడుకున్నాను. అందరూ పందిట్లో వున్నారు. పెట్రోమాక్సు లైటు ఆరిపోయింది. కిటికీ లోంచి వెన్నెల పడుతోంది. మెట్లమీద చప్పుడు వినపడింది. ఎవరా అని చూశాను, బాల! కళ్ళని కాటుకతో, బుగ్గ మీద చుక్కతో బాల, నాదగ్గరికి వచ్చి తట్టి లేపింది. ఏమీ ఎరగనట్టుగా "ఎవరూ?" అన్నాను.

"నేను బాలని," ఆమె గొంతులో బాధ, ఆవేశం. "రేపు వుదయమే నాకు పెళ్లి అయిపోతోంది."

నేను మాట్లాడ లేకపోయాను.

"ఏం నిద్రపోతున్నావా" అంది.

"లేదు."

"ప్రేమించాననీ, పెళ్లి చేసుకుంటాననీ అన్నావు. పల్లెటూరి పిల్లననీ, ప్రతీమాటా నమ్ముతాననీ, ఏం చేసినా ఊరుకుంటాననీ అను కున్నావా?"

".... ...."

"ఏం మాట్లాడవేం?"

"అదికాదు బాలా, ఇలా జరుగుతున్నందుకు నేనెంత బాధ పడుతున్నానో దేవుడికి తెలుసును."

"మరి—?"

"మావాళ్లెవరికీ యిష్టంలేదు. మీ కుటుంబానికీ మాకూ శత్రుత్వముందిట. మీ చిన్నాన్న మా నాన్నని చంపడాని కొచ్చాకుట."

"ఇదివరకు నీకు తెలియదా?"

"తెలియదు."

"అది జరిగి యిరవై ఏళ్ళయింది. ఇప్పుడు దెబ్బలాటలు లేవుగా, ఒకరిళ్ళ కొకరు వస్తున్నారు, మాట్లాడుకుంటున్నారు...."

"అయినా మావాళ్లెవరికీ యిష్టంలేదు."

"మీవాళ్ళంటే....?"



"మా నాన్న, అమ్మా, మా అక్కయ్య అన్నయ్య, మా మేనత్త.... ఆఖరికి మా పాలేరుకి కూడా."

"అయితే యీ పళంగా ఎక్కడికేనా పారిపోదాం. నా వంటిమీద నాల్గు వేల బంగారం వుంది. నిన్ను వొదిలి వుండలేను"

"ఛ-ఛ యిప్పుడెలాగ. నలుగురూ ఏమనుకుంటారు?"

ఆమె ఏడుస్తూ కూర్చుంది. బాల చాలా అందమైనది. అదొక విలక్షణమైన ఉజ్వలమైన అందం. అటువంటి అందం అన్నిచోట్లా కనుపించదు. నాకు బాధగా వుంది. నిజమే కాని ఎంతమందిని ఎదిరించి, ఎన్ని అడ్డంకుల్ని దాటి, నా భవిష్యత్తుని ఏం చేసి యీమెని నా దాన్ని చేసుకోగలను? కోపంతో మరీ ఎరుపెక్కిన జీరలు కల కళ్లుకల నాన్న మొహం. నిరసనతో చూసే అమ్మ మొహం. పద్దెనిమిది వేల కట్నంతో జడ్జిగారి సమ్మంధం. రాజకీయంగా వేసుకున్న ప్లానులు.... యివన్నీ ఏమౌతాయి.?

"కిందికి వెళ్ళిపో బాలా. ఎవరేనా వొస్తారు," అన్నాను.

బాల కోపంగా లేచి నుంచుంది. వెన్నెల రేకలో ఆమె పెదవి వణకడం కూడా కనపడింది. కోపమూ ఏడుపూ కలిసిన కంఠంతో "నూతిలోపడి చద్దామను కున్నాను. కాని తప్పు నీదికాదు. నువ్వు మగవాడివి కాదు. నీకన్న ఏ వెధవైనా వెయ్యిరెట్లు నయం." అని విసవిస వెళ్ళిపోయింది. స్తంభించిపోయిన నా లోపల్లోపల యీ సమస్య యిలా పరిష్కారమైనందుకు సంతోషించానో, ఆమె దూరమై పోతున్నందుకు బాధ పడ్డానో నాకు తెలియలేదు.

నాలుగేళ్ళ అనంతరం ఆమె చాలాజబ్బుతో జనరల్ ఆస్పత్రిలో వుందని తెలిసి మనసు పట్టలేక వెళ్ళాను. నర్సు వచ్చి "మిమ్మల్ని చూడడానికి వీల్లేదంది ఆమె. మిమ్మల్ని పంపించి వెయ్యమంది" అని చెప్పింది. నర్సుతో బతిమి లాడాను. ఆమె నా వల్లనే నా కోసమే యిలా అయిపోయిందన్న బాధతో, పశ్చాత్తాపంతో కాలిపోతున్నాను. చివరకి ఆమె దగ్గరకు వెళ్లాను. వందకేరెట్ల రత్నాన్ని చెక్కివెయ్యగా చెక్కివెయ్యగా మిగిలిన అణువులా ఆమె కృశించిన శరీరమూ, మొహమూ మెరుస్తోంది. నన్ను చూసి ఆమె పక్కకు తిరిగి పడుకుంది.

"బాలా"

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"నన్ను క్షమించు. ఒకటి చెబుతున్నాను. ఏనాడూ నా హృదయం నుండి నువ్వు తొలగిపోలేదు. నేను పిరికివాణ్ణి. కాని ఆజన్మాంతం నిన్ను మరిచిపోను. మనసా నేను నీ వాడిని."

ఆమె చెయ్యి చేతిలోకి తీసుకున్నాను. నా మాటలు ఆమె నమ్మలేదు. అవిశ్వాసంతో, ఆశ్చర్యంతో పెద్దవైన కళ్ళతో నన్ను చూసింది. నాకు కన్నీరాగ లేదు.

"వస్తాను బాలా" అని డగ్గుత్తికతో గబగబా ఆమెని విడిచి వచ్చేశాను.

ఒక నెల్లాళ్ళ తర్వాత ఆమె చనిపోయి నట్టు తెలిసింది.

ఈ జ్ఞాపకాలతో నా వొళ్ళంతా వేడెక్కిపోయింది. ఊపిరాడన ట్టనిపించింది. గది గోడలు దగ్గరంగా వచ్చి నన్ను నొక్కుతూన్నట్టు అనిపించింది. లేచి, గొడుగు తీసుకుని వీధిలోకి వచ్చేశాను. వాన యింకా

కురుస్తూనే వుంది. స్వేచ్ఛగా, విశాలంగా తిరిగి వస్తేనే కాని ప్రాణం కుదుటపడుతుం దనిపించలేదు. కాలవ వారనే బయలుదేరి వెళ్ళుతున్నాను. కాలవ అవతల మా పొలాలున్నాయి. తెలవారిపోతోంది, వాన నీటికి రాత్రి వొంటి రంగు కరిగి తెల్లబడుతూన్న ట్టుగా వుంది. రేగడి మట్టి కాలి జోళ్ళకి అంటుకుని బరువుగా అడుగులు వేస్తున్నాను. చల్లని గాలి రివ్వుమని తగులుతూంటే కొంత ఉత్సాహం కలిగింది. ఆకాశం మబ్బులతో నిండి వుంది. కాలవ వారనున్న చెట్ల ఆకుల మీదనుంచి జల్లుమని జడి పడుతోంది. కాకులు అరుస్తూ అటూ యిటూ పోతున్నాయి. కాలవ అవతలి వైపున అరటి తోటలూ, వరి చేలూ పొడూగ్గా పరచుకొని అందంగా వున్నాయి.

కర్ర వంతెన వచ్చింది – వంతెన కింద కాలవ సుడి తిరుగుతూంటే కొంత సేపు చిత్రంగా చూశాను. వంతెన దాటి పొలం గట్టునే వెళుతూంటే "ఏవండోయ్" అన్న పిలుపు వినిపించింది. వీరన్న మామిడి తోట లోంచి ఆ పిలుపు. తోటలో పైన గడ్డి కప్పిన యిటికల యింటి ముందరుగుమీద ఎవరో ఆడ మనిషి నిలుచుంది. నన్నేనా అనుకున్నాను. తోటలోకి రెండడుగులు వేశాను. అరుగుమీద చామన చాయగా, బొద్దుగా, పొడి పొడిగా ఉన్న జుట్టు బుగ్గల మీద పడుతూంటే నవ్వుతూ సుబ్బులు.

ఈ పై చిత్రానికి పాఠకులు పంపిన రైటప్‌లలో బాగున్నవాటిని ఈ క్రింద ప్రచురిస్తున్నాము:

1. ప్రళయం తరవాత


పంపినవారు: పాలెపు నరసింహం, ద్రాక్షారామ; అక్కపెద్ది శ్రీకృష్ణమూర్తి, తెనాలి.

2. యుగాంతానంతరం

పంపినవారు: అ. దుర్గాదేవి, రాజమండ్రి.

3. మూడవ ప్రపంచయుద్ధం తరవాత

పంపినవారు: పి. గవరాజు, విశాఖపట్టణం.



మంచి పొంకంగా, ఆరోగ్యంగా ఉన్న యౌవనం అసూయని కలిగించేటట్టు వుంది. సుబ్బుల్ని నేను చిన్నతనం నుంచీ ఎరుగుదును. అయిదో క్లాసు వరకూ నాతో కలిసి బళ్ళో చదువుకుంది. అయినా ఆమె నాకన్నా చిన్నదిగా, చాలా చిన్నదిగా వుంది. పాతికేళ్ళంటే నమ్ముతారు సుబ్బులు వయస్సు.

"ఎప్పుడొచ్చావు సుబ్బులూ...."అన్నాను నవ్వుతూ.

"రావయ్యా లోనకి రా. వర్షంలో తడుస్తా ఎంతసే వుంటావ్."

నేను తటపటాయించాను.

"ఎవరూ సూడ్డం లేదులే. అబ్బో. మా పెద్దమనిషివైపోయావు." కనుబొమ ఎగరవేసి చేతులూపుకుంటూ అంది. నేను లోనికి వెళ్ళాను. సుబ్బులు ఇంట్లోంచి ఒక కుర్చీ తీసుకు వచ్చి వేసింది.

"సిన్నప్పుడు నువ్వీ దారిని యెల్తావుంటే చెరుకు పానకం యిచ్చేదాన్ని. గ్యాపకం వుందా. ఎప్పుడేనా సాటుగా ముద్దెట్టుకుంటావేమో అనుకునే దాన్ని. అయ్యో రాత ఆ సరదామే లేదు...." పక్కున నవ్వుతోంది.

నాకు సిగ్గుగా బెదురుగా వుంది. ఆమె ముందు నేను ముడుచుకుపోతున్నాను.

"అలా సిగ్గుపడుతూ కూర్చో. కొంచం కాఫీ కాచి తీసుకొస్తాను." అంటూ లోపలకు వెళ్ళింది. సుబ్బులు యాసనీ, నాగరికాన్ని కలిపి మాట్లాడుతుంది. అలాగే ప్రవర్తిస్తుంది. పట్టణాల్లో చాలాకాలం వుంది.

సుబ్బులు మొహంలో విచారం తాలూకు నీడ కాని, వయస్సు తాలూకు నీరసం కాని లేదు. జీవితంలోంచి ఎంతో సుఖాన్నీ, స్వేచ్ఛనీ పొందినవాళ్ళు తప్ప అంత

హాయిగా నవ్వలేరు. ఆమె నాకన్న మూడేళ్ల చిన్నదైనా పదిహేనేళ్ళు చిన్నదిలా కనపడుతోంది. వింతగా ఆలోచిస్తున్నాను ఆమెను గురించి.

ఆమె కాఫీ తెచ్చి యిచ్చింది. కాఫీ మంచి రుచిగా వుంది. నా ఎదురుగా ముక్కాలిపీటమీద కూర్చుని జుట్టు విప్పుకుంది. నల్లని జుట్టు వొత్తు వొత్తుగా తరంగాలుగా పిరుదులదాకా ప్రవహిస్తోంది. కళ్ళల్లో ఆరోగ్యపు వెలుతురు. ఆందోళనలు లేని వెలుతురు.

"ఏడెనిమిదేళ్ళయింది నిన్ను చూసి సుబ్బులూ. రంగడు కులాసాయేనా." అన్నాను ఆమె భర్త నుద్దేశించి.

ఆమె మళ్ళీ విరగబడి నవ్వింది. "రంగడా! ఇంకా ఆడెక్కడ? బలేవాడివయ్యా తెలియనట్టు మాటాడుతావ్" అంది.

"ఏం, రంగడు పోయాడా." ఆత్రుతగా అన్నాను.

"ఛఛ – దుక్కలా వున్నాడు. నే నే వాడిని వొగ్గేశాను."

"ఏం?"

"నా కిష్టం లేకపోయింది. భయమా?"

"ఇన్నాళ్లూ మరి ఏం చేస్తున్నావు."

"వీరాస్వామితో గుంటూరు వెళ్ళిపోయాను. అతను పెద్ద మేస్త్రీ. మాంచి డబ్బున్నవాడు కూడా."

"అతన్ని పెళ్ళి చేసుకున్నావా."

ఆఁ—గుంటూరులో మాబలేగా వుండిలే. నగలూ బట్టలూ సినీమాలూ- ఓఁ దర్జాగా వుండేది. వీరాసామి కూడా బాగుండే వాడు. కాని....

"అతనితో కూడా చెడిందా."

"అతను దేన్నో మరిగాడు. నాకు శానా కోపం వచ్చింది. నీకింటి దగ్గర దెబ్బలు తిని శాకిరీ సెయ్యడానికి నేనేం యెదవని కానని చెప్పి నా నగలూ డబ్బూ తెచ్చుకుని వేరే వెళ్ళిపోయాను."

"ఇప్పుడు కలుసుకున్నారా. మళ్ళీ—"

"ఆడినీ ఒగ్గేశాను."

నేను తెల్లబోయి చూస్తున్నాను.

"అదేంటలా చూస్తావ్! యిష్టంలేని వాడితో కాపురం చేసి ఏడుస్తా చావనా? నా దగ్గర అటువంటిది లేదయ్యోయ్. బతికినన్నాళ్లు కులాసాగా బతుకు. నా కన్యాయం ఒహరు చేస్తే ఊరుకునేది లేదు."

"మరి యిప్పుడొంటరివే ఉన్నావా?"

"నువ్వున్నావు కాదయ్యా. నీకోసమే వచ్చినాను. అబ్బ. నువ్వంటే నేటికీ మనసే నాకు, పాడు మనసు..." గమత్తుగా చూస్తూ పవిట కొంగు నోటికి అడ్డం పెట్టుకు నవ్వుతోంది.

"బాగుంది నీ హాస్యం" అన్నాను నేను సిగ్గుపడుతూ.

"బెజవాడ రైల్వేలో పనిచేస్తున్నాడు. రాఘవులు. ఆతనితో వుంటున్నా" అంది మళ్ళీ.

"మనువా?"

"మనువూలేదు శ్రాద్ధంలేదు. నా కంటె సిన్నోడు. అయినా మా అందగాడు. స్టోర్సులో పనిచేస్తున్నాడు. నేనంటే పల్లి మాలిన ఆపేక్ష రాఘవులికి. నొక్కుల జుట్టుతో చిన్న పెదాలతో బలే అందంగా వుంటాడు." అంది ఆప్యాయత కళ్ళల్లో కనపడేటట్టు. నేను లేచాను. కోర్టు పని వుంది. ఇవాళ ఎన్నో కాగితాలు చూసుకోవాలి.

"ఇంకా ఉంటావా సుబ్బులూ."

"మా బాబుని చూసి పోదామని వచ్చాను. రేపో ఎల్లుండో వెళ్ళిపోతాను."

"ఓసారి మా యింటికిరా. మా ఆవిడకు కనిపించు." అంటూ అరుగు దిగాను.

"నే నెందుకొచ్చి చూస్తానూ నాసయితీ! సర్లే. ఒక్కసారైనా నా కోరిక తీర్చలేదు. అందమైన వాడినని నీకు గర్వం లేవయ్యా." నవ్వుతూ చేతు లూపుతూ అంది.

వానలో తిరిగి యింటికి బయల్దేరాను. ఆమెలో ఆనందానికీ. ఆరోగ్యానికి నవనవోన్మేషతకీ కారణం ఏఁవిటా అని ఆలోచిస్తున్నాను. జీవితాన్ని తేలిగ్గా సహజంగా తీసుకోవడమా? కృత్రిమమైన నీతులూ భయాలు పెద్దరికాలూ అడ్డురాక పోవడమా? ఇంత చదువూ డబ్బూ వుండి నాలో యీ అసంతృప్తి దిగులూ ఏఁవిటి? ఏదో చెయ్యలేక పోయానన్న వేదన. కలలు కాగితపు పేలికల్లా రాలిపోయిన శోభా, చెంపల దగ్గర నెరిసిన జుట్టు క్రమంగా అంతటా తెల్లబడి ముసలివాణ్ణీ, మృత్యుపదాభిముఖుణ్ణీ అయిపోతున్నానన్న బెదరూ ఏమిటి యిదంతా? ఎక్కడ నేను జీవిత రహస్యాన్ని మరచి పోయాను? ఏ సమయంలో జీవించడంలోని కీలకం జారిపోయింది? ఈమె—చదువూ. సంస్కారమూ లేని సుబ్బులు ముందు నేను చాతకాని వాడిలా ఎందుకయిపోయాను.?

బరువుగా బాధగా అడుగులు వేసుకుంటూ కర్ర వంతెన దాటాను. కాలవ వారనే జనం బాగా తిరుగుతున్నారు. వర్షానికి కాకులు తడుస్తూ చెట్ల కొమ్మలమీద వణుకుతూ కూర్చున్నాయి. మనసులో ఆలోచన హెచ్చినకొలదీ అడుగులు వేగంగా వేస్తున్నాను. జీవితపు పందెంలో ఓడిపోయిన వాడిని. —

శ్రీశ్రీ ఉవాచ

ఒక తెలుగు వారపత్రిక కార్యాలయం, మదరాసు,
సంవత్సరం : **1952.**
మధ్యాహ్నం పన్నెండయింది. ఎండ తీవ్రంగా ఉపన్యసిస్తోంది. శ్రీశ్రీ సంపాదకుని గదిలోకి వెళ్లాడు. "ఏం అన్నా! ఇంకా భోజనానికి వెళ్లలేదా?" అన్నాడు. "ఇదిగో ఈ కవరుపేజీ సంగతి ఇంకా తేలలేదు. కొచ్చిన్ సిస్టర్సు ఫొటో వేద్దామా వద్దా అని చూస్తున్నా" అన్నాడు సంపాదకుడు.
"ఎందు కొచ్చిన్ సిస్టర్స్? పద భోజనానికి" అన్నాడు శ్రీశ్రీ.

పంపినవారు: గోపాల చక్రవర్తి.





కాని, ఒకటి మాత్రం నిజం. ఆవిడ గర్విగాదు. అలా గని కొంత మంది అనుకుంటారే గాని. ఇంతకీ గర్వం ఒక పెద్ద గర్వకారణమేమీ కాదుగా.


మరిఅదేమిటో అంతమౌనం. ఆమెనోట ఎవరైనా, ఎప్పుడైనా మహా అయితే ఒక మాట వింటారేమో, అదైనా అరుదుగా, బంధువు లెవరైనా ఇంటికొస్తే ఏ మూడు దినా లయ్యాకో "ఎప్పుడొచ్చారు?" అని ముక్త సరిగా పలుకరించి జవాబైనా ఎదురు చూడ దావిడ.

అసలు శ్రీదేవిగారు కాస్త సంపన్నురాలాయె. మాట్లాడవలసిన బాధ్యతలూ ఎక్కువగా లేవు. ఇంట్లో వంటలూ, వడ్డింపులూ- విధవాడ బిడుచు చూస్తూండేవారు. రమణమూర్తిగారు భారతం చదువుకుంటూ పడక కుర్చీలో కూర్చుని ఉండేవారు. చుట్టూ గరిసెల నిండా ధాన్యం, పాడి పంటలూ, అతిథులూ, అభ్యాగతులూ, పూజలూ పునస్కారాలున్నూ-చక్కని కుటుంబం. లక్షణంగా, బంగారు బొమ్మలా, ఆభరణాలంకారాలతో శ్రీదేవిగారు, కాలి మట్టెల రవళితో, మౌనంగా తిరుగుతూంటే ఆవిణ్ని మెచ్చని ప్రాణిలేదు. శ్రీదేవిగారికి తన ప్రపంచమే తనది. తానే తన ప్రపంచం. తనకి తాను కాక మిగతా వారు తన భర్త, తన ఏకైక పుత్రుడు. భర్త అంటే పసుపు కుంకుమలు. కొడుకంటే తనసర్వం.అంతే. అదే శ్రీదేవిగారి విచిత్ర మానసిక పరిధి.

పసుపు చెంపలతో నుదుట పట్టెడు కుంకుమతో ఆవిడ ఎదురొస్తేనే చాలను కునేవాళ్లు చాలా మంది. పెళ్ళి అంతా సిద్ధమయ్యాక తాంబూలాలు ఇచ్చి పుచ్చుకోడానికెళ్ళేవాళ్ళు గొడుగు ఖండువాలతో వాళ్ళ ఆడవాళ్ళని శ్రీదేవిగారింటికి పంపించి "కాస్త నాలుగడుగులు ఎదురు రండమ్మా" అని బ్రతిమాలించే వారు.

ఎటొచ్చీ మౌనం ఒక్కటే. బయట పను





లన్నీ చెయ్యడానికి ఇంటి పాలేరు ఏనాది అంకులూ, దాసీ పని చెయ్యడానికి అతని భార్య వున్నారు. అలవాటయిన వాళ్లు అడక్కుండానే చేసుకుపోతారు పనులన్నీ.

అంకాలు మూడేళ్ళ కొడుకు ఒకసారి వాళ్ళ పేటలో ప్రక్కింటికి వెడితే ఆ ప్రక్కింటి ముక్కోపి ముసలిది పొమ్మని ఛటుక్కున ఒక్కటేసిందట. పిల్లాడికి డొక్కలో దెబ్బ తగిలిందట. పిల్లవాడు ఉక్కిరి బిక్కిరిగా ఊపిరి వదిలాడట. అంకాలు భార్య పరుగెత్తుకుంటూ వెళ్లి ఆ ముసలి దానిని తిట్టి ఏడ్చే ఆ పిల్లాణ్ని ఎత్తుకొచ్చేసిందట. ఆ వెనుక జడుపు మీదనో దెబ్బమీదనో వాడు జ్వరం పడ్డాడట. తిండి తగ్గిపోయింది. జ్వరం పూర్తిగా ఎన్నడూ వదలలేదు. అలాగే తీసుకొని తీసుకుని ఒక ఆరు నెలలకి ప్రాణం కాస్తా వదిలేశాడు. వయస్సుమళ్ళుతూన్న ఆ బీద దంపతులకు చావగా చావగా మిగిలినది ఆ ఒక్క సంతే. ఈ వైనాలన్నీ ఎప్పటి కప్పుడు ఇంట్లో వింటూన్న శ్రీదేవిగారు "పాపం" అనిగాని, "అయ్యో" అనిగాని అనలేదు. విన్నదా లేదా అనిపించింది. ముఖంలో ఏ మాత్రమూ మార్పులేదు. చెవిటివాడి ముందు శంఖు ఊదినట్టే.

కాని ఆతరువాత ఒకసారి తన పసివాడు శివరామ్‌కి జబ్బుచేసి నప్పుడు మాత్రం ఆవిడ ముఖం వివర్ణ మయిపోయింది.

ఆ నాడు రమణమూర్తిగారు ప్రక్కవూరు పనిమీద వెళ్లారు. విధవాడ బిడ్డ తన జ్ఞాతుల పెండ్లికి వెళ్ళింది. హఠాత్తుగా శివరామ్ తన చేతుల్లో బిగిసి పోయాడు. శ్రీదేవిగారి గుండెలాగి పోయాయి. "అయ్యో! అమ్మో" అనుకుంటూ పిచ్చిదానిమల్లే చేతుల్లో పిల్లాడితో వీధిలోకి పరిగెత్తుకుంటూ వచ్చింది. అంకాలు చుట్ట నోట్లో పెట్టుకుని లోపలికి వస్తూ ఎదురయ్యాడు. ఆవిణ్ని అంత దూరాన చూడంగానే నోట్లో చుట్ట పారెయ్యబోయాడు. తొందరగా మరుక్షణంలో ఆవిడ ముఖమూ పరుగుచూసి గాభరా పడి "ఏందమ్మగారూ? ఏందిది?'' అంటూ ముంటుకి అంగలు వేసుకుంటూ వెళ్ళాడు. వెంటనే అతని కర్థ మయింది. "చిన్న బిడ్డ గుణమండీ! సూత్తారేం" అని అంటూనే చేతిలో

కాల్తూవున్న చుట్టతో బిడ్డ నుదుటిమీదా వెనకా వాతలు పెట్టాడు. బిడ్డ కేరుమని ఏడ్చాడు. శ్రీదేవిగారు బిడ్డని రొమ్ము కద్దుకుంది. అంతే, అలాగే అంకాలు కేసి తిరిగి చూడనైనా చూడకుండా మండువాలోకి వెళ్ళిపోయింది. అలాగే నిలబడి పోయి అంకాలు "పాపం కన్నకడుపాయిరి. ఏం చేసుద్దీ." అని గొణుక్కుంటూ ముందరికి సాగాడు.

ఆ నాడు తెప్పరిల్లి శివరామ్ "మ్మమ్మ" అన్న స్వరం శ్రీదేవిగారికి ప్రాణం పోసింది. జీవితంలో పరిపూర్ణ సుఖం ఇంకొకటి లేదనిపించింది.

శ్రీదేవిగారు ఎన్నడూ బిడ్డని లాలించి ఎరుగదు. కాని ఆమె సౌభాగ్యానికి మేర లేదు. బరి దాటని కొడుకు, కోపతాపాలెరుగని భర్త, సిరి సంపదలు.

శివరామ్ పెద్ద వాడయ్యాడు. చదువుకుంటున్నాడు. బుద్ధిమంతుడు. అతనికి తల్లి తప్ప వేరేదైవం లేదు. స్కూలు నుంచి వచ్చి "అమ్మా" అని అలా దీర్ఘంగా పిలిస్తే శ్రీదేవిగారు భూత భవిష్యత్తులు మరిచేవారు. చూచిన అమ్మలక్కలందరూ శ్రీ దేవిగారి అదృష్టానికి కొంచెం ఈర్ష్యపడేవారు. శివరామ్‌కి అమ్మ పెట్టింది అమృతం. అమ్మ చెప్పింది వేదం. అంతకి మించి ఆవిడకి కోరదగినదీ వేరేముంది.

పండుగలూ, పబ్బాలూ గడుస్తున్నాయి. శ్రీదేవిగారి పెద్ద తమ్ముడు తల్లిలేని తన ఒక్కకూతుర్నివదలి స్వర్గస్థుడయ్యాడు. ఆ అనాథను రమణమూర్తి గారు ఇంటోకి తెచ్చారు. వయస్సు వచ్చిన ఆ కమలకి పెట్టుపోతల్లో లోటు లేకుండా శ్రీదేవిగారు చూస్తున్నారు-తన ఆడబిడ్డ అప్పటికే కాలం చేసిందిగనుక. మాటామంతీ మాత్రం ముక్తసరే.

ఈపాటికి కాలేజీ వదిలేసి శివరామ్ ఉద్యోగం చేస్తున్నాడు గుమస్తాగా.

ఎప్పుడో చిన్ననాడనుకున్నది తప్ప మళ్ళీ తిరిగీ ఆ ప్రస్తావనే రాలేదు ఎప్పుడూ. అయినా ఇరుగుపొరుగువారి ఊహలు ఊరికే పోకుండా శివరామ్‌కీ, మేనకోడలు కమలకీ రమణమూర్తిగారు, శ్రీదేవిగారు వివాహం చేశారు-తగువైభవంతో.

శివరామ్ మాత్రం ఎప్పటికీ తల్లి బిడ్డే. ఎప్పటిలాగ జీతం తెచ్చి తల్లి చేతుల్లో పొయ్యడం, రోజుకి ఒక అర్ధణా తీసుకొని వెళ్ళడం, ఆఫీసులో సరదాగా వేరుశనగకాయలు కొనుక్కు తినడం. ఇంటి విషయాలలో అతను పట్టించుకొనేవాడేగాదు. పెండ్లి అయిన తరువాతా అంతే.

ఈ పెళ్లి అయిన ఆరు నెలలకే రమణమూర్తి గారికి ఉప్పెనలా ముంచుకు వచ్చింది జ్వరం హఠాత్తుగా ... డాక్టర్లు కారణం తెలుసుకునే లోగానే అంత హఠాత్తుగానూ ఆయన పోయారు.

శ్రీదేవిగారి దుఃఖానికీ, రౌద్రానికీ మేర లేదు. ఈ దరిద్రురాలు ఏ శనివేళ నా ఇంట్లో అడుగుపెట్టిందో? ఇది నా పసుపు కుంకం తుడిచేసింది. దీనిని ఏం చేసినా పాపం లేదు. భగవంతుడు నా పగతీర్చడా- ఏమేమో ఆలోచనలు వచ్చినయి ఆవిడకి- ఘోరమైనవి.

"పువ్వులూ బుక్కాముతో ఆయనచేతుల్లో పుణ్యస్త్రీలా పోదామనుకున్నాను. పసుపు కుంకుమలేనిదే ఏమి బ్రతుకు? శ్రీదేవిగారు

పసుపు కుంకుమలేని ఘడియలు జీవితంలో ఎవరికైనా ఉంటాయనే అనుకోలేదు. ఎవరికైనా అంటే తనకే. తను తప్ప తనకి ప్రపంచం ఎవరు? శ్రీదేవిగారి మనసులో బయట ప్రపంచపు ఆలోచనలకి చోటు లేదు-తనూ, భర్త, బిడ్డడు, అంతే. ఇంకే తల్లికి ఏ కొడుకు వుంటే తనకి కావాలి? లేకపోతే ఎవరికి కావాలి? ఇప్పుడు తన పసుపు కుంకుమ పోయిందే!

ఆనాటి నించీ ముక్తసరిగానైనా కోడలితో మాట్లాడడం మానేసిందావిడ.

రెండేళ్లు గడిచాయి. ఒకనాడు సాయంత్రపు వేళ నిమ్మళంగా కమల దగ్గింది. శివరామ్ గమనించలేదు. రోజు రోజుకీ కమల నీరసించి పోతూంది, దగ్గు ఎక్కువై పోతూంది. ఎవ్వరూ గమనించడం లేదు. ఒకనాడు మరీ బాధగా దగ్గుతూ కూచుంది కమల. శివరామ్ విన్నాడు. అమ్మనడిగాడు. అమ్మ నాకు తెలియదంది. అనవసరంగా భార్యతో మాట్లాడే అలవాటు లేదు శివరామ్‌కి. అయాచితంగా కష్టసుఖాలు భర్తతో చెప్పుకొనే స్వాతంత్రం కమలకీ లేదు. ఇప్పుడతను అడిగితే "ఏమో నాకు తెలియదు. ఎందుకో ఈ దగ్గు" అంది కమల.

ఆఖరుకి ఒకనాడు అంకాలు భార్యని వెంటపెట్టుకుని కమలని లేడీడాక్టరు వద్దకి తీసుకెళ్ళాడు శివరామ్. ఆవిడ పరీక్ష చేసి "శివరామ్ గారూ! మీరు చదువుకున్నవారు. మీరు ఇన్నాళ్లు ఎలా ఉపేక్ష చేశారు? ఇది క్షయ" అని సానుభూతితో అంటూ, ఒక మందులపట్టీ వ్రాసి ఇచ్చింది.

ఇంటికి వచ్చి జరిగినదంతా అమ్మతో చెప్పాడు శివరామ్. అమ్మ మాట్లాడలేదు. విగ్రహంలా వింటూ ఉండిపోయింది.

శివరామ్‌కి ఏమిచెయ్యాలో బోధపడలేదు. కాలు కాలినపిల్లిలా అటూ ఇటూ తిరిగాడు. ఇంట్లో ఈ రోగిని పలుకరించే మనిషికూడా లేదు. అందుకని కమలని ప్రక్క పల్లెటూరిలో తన పినమామగారింటికి తీసుకెళ్లి వదలి కాస్త ఆలనా పాలనా చూస్తుండమని చెప్పాడు. కాని మందు లెలా వస్తాయి?

అదేమి ఖర్మమో ఎప్పటిలా జీతపు రాళ్లు అమ్మ దోసిళ్ళలో పోస్తూనేవున్నాడు శివరామ్. వేరు విధంగా చెయ్యాలని అతనికి స్ఫురించనైనా స్ఫురించలేదు.

నాలుగైదు దినాల కొకసారి వెళ్లి కమలని చూచి వస్తున్నాడతను.

"మీ బస్తీలలో కంటె ఇక్కడేమంత

కుటుంబ నిమంత్రణం

అర డజనుమంది పిల్లలతో ఒకావిడ సిటీ బస్సెక్కింది. పిల్లల గోల భరించలేక కండక్టరు "అందర్నీ వెంటేసుకు రాకపోతే సగం మందిని ఇంటిదగ్గర దిగవిడిచి రాకపోయావుటమ్మా!" అని విసుక్కున్నాడు.

పిల్లల తల్లి శాంతంగా "ఇప్పుడు చేసిన పని అదే నాయనా!" అంది.

ఏర్పాటు లుంటాయిరా? ఏదయినా మందు ఇప్పించాలిగాని'' అన్నారు పిన మామగారొకసారి శివరామ్‌తో. నిజంగానే ఆనాటికానాటికి క్షీణిస్తోంది కమల. పోనీ వాళ్ళనే కాస్త డబ్బడుగుదామా అనుకుంటే పిన మామగారూ మరీ అంత కలిగినవాళ్లు కారాయె. ఆ సాయంత్రం కమలతో శివరామ్ అన్నాడు : "అవునూ, చేతిలో వెన్న పెట్టుకుని నేతికి దేవులాడినట్టూ ఇదేమిటీ? నీ మెళ్ళో ఆ చంద్రహారం ఇలా ఇయ్యి. అది తాకట్టుపెట్టి మందులు కొనుక్కొస్తా."

దానికి "ఊఁహూఁ! నేనివ్వను. ఇది మామగారు పెళ్ళికి పెట్టారు; ఇది తీసుకునేందుకు మీకు ఏమీ హక్కులేదు" అంది బలహీనంగా తలవూపుతూ.

మరోసారి, ఇంకోనాడు అడిగిచూచాడు శివరామ్. "ఇదిగో చూడు పరిస్థితులేమీ బాగా లేవు. అమ్మ ప్రాణంపోయినా డబ్బిచ్చేటట్టుగా లేదు. ఆ చంద్రహారం ఇయ్యి. లేకపోతే నీవు నాకు దక్కవు.' అన్నాడు. కమల గట్టిగా తల ఊపింది. 'నాకు బ్రతకాలని ఏమీ లేదులెండి. నా ప్రాణాలు నిలవాలని అత్తగారికేలేనపుడు మీకెందుకింత ప్రయాస? నా కెందుకు?" అంది ఆయాసంతో.

మరో వారం దినాలకి కమల పోయింది.

శివరామ్ దుఃఖంతో "అమ్మా కమల పోయింది. వెళదాంరా" అన్నాడు. ఆమె జవాబైనా ఇవ్వలేదు.

ఆ మరునాటి సాయంత్రం, భార్య పాదాలకు దణ్ణంపెట్టి, సాగనంపి, పినమామగారి మిద్దెమీద అరుబైట, నడుం వాల్చాడు శివరామ్. పైన విదియనాటి ఆకాశం, నీలంగా, విశాలంగా, అనంతంగా అలముకుంది.

కమల ఏది? ఆ జీవి ఎటు వెళ్ళిందో! ఆ అంతరిక్షంలోకి పోయిందేమో! ఎంత దూరం వెళ్ళిందో; తిరిగి రాదేమో! గుండెలు ఎంత గభేలు మంటున్నాయి తలుచుకుంటే. కన్నీళ్ళు ఎండిపోయాయి. ఏడుపు రావడంలేదు.

శివరామ్‌కి ఏదో గొప్ప బాధనుంచి ఒడ్డుకి వచ్చినట్టూ అనిపించింది. కాని ఏదో పెద్ద ఒంటరితనం అతనిచుట్టూ ఆవరించింది. ఎంత నీలంగా ఉందో పైన ఆకాశం! ఆ నీలిమ కొంత శాంతి నిచ్చింది. కాని ఎప్పుడూ ఈ ఆకాశాన్ని ఇల్లా చూస్తూండగలమా? దూరాన్నించి కొండలూ ఇలాగే కనబడతాయి. సృష్టిలో విస్తీర్ణతలన్నీ నీలమే. కృష్ణ పరమాత్ముడూ అదే ఛాయ. శివుడి కంఠంలోనూ నీలమే గదా! ఏమిటో, మనస్సు బరువుగానే వుంది. కమలకి మందిప్పించినట్టయితే బాగుండిపోను. ఎవరిప్పిస్తారు! అవును ఆమె అత్తగారికే పట్టనిదే? ఇంతకీ మేనరికం కావాలని చేసుకుంది కూడాను. ఆవిడ కమలకి అత్తగారా? తనకిమాత్రం తల్లికాదు. అబ్బే! అమ్మ! "అమ్మ" అని పిలవడం ఎలాగు! పిలవకూడదని ప్రతిజ్ఞ పట్టలేదు-ఒకవేళ అలా పట్టేవుంటే. ఎవ్వరికి? ఎవ్వరికీ ఆమాట ఇచ్చింది? తన దారిన తాను వెళ్ళిపోయిన భార్య కిచ్చాడా? తనకితానే బాధలో ఇచ్చుకున్నాడా? ఏమో కాని పిలవడానికి నోరు రావడంలేదు. "అమ్మ!'' ఉఁ హూఁ! రావడంలేదు. ఆ పిలుపూ, దుఃఖమూ కంఠంలోనే ఆగిపోయాయి.

ఏమేమో ఆలోచనలు వస్తున్నాయి అతనికి, ఆ ఆలోచనలు బరువుగా వున్నాయి.

శివరామ్ ముఖం, కుంభవర్షాన్ని మోయలేక మోసే శ్రావణ మేఘంలా అయింది.

ఈ వేళ, తన అవసాన కాలంలో శ్రీదేవిగారు, మద్రాసులో కొడుకు శివరామ్ లోగిలిలో మెత్తటిపరుపుపైన పడుకుని వున్నారు. మందులూ, పరిచర్యలూ జరుగుతూనే వున్నాయి. డాక్టర్లు రోజు గడవదని చెప్పారు.

కాని రాత్రి పడింది.

జబ్బు ఎక్కువయిన తరువాతనే ఆవిణ్ని మద్రాసు తీసుకొచ్చారు ఇప్పటికి సుమారు మూడునెలల క్రితం.

జబ్బుతో మంచం మీద పండుకుని ఉన్నన్నాళ్లూ తన గత జీవితమంతా స్ఫురణకొస్తోందేది. భార్యపోయిన తరువాత శివరామ్ తనలో తానే ఇమిడిపోయాడు. స్వయంగా తన జీతం తల్లికివ్వడం మానేశాడు; అంకాలుని ఆఫీసుకి తీసుకెళ్ళి జీతం పుచ్చుకుని ఇచ్చి ఇంటికి పంపించేవాడు.

ఇలా సంవత్సరాలు గడుస్తూండగా పిన మామగారు తన కూతుర్నిచ్చి, అట్టహాసం లేకుండా పెళ్ళిచేశాడు.

మరి కొన్నాళ్ళకి మరొక కంపెనీలో పనికి కుదిరి, భార్యా సమేతంగా మద్రాసు వచ్చి కాపురం పెట్టాడు. అక్కడ ఆఫీసుకే అధికారి అయ్యాడు.

ఇంటిపద్ద వ్యవహారాలన్నీ, అప్పుడపుడు ప్రక్క ఊరునుంచి వస్తూ పిన మామగారూ, అక్కడేవుంటూ అంకాలూ, చూస్తూ వచ్చారు. శివరామ్ తనకి తోచిన పైకం ముక్తసరిగా మనిఆర్డర్లు చేస్తూనే ఉన్నాడు. కాశీ వెళ్లాలంటే వెలితి లేకుండా డబ్బు పంపించాడు. ఒళ్లు బాగా లేదని వ్రాయించినపుడల్లా,అన్ని మందులూ పంపించాడు.

ఈ లోపుగా శివరామ్‌కి ఒక కూతురు పుట్టింది. కమల అని పేరుపెట్టాడు. తన పంచ ప్రాణాలూ ఆ పిల్లమీదనే పెట్టుకుని బ్రతుకుతున్నాడు తండ్రి. తన తమ్ముడు అపుడపుడూ మనుమరాలిని చూడ్డాని కొచ్చినపుడల్లా సంగతులన్నీ అక్కగారితో చెబుతూండేవాడు తిరిగి వచ్చాక. ఒక్కొక్కపుడు, మనుమరాలిని తెచ్చుకున్నపుడల్లా, శ్రీ దేవిగారింటికి తీసుకెళ్ళి, కొన్నాళ్ళుంచి మళ్ళీ మద్రాసు తీసుకొచ్చి వదిలి వెళుతూండేవాడు.

గడచిన మూడు మాసాల జబ్బులో ఇవన్నీ ఆలోచిస్తూండేది శ్రీ దేవిగారు.

అయిదు రూపాయిలూ, రెండు కుంచాల వడ్లూ ఇచ్చి దిమ్మరిగా తిరిగే బంగాల పిల్లాణ్ని కొని పెంచుకున్న అంకాలు పాటి అదృష్టం తనకి లేకపోయిందే. అంకాలు కొడుకుపాటి చెయ్యలేదే తను స్వయంగా నెలలుమోసి కనిపెంచిన ముద్దుల కొడుకు. "అమ్మ, అయ్యా!" అంటూ ఆ దిమ్మరి చూడు, వాళ్ళ వెనక ఎల్లా తిరుగుతాడో! వీడికి కన్నతల్లి మీద లేశమాత్రం ప్రేమ వున్నట్టూ లేదే! అంకాలు భార్యపాటి కూడా చెయ్యలేదా తను!

ఎక్కడో కాలంలో మారాన ఒక రాత్రి, ఇరవై ఏండ్లనాటి మాట: "అమ్మా కమల పోయింది. వెళదాం. రా" అన్నది ముద్దుల కొడుకు కంఠం. అంతే. ఈ ఇరవై ఏండ్ల

శూన్యంలో మళ్ళీ ఆ పిలుపు వినలేదు తను. ఒక్కసారి అయినా వినాలని ఎంత ఎంత ఆశపడిందో! కాని ఆశలు నిరాశ లవుతూ వచ్చాయి. తన కొడుకు తనకి కాన పుడు జీవితంలో అర్థంలేదు. ఇన్ని సంవ త్సరాలూ కాచుకుంది ఆ ఒక్క పిలుపు కోసం.

ఎన్నిసార్లో. కొడుకు నడుగుదామా అనుకుంది. ఎలా మాటలాడడం? అసలే చేతకాదే! ఏమిటో. వివరం తెలీని బాధలు దేహాన్ని చుట్టుకున్నాయి. ఇక పక్షవాతం కూడా వచ్చింది. తీసుకొచ్చి దిగబెట్టమంటే. శివరామ్ పినమామగారు. భద్రంగా తన అక్కగారిని తెచ్చి. ఒప్పచెప్పి. కొన్నా ళ్ళుండి. మనుమరాలు కమలని "నాలుగు దినాలు మా ఇంట్లోవుండి వస్తుంది లె"మ్మని చెప్పి తీసుకెళ్ళారు.

మద్రాసులో. శ్రీ దేవిగారికి రాచభోగం జరుపుతున్నాడు శివరామ్. మందులు బాగా నడుస్తూనే వున్నాయి. పనిపాటలన్నీ మాను కుని శివరామ్ ఇంటిపద్దనే ఉంటున్నాడు కాని "అమ్మా. ఎల్లావున్నా''వని మాత్రం ముఖాముఖిగా కూడా అడగడం లేదు.

శ్రీదేవిగారు నీరసించిపోతున్నారు. ఇహ నెన్నాళ్లో లేవు..ఆవిడకి.

ఈ వేళే ఆఖరురోజని మళ్ళీ వక్కాణిం చారు డాక్టర్లు. కాని కట్టకడపటివరకూ చికి త్సలు జరపడం విధి అన్నారు. మందులు జరుగుతూనే వున్నాయి.

తంతి వెళ్ళింది. పినమామగారు భార్య తోనూ. కమలతోనూ బయలుదేరారు. అంకాలు ఉగ్గబట్టలేక. కూడా బయలు దేరాడు.

కోడలు శ్రీదేవిగారి గది వదలడం లేదు.

శ్రీ దేవిగారు శక్తి తెచ్చుకుని. కళ్ళతో కూడా వెతుకుతూండేవారు-ఆ కొడుకు స్వరంకోసం-పరితపిస్తూ.

ఆ రాత్రి కూడా గడుస్తోంది.

శ్రీ దేవిగారిది చాలా గట్టిప్రాణం అని డాక్టర్లు నిశ్చయించారు.

తిరిగి సూర్యోదయం అవుతూంది.

స్వామి పిలుపు రాలేదు.

కన్న కొడుకు పిలుపుకోసం ఆగారు శ్రీ దేవిగారు.


బయట అరుగుమీద అంకాలు తలవంచు కుని కూచుని వున్నాడు. శివరామ్ ఎప్పటిలా డాక్టరువద్ద నుంచి మందులు పట్టుకునివస్తూ, గుమ్మంలో నించి. "అమ్మా" అన్నాడు పరిపూర్ణ ప్రేమతో. గదిలో, శ్రీ దేవిగారికి ఎక్కడో దూరాన దిగంతాల వెనకనుంచి వినబడినట్టు ఆ స్వరం వినిపించింది.

ఆమె కళ్ళల్లో నీళ్ల నిండాయి. కళ్ల వాటంతటవే విప్పారాయి-మహా తృప్తితో.

ఆ ఒక క్షణం కోసమే ఆ కళ్ళలో ఆ కాంతి ఆగివుంది-ఇంకా. శివరామ్ లోపలి మండువాలోకి వచ్చాడు. ఎదురుగా చూస్తూ "అమ్మా కమలా! వచ్చావుటే!" అన్నాడు.

గదిలో శ్రీ దేవిగారి కండ్లు మూతలు పడ్డాయి. తల ప్రక్కకి వాలిపోయింది. కళ్ళ కొలుకులలోనుంచి నిండిన కన్నీళ్ల జారాయి.

పెరట్లోనించి పినమామగారి గొంతు వినిపిస్తోంది..."మనో మన్యుర్కమర్కృత్యు స్సత్యో మిత్రో వాయురాకాశః ప్రాణోలోక పాలః..."



'అకవితా వస్తువు?'

[మేరిలిన్ మన్రో కూడా కవితా వస్తువేనా? అని సందేహించిన ఒక మిత్రుని కోసం-]

నీ ప్రతి అవయవం
సౌందర్యాన్ని నిర్వచిస్తున్నది
నీ ప్రతి హావభావం
యవ్వనాన్ని నిర్ణయిస్తున్నది
లోకమంతా నీ అతిలోక
రూపాన్ని చూసి
నోరు తెరుచుకొని
ప్రమాన్పడి పోతుంటే
ఏ అలౌకిక సౌందర్యాలు
వివరిద్దామని

అలా నోరు తెరుచుకొనే ఉండిపోయావు సుందరీ ఆఖరి దాకా
ఎన్ని హృదయాలలోనో దీపాలు ముట్టించిన నీ అధరాలు
నీ హృదయాన్ని చూపడానికా
ఎన్నడూ కలుసుకోకుండానే కాలిపోయాయి.

వయస్సు నీకు అన్ని అంగాల్లోనూ
సొంపులు, సొగసులు తీర్చింది కాని
నీ పసి కళ్ళల్లోనూ శిశుహృదయంలోనూ
దాగిపోయిన అమాయకతను మాత్రం
దోచుకోలేక పోయింది.
ఇంత పిపాసలో, ఇంత జిగీషలో
కుస్తీలు పడుతున్న ఈ కుళ్ళులోకంలోంచి
ఇంకేదో అవ్యక్త మధురానుభవాన్ని
ఆశించిన నీ నిర్మల హృదయం మోసపోయింది.

"నయాగరా" సృష్టించిన వెలుగులు
కావాలిగాని లోకానికి,
ఎంత ఎత్తు మించి పతనమైతే
ఎంత గొప్ప జల హృదయం పగిలిపోతే
ఆ అగ్ని పుట్టిందో ఏం పట్టింది?

మనిషి తోలుబొమ్మలాడించిన నాటి
మనస్తత్వం యంత్రాల నాడించడంలోకి ఎదిగింది కాని
మనసులోని మమతలను అర్థంచేసుకోవడం లోనికి రాదు.
అందుకే నేమో నీ వెక్కడా "అతకలేదు"
జేవురించిన మబ్బుల మొగాలమీద
ఒక తటిల్లత మెరిసిపోయినట్లు
తెరమీద మెరసిపోయావు.

నీ ఆ క్షణిక దర్శనమే
ఇంకా కనకవర్షం కురుస్తూనే వుంది.

అయినా నీ గురించి నోరు నొచ్చేలా
ఎన్నయినా అపవాదులు చెప్పుకోవచ్చు గాని
కాగితంమీద కలంపెట్టించి
రాయించు కొనేంత
"పవిత్రం" కాలేదు నీ వింకా చాలమందికి.

రాళ్ళూ, రప్పలూ
రాముని చెప్పులూ
తాము ప్రాణం పోసుకొని
మహా కావ్యాలకు సైతం ప్రాణం పోశాయట కాని
జీవివి, అందులోను కామానికి దేవివి
నీ వసలే "కవితావస్తువు"వి కావట.

నీవంత నగ్నంగా కనిపించడం కన్నా
నీ హృదయమంత నగ్నంగా, భావోద్విగ్నంగా
నిర్మలంగా కనిపించడం
ఈ సమాజానికి కష్టమంట.
నీకు లావణ్యం ప్రసాదించిన
నీ హృదయ సౌందర్యానికి
కళ్ళు మూసుకున్న దీ ప్రపంచం
అందుకే నిద్రపోని నీ నిరంతరాన్వేషణ,
మనశ్శాంతికై చేసిన నీ గవేషణ
అన్నీ సుందర దీర్ఘ సుషుప్తిలో ఫలించాయి.

వరవర రావు



మనసులోని బొమ్మ

తురగా జానకీరాణి

"బాబుగారూ, తమరు లోపలికెళ్ళి సూడొచ్చండి, అమ్మాయిగో రడుకున్నారు. పాపాయి సుక్కలా వుందండీ," అన్నది మంత్రసాని.

"అబ్బాయీ!" అంటూ వెతుక్కుంటూ యివతలకి వచ్చిన పార్వతమ్మ కొడుకుని చూసి, "ఏరా ఇల్లా కూర్చు న్నావు?" అన్నది.

ఒక్క నిముష మాగి, "పద అబ్బాయీ. పిల్లని చూద్దువుగాని. కోడలు దిక్కులు చూస్తోంది, నువ్వు కనపడలేదని" అన్నది.

అప్పటికీ శివరామయ్యలో చలనం కన బడలేదామెకు. "నే నంటూనే వున్నాను కదరా, నాలుగోది ఆడపిల్లే ఔతుంది. ఐదో కాన్పుకిగానీ పిల్లాడు పుట్టడనీ, లే మరి-" అన్నది కొడుకు మనస్సు కనిపెట్టిన ఆవిడ.

శివరామయ్య లేచి, ఉత్తరీయం దులిపి, మీద వేసుకున్నాడు. "అల్లా శాస్త్రుల్లు దగ్గరకు వెళ్ళొస్తాను" అన్నాడు.

"వెడుదువుగానిలే - తొందరేముంది? పిల్ల చాలా కళగా వుంది. ఒక్కమాటు చూద్దువుగాని రా," అన్నది లాలింపుగా పార్వతమ్మ.

ఆయన లోపలకు అడుగు పెట్టాడు.

పురిటిగది గుమ్మంలో ఆగి, లోపలికి తొంగిచూశాడు. కిటికీలోంచి వెలుతురు గదిలోకి పడుతోంది. చిన్న మంచంలో గులాబీపువ్వే వున్నట్లుంది. కనురెప్పల వెంట్రుకలు నల్లగా, నిగనిగ లాడుతూ, తడిగా వున్నాయి. ఏ భావాలూ లేని ఆ పెద వులు ముడుచుకొని వున్నాయి. మూసివున్న గుప్పిళ్ళు తెల్లని మంచుపొర కప్పుకున్నట్లు వున్నాయి. శివరామయ్య చూపు మరల్చి భవానీవంక చూశాడు. ఆమె కళ్ళెత్తి నీర సంగా ఆయనవంక చూసింది, మళ్ళీ కళ్లు వాల్చుకుంది. గదిలోంచి వస్తున్న సాంబ్రాణి వాసన భరింపరానిదిగా అనిపించిం దతనికి.

తొందరగా బయటకు వచ్చేశాడు. సరాసరి శాస్త్రుల్లుగా రింటికే వెళ్ళాడు.

—ఇంటికి తిరిగివచ్చేసరికి అతనిమనసు భారంగా వున్నది. తల్లి వడ్డించగా, ఐదో భోజన మయిం దనిపించాడు. "మీ మామ గారికి, బావమరిదికి టెలిగ్రాములు యివ్వక పోయావూ?" అన్నది తల్లి. తలూపి వూరు కున్నా డతను.

గదిలో మంచం వాల్చుకుని, విసనకర్ర చేత్తో పుచ్చుకుని నడుం వాల్చాడు. పెద్ద పిల్ల పన్నెండేళ్ళది, వచ్చి వక్కలు, ఆకులు యిచ్చింది.

కళ్లు మూసుకుంటే, ముడుచుకొన్న చిన్ని మూతి- మూసుకున్న నల్లని కళ్ళు, గీసినట్లున్న కనుబొమలు - చిన్న ముఖం కనుపించసాగింది, గుండెల్లో ఒక మంట

బయలుదేరింది. ఎంతసేపటికీ అది అరక పోగా, తన శరీరమంతా అలముకుని, తనని పడుకోనివ్వలేదు. లేచి కూర్చున్నాడు. వళ్ళంతా చెమట పట్టింది. నుదురు ముట్టు కుంటే చల్లగా వుంది.

పెద్ద పిల్లని కేకేసి మంచినీళ్ళు తెమ్మ న్నాడు. అది త్రాగి, విసరుకుంటూ మళ్ళీ పడుకున్నాడు.

శాస్త్రుల్లు చెప్పినమాట నిజమా? అతడు అన్నమాట ఎప్పుడు అబద్ధమైంది కనుక? శివరామయ్య పడుకోలేకపోయాడు. లేచి, వంటగదివేపు వెళ్ళాడు. ఆ గది గొళ్ళెంపెట్టి వుంది. రెండోవేపున్న పురిటిగది దగ్గర మాటలు వినిపిస్తున్నాయి. పనిమనిషి, పార్వ తమ్మ గుమ్మందగ్గర కూర్చుని మాట్లాడు కుంటున్నారు. "అమ్మవారిపేరు పెట్టుకోవాలి దీనికి—'' అంటోంది పార్వతమ్మ.

"పదిసార్లు అనమోకండి పిన్నమ్మగారూ, దిష్టి తగిలేను పాపాయి గోరికి" అంటోంది పనిమనిషి.

శివరామయ్య దెబ్బతిన్నవాడిలా వెనక్కి అడుగువేశాడు. "దానికి పేర్లూవద్దు, ఏమీ వద్దు. బతికి బట్ట కట్టని పిల్లనిగురించి ఎందు కీ ఆలోచనలు?" అని అరవా లనిపించింది అతనికి. శాస్త్రుల్లు చెప్పినమాట అదే—. అంతేకాదు, ఈ పిల్ల జాతకాన్ని బట్టిచూస్తే యిది పోతేనేకానీ కొడుకు పుట్టడనిపిస్తోం దనికూడా చెప్పా డాయన.

"నాన్నా, నాన్నా! సుందీ పడిపో యింది...'' అంటూ ఏడుస్తూ వచ్చింది మూడో పిల్ల. శివరామయ్య చేతిలోని పుస్త కం అల్లా పారేసి వీధిలోకి పరుగెత్తాడు. సుందరి పడిపోయింది - దాని నుదురు చిల్లి పడింది. బొటబొట కారుతోంది నెత్తురు. లేచి నుంచుని నుదుటిని చేత్తో అదుము కుంటోంది యింకా.

చటుక్కున వెళ్ళి దాన్ని ఎత్తుకున్నాడు శివరామయ్య. బిత్తరపోయి తండ్రివంక చూస్తోంది అది. భవాని లోపల్నించి పరుగెత్తు కొచ్చింది. భర్త చేతుల్లోంచి దాన్ని అందు కుని, పరుగుపరుగున లోపలికి వెళ్ళింది. సున్నం పట్టీ వేసింది. పది నిముషాలతర్వాత అది మెల్లిగా ఏడవడం, తల్లి ఓదార్చడం విన్నాడు శివరామయ్య. మూడోపిల్ల, సుందరి కలిసి డాబామీదకి వెళ్ళారుట. మెట్లు వీధి వేపునుంచి వున్నాయి. క్రింద మిఠాయిబండీ వా డొచ్చాడని పిలుద్దామని పరుగెత్తబోయిం దట. పై మెట్టున వుండగా కాలుజారి, దబ దబ దొర్లుకుంటూ క్రిందకి వచ్చిందట.

ఇదంతా విని నిట్టూర్చాడు శివరామయ్య. సుందరికి ఆరేళ్ళు వెళ్ళాయి. సుందరి బిత్తరపోయింది-కానీ బారుమని ఏడవలేదు.

ఆ పిల్ల తనది కాదనీ, ఎవరిదీకాదనీ, ఆ భగవంతుడికే కైంకర్యం చేయబడినదనీ తన మనస్సు దిటవు పరచుకున్నాడు. ఇంటి కొచ్చిన బంధువు నేడో రేపో వెళ్ళిపోతాడన్న నిర్లిప్త దృష్టితో చూడడం నేర్చుకున్నాడు యీ పిల్లని. ఐనా—దాని ముఖం చూస్తే మనస్సు గుప్పిటపట్టి నొక్కినట్లవు తుంది. కళ్ళెత్తి దానివంక చూడలేక తప్పు చేసిన వాడిలా తల వంచుకునేవాడు. తనకు కొడుకు కావాలన్న కోరిక కలిగి నప్పుడల్లా, సుందరి పెద్ద కళ్ళతో తనవంక దీనాతిదీనంగా చూస్తున్నట్లనిపించేది అతనికి.

భవానితో ఏమని చెప్పేది యిదంతా?

ఈ ప్రమాదం జరిగిన తరువాత తనూ, భవాని ఎక్కడకు వెళ్ళినా దాన్ని వెంట బెట్టుకునే వెళ్ళేవారు. బట్టలకొట్టు కెడు తున్నప్పుడు కూడా అదెందుకని భవాని అడ్డుపెడితే ఏమీ చెప్పలేక బిగ్గరగా అరిచి కేకలేసేవాడు. భవానికి—సుందరి అందరి లోకి చక్కని పిల్ల కాబట్టి తండ్రి అంతగా దానికోసం యిదవుతా డనిపించేది.

పార్వతమ్మ ముఖమంతా యింత నవ్వు చేసుకుంటూ వచ్చింది సావిట్లోకి. పడక్కుర్చీలో కూర్చున్న కొడుకువంక చూసి ఆనందంగా నవ్వి, "అబ్బా యీ విన్నావా?" అన్నది.

"ఏమిటీ?" అన్నాడు బిత్తరపోయి - తల్లి సంతోషం అర్థంకాని శివరామయ్య. సుందరి పుట్టాక ప్రతి చిన్నవిషయం గూఢా ర్థంతో కనుపించసాగింది అతనికి. అన్ని టికీ ఉలిక్కిపడుతున్నాడు.


"కోడలు యీమాటు నీకూ నాకూ బహుమానం యిస్తుందట.... కొడుకే యీ మాటు" అన్నది ముసిముసి నవ్వుతో.

శివరామయ్య లేచి కూర్చున్నాడు, గొం తులో ఏదో కదిలింది. కడుపులో దేవి నట్లయింది. గుటక మింగాడు. చెప్పలేని నీర సం కాళ్ళలోకి వచ్చింది. తల్లి కోసమని చిన్నగా నవ్వాడు.

"సుందరి ఏదీ?" అన్నాడు.

కొడుకులో తను ఆశించినంత సంబరం కనుపించలేదు పార్వతమ్మకు. "ఇక్కడికే నిమ్మకాయలు తెమ్మని పంపాను" అన్నది. శివరామయ్య గబగబ అంగ లేసుకుంటూ వంటింటివేపు వెళ్ళాడు. భవాని అక్కడ లేదు. పెరట్లో వున్నది.

"ప్రతి దానికీ సుందీ నెందుకు పంపి



స్తారు? లక్షసార్లు చెప్పాను వద్దని—పసి పిల్ల అనైనా లేదు" అని బిగ్గరగా కేకలేసి, చివరి వాక్యానికి కంఠం రుద్ధమైపోగా, వీధి లోకి గబగబ వచ్చేశాడు శివరామయ్య.

గేటుదగ్గర పెద్దపిల్ల నుంచునుంది— గన్నేరు కొమ్మలు వంచడానికి ప్రయత్ని స్తోంది. దానికి పెళ్ళయి రెండేళ్ళయింది. పెళ్ళిమాట అప్పుడు. వ్రతానికీ. అంతకు మునుపు ఎన్నోసార్లు శాస్త్రుర్లు యింటికి వచ్చాడు. తనకి చెప్పిన ఆ సంగతి యిం కెవరితోనూ అనవద్దని గట్టిగా చెప్పాడు శివ రామయ్య. అందుకే ఎవరికీ లేదు ఈ భయం. ఎవరి మనస్సులోనూ గుబులులేదు. ఏమీ ఎరగనట్లు పూలు కోసుకుంటున్న పెద్దదాన్ని చూసి చికాకు పడ్డాడు.

"అన్నిటికీ సుందరిని పంపించమని ఎవరు చెప్పారే మీకు?" అన్నాడు. అ అమ్మాయి తెల్లబోయి చూసింది. "నేను పంపించలేదే ఎక్కడికీ! ఐనా - ఎక్కడి కెళ్ళింది అది?" అన్నది.

"ఏమో! ఎవరికి తెలుసు? ఎల్లా పోయిందో?" తండ్రి ముఖంలో గాభరా అతని కళ్ళల్లో దిగులు చూసి, నవ్వింది ఆ అమ్మాయి.


"ఏవిటి నాన్నగారూ, మరీ ఖంగారు? వస్తుందిలే. చిన్నచెల్లాయిని పంపిద్దాం చూసి రమ్మని. పాపా! ఒసేవ్ పాపా!" అని కేకేసింది.

పాప వీధిలోంచి వచ్చింది. అది ఏడు స్తోంది. "నాన్నగారూ, సుందీ .... పడి పోయింది." అంటూ ఏడుస్తూ చెప్పింది. శివరామయ్యకి ఆపుకోలేని దుఃఖం వచ్చింది.

"పడిపోయింది? పడిపోయిందీ? నేను అనుకుంటూనేవున్నాను. ఏదీ?...."అంటూ వెనక్కి చూడకుండా బయటకు వెళ్ళిపోయా డతను.

... మరి అరగంటకి తిరిగివచ్చాడు యిం టికి రిక్షాలో. సుందరి మోటారుసైకిలుక్రింద పడిపోయింది. పొట్టమీదనుంచి పోయింది సైకిలు. ఎల్లాబ్రతికిందో భగవంతుడి కెరుక. వంటిమీద గాయాలు తగిలాయి. ఆ రాత్రికి పెద్దపెట్టున జ్వరం వచ్చింది. పిల్ల దడుసు కున్నదని విభూతి మంత్రించి పెట్టించింది పార్వతమ్మ. భవానికి నిల్చునేందుకే ఓపిక లేదు. కడుపులో ఏదీ యిమడకుండావున్నది ఆమెకి. సుందరి మంచం ప్రక్కనే పడ క్కుర్చీ వేసుకుని. దాని వంకచూస్తూ కూర్చున్నాడు శివరామయ్య. అతను భోజనం చేయలేదు. నుదుటికి, చేతులకి, మోకాలికి కట్లతో సుందరి పడుకునుంది. దాని పెద వులు ఎండిపోయాయి. కళ్ళమీద బాధ తెలు స్తోంది. తెల్లని దాని చేతులు వదులుగా నిర్జీ వంగా పడివున్నాయి.

తనకి నిజంగానే కొడుకు కలుగుతాడా? భవాని సుందరిని కడుపుతున్నప్పుడు. ఎన్నో సార్లు కొడుకుని గురించి తలుచుకుని మురిసి పోయాడు. కానీ తనకి ఇప్పుడు ఆ ఆలోచన బాధాకరంగా వున్నది. కానీ విధి నిర్ణయం ఎల్లావున్నదో అదితను అనుభవించకతప్పదు. కళ్లు సగం మూసుకున్నాడు శివరామయ్య. నలభైఏళ్ళ జీవితంలో ఎన్నడూ లేనిది అతని కళ్ళలో నీళ్లు నిలిచాయి. క్రమ్మిన ఆ నీటి పొరల మధ్యనుంచి-సుందరి ఆకారం అలుక్కుపోయినట్లు కనుపించింది. ఎంతో ఆప్తులైనవాళ్ళు మనసుంచి దూరంగా



వెళ్ళడం తప్పనిసరైతే మనస్సు విలవిల లాడినా, ఆబాధ వెనకాల వాళ్ళు వెళ్ళిపోవడ మనేది అనివార్యం అన్న గుర్తింపు ఉండనే వుంటుంది. అందువల్లనే మనస్సు దిటవు పఱచుకుని, ఎడబాటు సహించ గలుగుతాం. సుందరివిషయంలో ఇటువంటినిర్ణయానికి శివ రామయ్య ఆ క్షణానే వచ్చాడు. మనస్సులో బరువుగా పేరుకుపోతున్న దుఃఖాన్ని, కడు పులో, గుండెలలో జ్వాలలాగా లేస్తున్న ఆవే దనని ఎల్లాగ తమాయించుకున్నాడో అతనికే బోధపడలేదు.

తెల్లగా, బొద్దుగా వున్నాడు పాపాయి. బోర్లపడడానికి ఉయ్యాల చాలక గోలపెట్టి ఏడుస్తోంటే, చూస్తూ నిలబడ్డాడు శివరా మయ్య. వాడు ఏడుస్తూనే, తండ్రివంకచూసి మరీ పెంకిగా కచ్చగా ఏడుస్తున్నాడు.

సాయంత్రం ప్రయాణం గురించి సంద డిగా తిరుగుతోంది భవాని. పెద్ద పిల్లలు యిద్దరూ మంచంమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. సుందరి మంచాన్నాను కుని నిలబడి వాళ్ళ కబుర్లు వింటోంది. మూడో పిల్ల సుందరిని వెక్కిరించింది. "ఫో! మహా గొప్ప తననేగా వూరు తీసు కెడుతున్నారని-ఫో, నీ గొన్తు సర్దుకో, మాతో ఎందుకు?" అన్నది అది. సుందరి కదల్లేదు.

శివరామయ్య యీ మాటలు విని మంచం దగ్గరకు వెళ్ళాడు. పిల్లలు మాటలాపేశారు,

"ఏమిటీ అంటున్నావు?" అన్నాడు మూడో పిల్లనిచూసి. అది ఏమీ మాట్లాడ లేదు. సుందరి కూడా తలవంచుకుంది. ఏడేళ్ళ దాని పసిముఖం ఎంతో గంభీరంగా

కనుపించింది శివరామయ్యకి. దాన్ని దగ్గరకు తీసుకున్నాడు. దాని వీపుమీద నిమురుతూ. మూడోదానివేపు తిరిగి, "మరి-సుందరీ అందరికంటె చిన్నదికాదూ? అందుకని పాపం అది ఏడుస్తుంది తీసుకువెళ్ళకపోతే. మరి మీ రిద్దరూ స్కూలు పిల్లలతో కలిసి ఢిల్లీ అవన్నీ చూసొస్తే ఏడిచిందా అది-ఏం? మరి ఏడ్పించకూడదు చెల్లాయిని." అన్నాడు.

వాళ్ళిద్దరూ మాట్లాడలేదు. "ఏం?" అని మళ్ళీ అడిగేసరికి తలూపి నవ్వింది మూడో పిల్ల.

సాయంత్రం రైల్లో బయలుదేరారు భార్యాభర్తలు, సుందరి, పిల్లవాడు తిరుపతికి. భవాని ఎప్పుడో పదేళ్ళక్రితం అనుకున్న మాట. కొడుకు పుడితే ఏడుకొండలవాణ్ని దర్శిస్తామని. పగలంతా భవాని, పిల్లలు సత్రంలో కూర్చునివుంటే, శివరామయ్య కాటేజి కోసమని తిరిగాడు. సాయంత్రానికి దొరికింది.

ఆ రాత్రి వరండాలో, దూరాన మినుకుమనే దీపాలు, నల్లగా, బ్రహ్మాండంగా వున్న కొండలు చూస్తూ కూర్చున్నాడు శివరామయ్య. భవాని, పిల్లలు పడుకున్నారు. దూరాన దేవాలయంలోంచి సన్నాయి వాయిద్యం వినిపిస్తోంది. చల్లగా, మెల్లగా హోరుమని లేచినగాలి కొండలనే ఊపివేస్తుందనిపిస్తోంది. ఆగాలి తనని పలకరిస్తోంది. ఆ గాలిలోంచి ఏవో శబ్దాలు వినబడి, శివరామయ్య మనస్సుని కలవరపెట్టాయి. ప్రశాంతమైన ఆ వాతావరణం నానా బీభత్సంగా అనిపించింది అతనికి. తనలోంచి పుట్టుకొస్తున్న వెర్రి ఆవేశానికి తట్టుకోలేకపోయాడు. నీళ్ళు నిండిన కళ్ళతో, దేవాలయం గోపురం కేసి చూసి, చేతులు జోడించాడు. "స్వామీ, నా బిడ్డను కాపాడు." అని వేడుకున్నాడు మనసారా.

ఎక్కువగా జనంలేని వేపు చూసుకుని స్నానానికి వెళ్ళారు ప్రొద్దున్న. పుష్కరిణి అంతా జనం బిలబిలలాడుతున్నారు. భవాని జుట్టు విప్పుకుంది. సుందరి జడ కూడా విప్పి, దాని గౌను ఊడదీయసాగింది. ఎండ చుర్రుమంటోంది. పిల్లవాడి ముఖానికి అడ్డంగా అంగవస్త్రం కప్పి, వాడిని ఎత్తుకున్నాడు శివరామయ్య.

భవానితోపాటు సుందరి కూడా దిగింది నీళ్ళలోకి. రెండుమెట్లుదిగి, అక్కడేనుంచుని చెంబుతో ముంచి నీళ్ల పోసుకుంటున్నారు వాళ్ళిద్దరూ.

పిల్లవాడు తండ్రిముఖంమీద చేతులతో కొట్టి, అతని జుట్టుపీకి, ఆడుతున్నాడు. తండ్రి అంగవస్త్రంతో దాగుడుమూత లాడుతున్నాడు. వాడు నవ్వినప్పుడు గులాబీ రేకుల్లా వున్న ఆ చిగుళ్ళు ఎండకి ఎర్రబడి కాశీ రత్నాల్లా వున్న వాడి చెవులుచూసి క్షణంపాటు ముగ్ధుడైనాడు శివరామయ్య.

"ఏమండీ! ఏమండీ!...అన్న భవాని కేక వినిపించి ఉలిక్కిపడ్డాడు. జనమంతా ఖంగారు పడుతున్నారు. తను గబగబ మెట్లు దిగాడు. "ఏమైంది భవానీ?" అన్న ప్రశ్న అతని గొంతులోనే వుండిపోతోంది.

భవాని నీళ్ళలోకి అడుగువేస్తోంది. శివరామయ్య ఆమెను చేరుకున్నాడు. "ఏమండీ-పిల్ల!" శబ్దం రావడంలేదు భవాని కంఠంలోంచి. నీళ్ళలోకి దిగిపోబోతున్న భవాని చేయి గట్టిగా పట్టుకున్నాడు శివరామయ్య.

పాపాయిని ఆమె చేతికిచ్చి చటుక్కున పుష్కరిణిలోకి దిగాడు తను. బండలు తగులుతున్నాయి కాళ్ళకి. కాళ్లు తేలిపోతున్నాయి. "సుడులుంటాయి బాబూ!" అన్నకేక ఒడ్డునుంచి వినబడింది.

అతనికాళ్ళు తేలిపోతున్నాయి - చేతికి సుందరి అందలేదు. అందడంలేదని యింకా నీరసంతో అతనిలో సత్తువ మాయమైంది. ఈదలేని అతని చేతులు సుందరికోసం నీళ్ళలో వెతుకుతున్నాయి. ●

ముడి

అనుష్టుప్ శ్లోకంలా చదువుకోవాలి.

మొ ఖా ఖా సా కృ శ్రీ గో కృ
వ చ రా న జ శా పు అ
కు ం ఈ ద క ం ఉ గ ం జో సో
వే అ మూ మొ క షా జ ప్ర

క్రౌ జో శ న జ శా కు ం రా
వి అ రా బ ం క రా పు నా
ఫ భా ఖా క ం అ దే రా రా
సా వీ పం క వ మే వ న

శౌ ం వెం రా మూ కె ఏ సీ శా
ప రా స్వా తె వి వి ం ల న
ఊ ల కా ం అ ల య ం రా ద్రి
బి రా రా బా ర వా బ్ర శా.

విప్పు

విజ్ఞాన సర్వస్వం తెలుగు సంస్కృతి సంపుటిలో రచనలు చేసిన కొందరి పేర్ల తాలూకు పొడి అక్షరాలు.

పంకజం

అది పల్లెటూరూ కాదు. పట్నవాసమూ కాదు.

శ్రీశ్రీ వర్ణించిన "చావు బ్రతుకుల పొలిమేరలో" ఉక్కిరి బిక్కిరవుతున్న పెద్ద కుగ్రామము. గ్రామీణ వాతావరణములోని స్వచ్ఛతను ఏనాడో కోల్పోయింది; నవనాగరిక జీవిత విధాన సౌకర్యాలను అమర్చుకోలేదు ఏమాత్రమూ ఇంకా. రాజ వీధికి మధ్యగా ప్రవహిస్తుంది మురుగు కాలువ. అనతి దూరంలో గోదావరి ఉన్నా, ఊళ్ళో వెలసిన కిల్లీ దుకాణాలూ కాఫీ హోటళ్ళూ వీనిపై ప్రసరించేది ఈ మురుగు కాలువ నుండి వీచే దుర్గంధ వీచికలే. ఊరి చివర కొచ్చేసరికి ఈ మురుగు కాలువ వైతరణిగా మారుతుంది. ట్రావలర్స్ బంగాళా నుంచి గోదావరి ఒడ్డుకు షికారుగా వెళ్ళాలంటే ముందు ఈ వైతరణిని దాటాలిసిందే. అవతల ఒడ్డున కొంత దూరం నడవాలి కూడా.

ఆ ప్రాంతంలో నేను ఉద్యోగం చేస్తూన్నప్పుడు, తరుచు ఈ ఊళ్ళో మకాము చేయవలసి వచ్చేది; ఊళ్ళో నాకేమీ పని లేదు. కాని, అందమైన ఆ బంగాళాలో మకాము ఏర్పరచుకొని చుట్టు ప్రక్కల ప్రాంతాలలో పర్యటించి వచ్చేవాడను.

ఒకసంవత్సరం, ఎక్కడనుంచి వచ్చారో నాలుగు దొమ్మర కుటుంబాలవాళ్ళు మురుగు కాల్వ అవతల ఒడ్డున గుడిసెలు వేసుకున్నారు. ఈత చాపలు అల్లడమూ, పందులను సాకడమే వీళ్ళ పని ఐనా, అనాదిగా వస్తూన్న వాళ్ళ కుల వృత్తిని అనుసరిస్తూ పరిసర గ్రామాల యువకుల ఆరోగ్య క్షీణతకు బాగా తోడ్పడసాగారు. చీకటి పడితే, మర్యాదస్తులు ఆవేపుకు వెళ్ళటానికి భయం అన్నంతగా ముదిరిపోయాయి పరిస్థితులు, ఆ కాలవ గట్టున.

నాకు ఉదయపు షికారు తప్పని సరి. బంగళా నుంచి బయలుదేరి, గోదావరి ఒడ్డుకు వెళ్ళి కాసేపు కూర్చుని ఆ గంగలోనే స్నానంచేసి వచ్చేవాడను. కాని, ప్రతి సారీ ఈ వైతరణిని దాటక తప్పేది కాదు, ఎంత బాధగా ఉన్నా.

ఒక రోజున సూర్యోదయపు వేళ ఇలా కాలువ వొడ్డున తలవంచుకు చరచరా నడిచి వెళ్ళిపోతుంటే బాటప్రక్కనే ఒక పాపాయి కనిపించింది. టక్కున ఆగిపోయాను.

చికిరి చాపమీద పరచిన జిడ్డు ఓడుతూన్న నల్లని ముతక దుప్పటీమీద వెల్లికిలా పడుకుని, నిర్మలమైన ఆకాశం కేసి చూస్తూ, కేరింతాలు కొడుతోంది దబ్బపండు వంటి అర్భకురాలు. ఏ తల్లి తొడిగిందో ఎర్రని చిట్టి పావడా, ఆకు పచ్చని చిట్టి చొక్కా. మెళ్ళో రంగు రంగుల పూసల మధ్య పులిగోరు తాయత్తు. దొండపండు లాంటి లేత పెదవుల మధ్య చిరునవ్వు తాండవిస్తోంది. జీడి గింజలకంటె నల్లని ముంగురులు గాలిలో అల్లలాడుతున్నాయి. అలా చూస్తూ ఉండిపోయాను.

ఉన్నట్టుండి, బాల కిన్నెర స్వరము నా చెవుల నానంద పరచింది. వచ్చీరాని జిలిబిలి పలుకులతో పాపాయి పాడుతోంది - గంగా గౌరీ దేవి సంవాదంలో ఒక చరణము.

ఎల్లా అలవరచుకున్నదో ఈ చిన్నికూన పెద్దవాళ్ళు పాడే ఆ పాటవరుసా, ఆ ఎత్తిపొడుపు తీరూను! మాటలలోని అభిప్రాయం తనకు అనుభవ మవుతూన్నట్లే పాడుతోంది అర్థం కాని పలుకులలో అతి శ్రావ్యంగా! గంగమ్మతల్లీ, గౌరీ దేవి ఒక్కసారిగా నా కళ్ళ ఎదుట సాక్షాత్కరించారు.

నన్ను చూచి చటుక్కున పాట ఆపివేసింది. లేచి కూర్చుంది ఆ చిట్టి తల్లి చిరునవ్వు నవ్వుతూనే. నాలో వెల్లువైవచ్చే ఆపేక్షను బలవంతాన అణచుకుని, నా చొక్కా జేబులో ఉన్న చిల్లరంతా గుప్పిట్లోకి తీసుకుని "ఇంద" అంటూ పాపాయికి ఇవ్వబోయాను. లేచి నుంచుని, క్రొత్త మనిషిని చూచి బెదురుకుంటూ, రెండడుగులు వెనక్కు వేసింది, పసిపిల్ల.

నేను ముందుకు వెళ్ళబోయాను; పాప మరి రెండు అడుగులు వెనక్కు వేసింది ఈసారి ఇంకా ఎక్కువగా బెదిరిపోతూ.

ఇంతట్లోకే, అవతల, కుంపటి వద్ద చలి గాచుకుంటూన్న ముసలి అవ్వ గొంతు వినిపించింది, కాకి స్వరంతో: "పుచ్చుగో! అయ్యగారు ఇస్తున్నారు. వద్దనకూడదు; పుచ్చుగో!!" అంటూ, చుట్ట త్రాగుతూ, మధ్య మధ్య పొగ వదుల్తూ.

ఆవేపు చూచాను; పట్టరాని రోతతో కళ్ళు మూసుకున్నా. అబ్బా! మనుషులూ ఇలా ఐపోతారా, అనుకుంటూ నా నరనరాలు కంపించిపోయాయి.

గుప్పిటిలోని డబ్బులను దుప్పటిపైన రాల్చి, రివ్వున ముందుకు సాగిపోయాను. పాపాయికేసి తిరిగి చూడడానికి కూడా బుద్ధి పుట్ట లేదు.

నాలుగే నాలుగు అడుగులు వేశాను. ఎడమవైపు గుడిసె వెదురు తలుపు వెనుక నుంచి స్త్రీ కంఠం వినిపించింది: "ఒక్క క్షణం లోపలకు వచ్చి వెళ్ళరాదూ!" అంటూ.

కొరడా దెబ్బ తగిలిన వానిలా త్రుళ్ళి పడ్డాను.

ఈ కోకిల కంఠ స్వరములో పాపాయి తీయని గొంతు వినిపించింది నాకు.

చివాలున అక్కడ వ్రాలి అమాంతంగా పాపాయిని నా హృదయానికి హత్తుకుని ఆ లేత తామర పువ్వును ఈ బురదలోంచి పెకలించుకు పోవాలనే వెర్రి ఆవేశం క్రమ్ముకుపోయింది ఆపాద మస్తకమూ నన్ను. ఒక్క అడుగు వెనక్కు వేశాను కూడా.

కాని నాలో ఎవరో అన్నారు:

"నువ్వెవరవు? పాపను హృదయానికి హత్తుకుని ఎత్తుకుపోవడానికి నీ కేమి హక్కుండి-పో! ఇక్కడనుంచి పో! పో! ఇంకా వెళ్ళవేమి!!" అంటూ.

చరాచరా నడచి వెళ్ళిపోయాను గోదావరి వైపు.

నా విధిని నేను నెరవేర్చలేని దుర్బలుడను నేను-బురదలోంచి తామర పువ్వును పెకలింపలేని అసమర్థుడిని నేను... ఎన్ని అనుకుంటే ఏమి లాభం!

నా "పంకజం" ఎక్కడున్నదో ఇప్పుడు? ●

చంట జానకిరామ్

ఒక చిన్న ప్రేమ కథ



ఓ మంచి సీను
చెప్తా చూడండి సార్
అమ్మాయి, అబ్బాయి
ప్రేమించుకున్నారండి.



తోటలో ఓ డ్యూయెట్
కూడా పాడారు.
"మన పెళ్ళి మాటేమిటి?"
అంది అమ్మాయి.



"మా నాన్నేమంటాడో?...
ఫర్వాలేదులే. ఇప్పుడే
వెళ్ళి చెప్పేస్తా" అని
యింటికి పరిగెట్టాడు.



"ఫో. నా యింట్లోంచి
ఫో. నువ్వు నా కొడుకువి
కాదు; నేను నీ తండ్రిని
కానూ——



"అలా చూస్తావేం;
ఇది మీ యిల్లు కాదూ.
పక్కింట్లో కొచ్చేశావ్!"
అన్నా డాయన.



ఎలా వుంది సార్——
లవ్ ఈజ్ బ్లైండ్
ప్రేమ గుడ్డిది
అన్నారు కదండీ మరి.."

సుకుమార్ - జోకులు

తెలుగు, హిందీ తేడా లేకుండా వూళ్లోకి వచ్చిన ప్రతిసినిమా చూడ్డానికి అలవాటు పడ్డ యువకుడు వేరే కులం అమ్మాయిని ప్రేమించాడు. తన కుమార రత్నం అడ్డమైన దా న్నెవత్తెనో ప్రేమించాడని, ఆ తండ్రి మండిపడిపోతూ—"నాకు నువ్వు కొడుకువీ కావు - నేను నీకు తండ్రినీ కాను'' అని గర్జించాడు, దాంతో హీరో సీరై—"ఆఁ! అట్లాగా - ఐతే మరెవరు నా తండ్రి? నా తండ్రి ఎక్కడుంటాడు? నేను నీ దగ్గరకు ఎట్లా వచ్చాను? నన్ను లాలించి పాలించి, తన హృదయానికి హత్తుకునే ఆ నాన్న - మా నాన్న - ఎక్కడుంటాడు? ఇన్నాళ్ళూ ఈవిషయం ఎందుకు దాచావు నువ్వు? ద్రోహీ! నా కెందుకని చెప్పలేదు? నువ్వు ఇంత కసాయివాడవా? ఛీ, ఇక నీ ముఖం చూడరాదు. ఇంక ఈ ఇంట్లో ఒక్క క్షణం వుండరాదు!" అని గుక్కతిప్పుకోకుండా గడగడా వల్లించేసి గిరుక్కున తిరిగి - తండ్రి పిలుస్తున్నా వినకుండా "నాన్నా - నా నాన్నా'' అంటూ చరచరా బయటకు వెళ్ళిపోయాడు.

ఒక పత్రికా సంపాదకుడు రచనలు పంపవలసిందని, ప్రచురింపబడిన రచనలకు ప్రతిఫలం వుంటుందనీ తన పత్రికలో ప్రకటించాడు. ఉత్సాహంగల ఒక యువ రచయిత - రచన పంపాడు. అది పడింది. ఐతే ఆరు నెల్లదాకా ఆశించిన ప్రతిఫలం అందకపోగా, ఆ రచయిత సంపాదకుడికి ఉత్తరం రాశాడు. దానికి ఆ సంపాదకుని జవాబు ఇది: "మీ రచన పడిన సంచిక "ప్రతి" ఎప్పుడో మీకు అందే వుంటుంది. అందువల్ల మేము ప్రకటించిన "ఫలం'' మీకు దక్కినట్టే అనుకుంటాము."



ప్రముఖ రాజకీయ నాయకుడు ఒకాయన ఆర్నెల్లలో రెండోసారిగా ఆ వూరు వెళ్ళాడు. ప్రతి సభకీ, ఉత్సవానికీ తప్పకుండా హాజరయ్యే ఒక మహిళామణి ఆయన్నడిగింది "నేను జ్ఞాపకమున్నానాండీ?" అని.

"అమ్మా! మీలాంటి అందమైన ఆడవాళ్ళందర్నీ జ్ఞాపకం పెట్టుకునే మాటైతే నా పని సాగుతుందా?" అన్నాడు నాయకుడు.

విజయనగరంనాటకోత్సవాలలో ఒక సంవత్సరం విశ్వనాథ సత్యనారాయణగారికి కవిసన్మానం జరిగింది. సన్మానానంతరం నాటక ప్రదర్శన లున్నాయి. అందువల్ల వారు స్వీయ కవితా పఠనం తొందరగానే ముగిస్తారని ఉత్సవాధికారి ఒకరు ప్రేక్షకులకు అభయం ఇచ్చారు. సత్యనారాయణగారు ఒకసారి చురచురాచూసి— "ఐనా, రామాయణంలో పిడకల వేటల్లే - ఈ నాటకాల మధ్య కవి సన్మానం ఏమిటి?— సరే - పైన్ వెర్సా చేసి, రామాయణం ఆరంభిస్తా" నని పఠనం ఆరంభించారు!

ఇబ్బంది ప్రయాణం

అన్ ఎంప్లాయిమెంటు జ్ఞాపకాలకు
జ్ఞాపకాల భూతాలకు
రౌరవాది నరకాలకు
కౌరవాది దుర్జనులకు ఇక రాం! రాం! టా! టా!

అదే వెల్ఫేర్ స్టేట్ బస్
ఎక్కు అన్నా ఎక్కేవో
సూర్యనారాయణా - ఫైలు పారాయణా
శాంత వినయాది సహజ సద్గుణ సంపన్నా!

ప్రస్తుతానికి బస్సు ప్రయాణం కాస్త ఇబ్బంది
కాని చేరతావు తప్పక నీ గమ్యం బ్రేవో
నీ జీవితం సత్య హరిశ్చంద్ర నాటకం
కథాంతానికి అవుతాడు ముద్దాయి విడుదల

అప్పటికి నెరిసిపోతుంది తల
అప్పటికి ధరలు తగ్గుతాయి
వేతనాలు సమృద్ధిగా పెరుగుతాయి
అంతవరకూ పఠించు ఋణ విమోచనకు
అంగారక స్తోత్రాన్ని మనసారా.

గో(పా)ల చక్రవర్తి

గుండెల మీద కుంపటి

వాహిని



మధ్యాన్నం పన్నెండు గంటలు కావస్తోంది. రైలు మావూరి స్టేషన్లో ఆగేసరికి ఎండ పెళ్ళుమని కాస్తోంది. వర్షాకాలపు ఎండేమో, ఉక్కపోసి కిత కితలు పెడుతోంది.

టెలిగ్రా మిచ్చినా స్టేషనుకి రాలే దీయన. ఆర్నెల్లయింది నేను పుట్టింటికి వెళ్ళి. పాపాయి నెత్తుకుని ఇదే రావడం. అసలింకా రావాలని లేకపోయినా శ్రావణమాసం నోము మా యింట్లో నోచుకోడవేఁ అనవాయితీ అవటాన్ని ఒచ్చేశాను.



ఎలా లేదనుకున్నా సామాన్లు ఎక్కువయ్యాయి. వెళ్ళేటప్పుడు పెట్టే హోల్డాలే పట్టుకెళ్ళేను. మా వాళ్ళిచ్చిన ఊరగాయ జాడీ ఒకటీ, పాపాయి సామానుతో ప్లాస్టిక్ బుట్ట ఒకటీ, వేణ్ణీళ్ళతో ధర్మాస్ ఫ్లాస్కు-ఇలా ఓ చిన్న ట్రాన్స్ఫర్‌కి అయినంత సామానైంది. కూలివాళ్లూ రిక్షావాళ్ళూ ఒంటరి ఆడదాన్ని చూసీ, సామాను చూసీ నాదగ్గిర రావలిసిన దానికంటె ఎక్కువ డబ్బులు గుంజుకుందికి ప్రయత్నిస్తున్నారు.

పావు గంట సేపు చూశాను. ఇంకా రాలేదు ఈయన. రిక్షా మాట్లాడుకొని ఆయన మీద విసుక్కుంటూ అందులో కూచున్నాను.

పోనీ ఇంటి దగ్గిరైనా ఉంటారన్న ధైర్యంతో వస్తే, ఇల్లు తాళం పెట్టేసివుంది. నాకు నిస్సహాయతవల్ల కోపం పట్టలేనంతగా ఒచ్చేసింది. వీధి వసారాలో సామాను పెట్టించి ఏడుస్తున్న పాపాయిని సముదాయిస్తూ దిక్కులు చూస్తున్నాను.

ఇంతలో ఎవరో వొకావిడ వచ్చి పొరుగింటామెనని చెప్పింది. ఇంతకు ముందు ఉండేవాళ్ళు మారిపోయి నట్టున్నారు. ఆవిడైనా పాపని ముద్దు లాడుతూ కూచుందే కాని తాళం తనదగ్గిరుందని బైటపెట్టనేలేదు. నేను ఆయన మీద విసుక్కుంటూ వుంటే 'అయ్యో' ఈ యింటి తాళంచెవి వొకటి నా దగ్గర వుందమ్మా. పనిమనిషి వొస్తే యిమ్మన్నారు.' అంటూ కొంగు ముడి విప్పి తాళం చెవి నా చేతికిచ్చి వెళ్ళింది.

పోనీ ఎలాగో తాళం వుంచేరని సంతోషిస్తూ, తలుపు తీసి లోపలికి వెళ్ళేను.

పాపని మంచంమీద పడుకో బెట్టాను. భారసాలకి "వొచ్చిననాడు నువ్వు మళ్ళీ ఇంటికొచ్చే నాటికి చూస్కో, ఫస్టు క్లాసయిన ఉయ్యాలా మంచం కొని యింట్లో వేలగడుతున్నామ్" అని డాబులు కొట్టిన పెద్ద మనిషి-ఉయ్యాలా లేదు మంచమూ లేదు!

అయితే, ఆయన ధర్మ(వా(అని యిల్లు మాత్రం అరణ్యంలా చెయ్యలేదు. సామానంతా వొక్క చేతిమీద యింట్లో పెట్టుకున్నాను.... వీధి తలుపు గడియవేసి అలా బాత్రూమ్ కేసి వెడదామని అనుకుంటున్నాను.

"సార్!" అని వొక ఆడ గొంతుక.

తలుపు తీశాను.

చేతిలో కేరియర్ లేకపోతే ఎవరో పొరుగమ్మ కాబో లనుకొనేదాన్ని.

హవాయి చెప్పులు, పద్దెనిమిది రూపాయల వెరైటీ కాశ్మీరు సిల్కు చీరా. కుడిచేతికి రెండు బంగారపు గాజులూ. ఎడం చేతికి దాదాపు డజను ఎర్రటి మట్టి గాజులూ, నడుం మీదికి వాయిల్ జాకెట్టూ ధరించిందా మనిషి. తల నున్నగా దువ్వుకుంది. తల్లో పెట్టుకున్న చేమంతులు నేను పక్కకి వొంగి చూడక పోయినా, ఆవే తొంగి చూస్తున్నాయి కొత్తగా, ఒత్తుగా. నల్లగా వున్నా మంచి నిగ నిగా. అందం వున్నా యా మనిషికి.

'ఎవరు నువ్వు?' అన్నాను.

'పనిమనిషినండి.' చిరు నవ్వుతో. 'నువ్వెవరు?' అన్న ధీమాతో అంది.

'ఊఁహూఁ! - ఈ వేళప్పుడొచ్చావేం?'

'మరి—అన్నం తేవద్దండీ?'

'అయితే ఆ పిలుపేఁవిఁటి. సార్ అంటూను! — అయ్యగారూ అని పిలవ లేవూ?—'

'మా కట్టాగే అలవాటండి!' మళ్ళీ నవ్వింది.

ఎంత నిర్లక్ష్యం!— పైగా ఆ నవ్వు నా ప్రాణాలు తోడేస్తోంది. 'మాకు'ట, 'అలవాటు'-ట!

'నీ పేరు?'

'రంగమ్మండీ, "రంగూ" అని పిలుత్తారండి.'

రంగు లాగే వుంది! దాని దర్జా చురుకూ చూచి దారి తప్పుకోవడం మరచిపోయి, బాత్రూమ్ కేసి వెడదా మను కున్నదీ మరచిపోయి అలాగే నిలబడిపోయాను.

'అరు లేరాండీ?' అంది మళ్ళీ ఆ పని మనిషి-'నీతో నాకేం పని!' అన్నట్టు; నేను 'అమ్మగా'ర్నని గ్రహించడానికీ ఇష్టం లేనట్టు.

నా ఆలోచనలు విపరీతంగా పరుగు లెడుతున్నాయి. దానికి జవాబు చెప్పకుండా లోనికి వెళ్లాను.... ....

దీంతో పేచీ లేకుండా అంట్లు తోఁవిఁంచుకొని యిల్లు తుడిపించుకో గలిస్తే నేను భారత ప్రభుత్వంలో ఏదేనా ఉన్నతోద్యోగం సంపాదించ గలనని అనిపిస్తోంది. ఏది ఎలా ఉన్నా ఇప్పుడు ఆ కేరియర్లో అన్నం తినాలి కాబోలు . . . ముళ్ళమీద నుంచున్నట్టుంది. . ,ఆ మనిషి శుభ్రంగా

లేదని కాదు. . . ఎందుకో-నా కది నచ్చ లేదు!

కాళ్లు కడుక్కొని యింట్లో కొచ్చాను. 'పనిమనిషి' అప్పటికి కప్పుడే కేరియర్ టేబిల్‌మీద పెట్టింది. చీపురు పుచ్చుకు గది వూడ్చింది.

చూడ్డం మరచి పోలేదు నేను—దాని పసుప్పచ్చని హవాయ్ చెప్పులు-అదుగో— ఆ మూల పెట్టింది; మా జోళ్ళు పెట్టుకునే చోట!

చిన్న మంచం వాల్చి, దాని మీద పక్కవేసి పాపని జాగ్రత్తగా పడుకో బెడుతోంది నేను వెళ్ళే సరికి. 'అరెరె!' అన్నాను కంగారుగా. నా పాపని ఈ మనిషి ముట్టుకోడం యిదే మొదటిమాటు. కేరియర్ తెచ్చిన చేతులు కడుక్కోకుండా పాపని తీసిందని చిరాకు వేసింది నాకు.

గోల చెయ్యొద్దన్నట్టుగా సంజ్ఞ చేసింది నాకు పనిమనిషి, పాపని జోకొడ్తూ. నేను మాట్లాడలేక పోయాను,

నా దృష్టి కేరియర్ మీద పడింది. మళ్ళీ 'ఇక్కడ పెట్టా వేమే? వంటింట్లో పెట్టక పోయినావా?' అన్నాను.

'ఇయ్యాల కిక్కడ టేబిలిమీద బోంచెయ్యండమ్మగోరూ. సాయంకాలం కొత్త పెందలకాడే వొచ్చి ఒంటిల్లు కడిగి ముగ్గెడతాను, ఒంట సేద్దురుగాని.'

'సరే ఇహ అదొక్కటే తరవాయి. వొంటిల్లు కూడా కడగాలీ .... అన్నం తింటున్నది చాలక!' అన్నాను.

'కడుక్కోకుండానే ఒంట సేస్తారెట్టా!'

నాకు నసాళం అంటుతోంది కోపం .... నాకు శుభ్రాలు మప్పుతోంది, ఇదెక్కడి పని మనిషి!

ఇటు తిరిగి, పెద్ద మంచం దగ్గిర కొచ్చింది. దుప్పటి దులుపుదామని కాబోలు నడుం బిగించింది.

"సరేలే, అదలావుంచు!" అన్నాను.

వీథిలో అడుగుల చప్పుడైంది.

ఆయ నొచ్చేరు.

"హల్లో లక్ష్మి, ఒచ్చేశావా!-వెరీ సారీ-టెలిగ్రాం యింతకుముందే అందింది. రైలు ఆమాత్రం లేటవక పోతుందా అని స్టేషను కెళ్లాను......పాపాయి నిద్రపోతోందా?" ఇదీ పలకరింపు......క్షేమంగా ఒచ్చేవా అనిలేదు: అవస్థపడ్డావా అనిలేదు!...కోపం వొస్తోంది.

అటువేపు తిరిగా రాయన. పనిమనిషి చిరునవ్వు అటువేపు ప్రసరించింది. ఆయన దాన్నేమేనా అనడం పోయింది; తనూ చిరునవ్వు వెలిగిస్తూ, "నువ్వు ఉన్నావా అమ్మగా రొచ్చేసరికి ఇంట్లోనూ?"

"లేదండి. ఆరే ముందొచ్చినారండి.... ....ఎల్తానండి." అనడమేమిటి, చెప్పులు తొడిగేసుకుని చకచకా నడిచెయ్యడ మేమిటి క్షణంలో అవతలి కెళ్ళింది.

"అరె! వెడుతున్నావా? రంగూ!—" అంటూ ఈయన వీథి గుమ్మందాకా వెళ్ళేరు. "నీళ్ళూ అవీ పెట్టేవా అమ్మగారికి! అమ్మగారు స్నానం చేసిందా?—కాసేపుండి వెళదువు గాని, — రా!"

నా ఒళ్ళంతా చెమట్లు పోస్తున్నాయి.

వచ్చాడు—

సాయంకాలం అయిదు దాటేసరికి ఆయన ఆఫీసునించి వచ్చేశారు. పనిమనిషి పెరట్లో పని పూర్తి చేసేసి గదులు రెండూ వూడ్చింది. పడక గదిలో కొచ్చి పెద్ద మంచంమీద పడక సరిచెయ్యబోతోంది.

"అదలా ఉంచు" అన్నాను.

"ఏత్తా లెండమ్మా తవఁరి కెందుకు శ్రవఁ!" అంటూ దుప్పటి తీసింది.

నా కిష్టంలేదు.

పనిమనిషి చేత గిన్నెలు తోమించడం, యిల్లు వూడ్పించడం, పోతే దుకాణానికి పంపి ఏవేనా వెచ్చాలు తెప్పించుకోవడం— యిలాటిపన్లే తప్ప పక్కలు నేనెప్పుడూ వేయించలేదు.

నెలకి నాలుగైదు రూపాయ లిచ్చి పని మనిషిని పెట్టుకుంటాం. పెట్టుకునేటప్పుడే వాళ్ళు చెయ్యవలిసిన పన్లు నిర్ణయించుకుంటాం. అందులోకి పక్కలు వెయ్యడం, కట్టు విడుపు గుడ్డలు తడపడం, తాగే నీళ్ళు తేవడం, యిలాటివి కొన్ని వెళ్ళవు. మా యింట్లో. దానికి ప్రత్యేకమైన కారణం లేకపోయినా—పనిమనుషులు శుభ్రంగా ఉండరనీ, వాళ్ళు చేసే ప్రతిపనీ మళ్ళీ మనం ఫినిష్ చేసుకుంటేగాని పనికిరాదనీ-అమల్లో వుండే సామాన్యమైన కారణం. మాట వరసకి, పనిమనిషి తోమి ఇచ్చిన గిన్నెలు మళ్ళీ కడిగితే కాని వంటింట్లో పెట్టుకోను నేను.

అదీగాక మా పక్కలు నేను వేసుకోగలను. "శయ్య సవరించడం" ప్రత్యేకం నావల్ల జరగవలిసిన పని అని నానమ్మకం. "పడక" మీద నాకొక ప్రత్యేక గౌరవం వుంది.

"ఏ శ్రమా లేదు. అల్లా వుంచు. వేరే పనేదైనా చూసుకో."

"పన్లన్నీ అయిపోనాయి గదండీ." అని నవ్వింది పనిమనిషి.

అది నవ్వితే నా కెలాగో ఉంటోంది....

"నవ్వుతావేం?-పిచ్చెక్కిందా"అన్నాను.

మొత్తంమీద అలా వదిలి ఇవతల బడింది.

ఆయన ఇదంతా గ్రహించాను సుమా అన్నట్టు-"రంగమ్మ శుభ్రంగానే చేస్తుందే! పక్కలూ వేయించేస్తూ ఉండు. ఇన్నాళ్ళూ అదే వేస్తోందిగా!—దాని పని నీకు నచ్చలేదా?" అన్నారు.

"మునుపటి పనిమనిషేమైంది?" అన్నాను నేను జవాబు చెప్పక.

"నువ్వెళ్ళిన తరవాత మానేసిం దది. మధ్యాన్నం పన్నెండు దాటేక కేరియర్ తెమ్మంటే నా కా హోటళ్ళు తెలియవంది. ఓ రోజు దాన్ని రిక్షాలో కూర్చోబెట్టి, కూడా సైకిలేసుకెళ్ళి చూపించేను—ఆ రాత్రి దారి మరిచి పోయా నయ్యగారూ అంటూ తొమ్మిదిన్నర చేసేసింది—అప్పుడు దీన్ని పెట్టానన్నమాట—కొంచెం ఎక్కువే అడుగుతూంది గాని శుభ్రంగా చేస్తుందిలే—మంచి చురుకైన మనిషి కూడానూ."

ఎం తిస్తు న్నా రేమిటి?'

'ఎనిమిదీ.'

'అ....వ్వ!—ఎనిమిదే!—ఆ సిల్కు చీర నాదేనా?—మీరే యిచ్చారా?'

'అఁ—చేరి అర్నెల్లయింది గదూ—మొన్న నొచ్చి అడిగితే, సరే పాత చీరే గదాని యిచ్చాను!'

'ఎంత బావుందండీ!—ఇంతోటి పనికి నెల కెనిమిది రూపాయలు గాక సిల్కు చీరలు గూడానా!—ఇంతకీ ఏమిటి, పని— మహా!'

'పొద్దున్నే వొస్తుందీ—స్నానానికి నీళ్ల కాచడం, తోడడం, మంచినీళ్ల తేవడం. రాత్రి తిన్న కేరియర్ కడగడం, ఇల్లు వూడ్చడం! మధ్యాన్నం నే నొచ్చేసరికి కేరియర్ తెచ్చి పెట్టడం—'

'మరి తోమడానికి వంట గిన్నెలైనా లేకుండా ఎనిమిది రూపాయ లేమిటండీ!-ఇదివరకు పనిమనిషికి అయిదేగా యిచ్చాం!'

'ఆ కండిషన్ మీదే ఎపాయింట్ చేసేను. నువ్వు వస్తే వంటగిన్నెలూ తోముతానంది-'

'ఎంత పనైనా పొద్దుటే కదండీ-ఒక్కపూట పనికి ఎనిమిదా?'

"పొద్దుటేమీ — సాయంకాలం మాత్రం—అయిదు దాటేక ఒచ్చి, మధ్యాన్నం తిన్న కేరియర్ కడగడం, హోటలు కెళ్ళి భోజనం తేవడం—' అంటూ చదువుతున్నా రాయన.

"—పక్క వెయ్యడం—!" అన్నాను నేను, ఒళ్ళు మండి.

"మరి పక్క వెయ్యదుటే?—నేను వేసుకుంటానా యేఁవిఁటి, లేకపోతేను!"

"నా పగాదులు లేవు..." —కృష్ణశాస్త్రి

“చాల్లెండి. పక్కలు అదేఁ వీఁ వెయ్యక్కర్లేదు. నేనే వేసుకుంటాను.— ఇంకానయం!....” ఆ తరవాతి మాట అన్లేదు నేను.

‘సరే నీయిష్టం. నాకేం పోయింది—? ఇంతా వన్లేదని నన్ను దెప్పి పొడిచీ దాన్ని ఊరికే కూచోబెట్టి ఎనిమిది రూపాయలూ ఇచ్చేటట్టున్నావు!’ అని అవతలి కెళ్ళా రాయన.

పక్క తీసి దులిపాను. దిండు గలీబు మాసినట్టుంటేను మార్చి ఇంకోటి తొడుగుదామని వొంగాను. మంచానికీ గోడకీ మధ్యన దుమ్ము పేరుకొని వుంది....ఏమిటి దీని శుభ్రం! అని వెటకారంగా అనుకుంటూ చీపురు తెచ్చి, మంచాన్ని కొద్దిగా యివతలికి లాగి, మూలనుంచి మొదలుపెట్టి తుడవ సాగాను....అక్కడేవో గాజుపెంకులు.... కాదు, చేతి గాజుల ముక్కలు .. ఆర్నెల్లనాడెప్పుడో నా చేతివి పగిలి పడ్డాయి కాబోలు, ఇంకా అలాగే వున్నాయి....శుభ్రం శుభ్రం అనుకోడఁవేఁగాని పనిమనిషి శుభ్ర వేఁవిఁటి. నా మొహం!—అంతా రంగు!, పైపూత!- తుడుస్తున్నాను;....వెలుగులో పడ్డాయి గాజు ముక్కలు....

ఏమని చెప్పను!....అవి నా చేతి గాజుల ముక్కలు కావు!....అయ్యో. అవి ఆ పని మనిషి చేతిని నేను చూస్తున్న ఎర్రటి గాజుల ముక్కలు!

ఛీ-!

నా మనస్సులో తుపాకులు పేల్తున్నాయి. పడక గదిలో. మా ఆయన పడుకొనే మంచం సందున.-అలాటి గాజు ముక్కలు.

ఆ మనిషివి—ఆ రంగువి—ఉండడమా?- దీనర్థం ఏమిటి?

చేతిలో చీపురుకట్ట జారిపోయింది. ద్వారం వరకూ చీపురుతో తరుముకొచ్చిన దుమ్మూ, అందులోంచి ఎర్రగా మెరుస్తూన్న ఆ గాజు ముక్కలూ నన్ను వెక్కిరిస్తున్నాయి. అవి ఎత్తి అవతల పారబొయ్యడానికి చేతులు రావడం లేదు. ఏవో చెప్పరాని ఆలోచనల్తో మనస్సంతా మలినమైపోతోంది. కోపంతో ఒళ్ళంతా చెమటలు పోస్తున్నాయి.

అయిదు నిమిషాలైంది. చేసుకోవల్సిన పని చూసుకొని పొంగుతున్న ఉద్వేగాన్ని అణచుకున్నాను. కొంచెం తేరుకున్నాను. బట్టలపెట్టె తెరిచి దిండు గలీబు ఒకటి తీసి. మళ్ళీ మంచం దగ్గరి కొచ్చాను. మాసిన గలీబు విప్పుతున్నాను....ఏమిటోగాని ముడి ఊడొచ్చినా తాళ్ళు వేరవక అలా పట్టుకున్నాయి.

ఏమిటా అని గట్టిగా లాగాను. ఒక వెంట్రుక—తెగి రెండు ముక్కలూ రెండు చేతుల్లోకి వచ్చాయి....అప్రయత్నంగా ఆ వెంట్రుక పొడుగుని పరిశీలించుకొన్నాను. అది పొడుగాటిది....నాది అంత పొడుగైన జెడ కాదు.

అది ఎవరి తల్లోది అయిందీ ఊహించడానికి నా కొద్దే నేపు పట్టలేదు.

నాకు నిస్సత్తువ వచ్చింది. అలాగే చతికిల బడి పోయాను. ఏడుపు వచ్చేస్తోంది.

నాలుగు రోజులైంది.

మర్నాటికి పేరంటానికి నలుగుర్ని పిలవడానికి వెళ్ళి ఆరు గంటలు దాటాక ఇంటికొచ్చాను. తలుపుకొట్టాను, ఎంతసేపటికీ తియ్యలేదు. మా ఆయన....... దబదబా కొట్టడం, కాసేపు నుంచోడం — ఇలా పది నిమిషాలకి పైగా అయ్యాక అప్పుడు తలుపు తెరిచారు.

“ఎంతసేపయింది వొచ్చి—?- పెరట్లో వున్నాను” అన్నా రాయన.

“ఎంతసేపేమిటీ?- అరగంటైనట్టుంది! ఇంతసేపుటండీ, ఎంత పెరట్లోకి వెళ్ళినా!- బ్రహ్మదేముడి పెద్దన్నయ్యలాగ!” అన్నాను విసుక్కుంటూ.

కుంకం భరిణా, పట్టు రుమాలూ పెట్లో పెడదామని పడకగదిలోకి వెళ్ళాను. ఈ వేళప్పుడు అగరొత్తుల వాసన వేస్తోందేమా అని ఆశ్చర్యపడ్డాను.

ఆయన “పిలవటాలన్నీ అయినట్టేనా?” అని ఏదో పరామర్శిస్తూ లోపలికి రాబోయారు. “అవతలుండండి.” అని తలుపు గడియవేశాను. సాదా చీర వొకటి తీసి కట్టుకున్నాను. కిందపడ్డ పట్టుచీర తీసి మడత పెట్టుకుంటూ వుండగా మంచం కింద తలవేపున పడి వున్న రెండు చేమంతి పువ్వులు నా దృష్టి నాకర్షించాయి...అప్రయత్నంగా నా మనస్సు ఆలోచనలో తేలిపోసాగింది....చేమంతులు నేనూ పెట్టుకున్నాను గాని-నా తల్లోవి రాలడానికి వీల్లేదే! ... దండ గుచ్చుకునే లోగా పడ్డాయా?...ఏమో! అవి ఎవరి తల్లోవి?-

నా కాలోచించడానికి భయం వేసింది.... ఈయన తలుపు తియ్యడానికి అంత ఆలఁస్యమెందుకైంది? ఈ చేమంతులకీ, ఈ అగరొత్తులకీ, ఆ ఆలస్యానికీ కారణం ఒకటేనా?.... గబగబా తలుపు తీసి అవతలకి వెళ్ళి ఇటూ అటూ చూశాను. రోడ్డు మీద అనుమానించ తగ్గ వ్యక్తి కనిపించ లేదు .... భ్రమా? ... అర్థం లేని అనుమానఁవా? .... సందు తిరిగి వెళ్ళిపోయిందేమో!?

దడ దడా కొట్టుకుంటోంది గుండె. కోపం, అసహ్యం, అసూయ, నన్ను వెర్రెత్తిం చేస్తున్నాయి. ఆయన్ని....అడగడానికి అనేక ప్రశ్నలు మస్తిష్కంలో తయారై నాట్యమాడుతున్నాయి. ఆయన నాకేసి వెర్రిగా చూస్తున్నా రప్పుడే.

“ఏమిటి లక్ష్మీ-?”

మద్య తరగతి ప్రజలు

మధ్యప్రదేశ్ రాజధానిలో నలుగురు స్నేహితులు కూర్చుని మద్యం సేవిస్తున్నారు. ఒకడు సోడా సీసా మూత తెరవాలని చాలసేపుగా ప్రయత్నిస్తున్నాడు.
“బ్రాదర్! హా షిగరెట్టుతో మూతపెరుద్దామనే నీ వుద్దేశం?” అన్నా డింకొకడు.
“చచ్చాం. ఇందాక నేను కాల్చింది షోడా వోపెనర్ గావును.”

"టయిమ్ ఎంతైందండీ"' అన్నాను గబుక్కున.

"ఆరు!"

"ఈ మనిషి ఇంకా వొచ్చినట్టు లేదు!- షోకులు యిదీనూ" అన్నాను. దొంగ చాటుగా అయన వేపు చూస్తూ.

ఆయన నిర్లక్ష్యంగా "పని మనిషా?- రానూ వచ్చింది, వెళ్ళనూ వెళ్ళింది!' అన్నారు.

"ఎంత నేపైంది?"

"అబ్బో. చాలనేపైందే!' అని క్షణం ఆలోచించి "నువ్వు వెళ్ళిన పది నిమిషాలకి ఒచ్చింది. ఒచ్చిన పది నిమిషాలకి వెళ్ళింది' అన్నా రాయన.

అబద్ధా లాడుతున్నారు. రంకు నేర్చింది బొంక నేరుస్తుందట- సామ్యం నిజం చేస్తున్నారు.... తెలుస్తూనే ఉంది....

కాళ్లూ చేతులూ కడుక్కొని వంటింట్లోకి వెళ్లాను. అగ్గిపెట్టె కోసం చూశాను. లేదు. అగరొత్తులు వెలిగించారుగా! గదిలో ఉందేమో చూదామని వెళ్ళేను.

నా వెనకాలే పెరట్లోకి వచ్చా రాయన. మళ్ళీ నా వెనకాలే గదిలోకీ వచ్చారు. నా చర్యలూ భావాలూ గమనించి నేనాయన్ని అనుమానిస్తూన్నానో లేదో తెలుసుకోవాలని కాబోలు!

డ్రసింగ్ టేబిల్ మీద వుంది అగ్గిపెట్టె. కాటుక మరకలు సరిదిద్దుకునే నెపంతో అక్కడే కాసేపు కూచున్నాను. అయన గది ద్వారం దగ్గిర నుంచున్నారు.... ఏదో జరుగుతుందనీ జరగాలనీ ఉందినాకు. ఎవరు ప్రారంభిస్తారో! నేను సిగ్గు విడిచి ఎలా ప్రారంభించేది?

అద్దంలో చూసుకున్నాను.

పురుడు పోసుకొని రావడం. ఎండలూ నన్ను పాడు చేశాయి....బుగ్గలు తీసేశాయి. పై పెదవి పైకి లేచిపోయినట్టై. పళ్లు కనిపిస్తామని బెదరిస్తున్నాయి .... జ్యోతుల్లా వెలిగే కళ్లు తెలుపు పడి తాటి కన్నుల్లా వున్నాయి.

మరీ యివాళ- రెండు గంటలనేపు తిరిగి తిరిగి రావడమూ, రాగానే ఆ పని మనిషితో అయన జరిపిన ఆ అమానుష అన్యాయ చర్య తెలియడమూ. ఈ నాలుగు రోజుల్నించీ నేను పడుతున్న బాధని బైటికి తెచ్చి బల్లేలతో పొడుస్తున్నట్టుంది.

ఆరునెలలు నేను లేకపోయే సరికి ఎంత పని చేశా రీయన!...ఎంత సిగ్గు మాలిన పని!....ఎవరితో చెప్పుకోను? .... ఏమని చెప్పను!

ఆ పనిమనిషి! "రంగు"ట దాని పేరు రంగు .... మెరిసేదంతా మేలిమి గాదని. రంగొచ్చిందంతా బంగారంకాదని-ఎప్పటికి తెలుస్తుందో ఈ మొగాళ్ళకి!

ఆ మనిషి నా కంటే బాగుందా?.... ఏమో! బాగుండడ మంటే ఏమిటి?.... బాగుండడం అనే మాటకి ఎవ రర్థం వారిది! తా వలచింది రంభ - అన్నారు అందుకే కాబోలు!....నా సంసారంలో చిచ్చు పెట్టడానికి ఆ రంగులేని రంభ ఎక్కడ దాపరించిందో!.... ఈయన బుద్ధే మైంది?.... నేనంటే ప్రాణాలు వదిలేస్తా నన్నట్టుగా ఉండే ఈయన-దానివల్లో ఎలా పడ్డారో!.... మళ్ళీ నన్ను మునపట్లా చూసుకుంటారా. ఈయన?....నే నాయన్ని ఆకర్షించ గలనా? నా కేమిటి దారి?

పని మనిషిని మార్చేస్తే? .... ఎవరైనా ముసలి దాన్ని వెతికి తెచ్చి పెట్టుకుంటే బాగుణ్ణు.... ఈ పని మనిషి గుండెల మీద కుంపటిలా నా సంసారంలో ప్రవేశించింది. మొగుడూ మొద్దులూ లేనటుంది దీనికి! ఆ చెప్పులూ. సిల్కు చీర్లూ, బంగారపు గాజులూ, దాని షోకులూనూ! పని మనిషి లక్షణాలు వెతకినా లేవు దానికి. జమీందారు లక్షణాలు తప్ప. డబ్బెలా వస్తోందో దానికి వీటన్నిటికీను?

డబ్బు కూడా యిస్తున్నారేమో ఈయన దానికి ! .... సేవింగ్సు బ్యాంకి ఎకౌంట్ చూడాలి...ఎంత సిగ్గులేని పని!....పరువుగా పెద్ద ఉద్యోగం చేసుకుంటూకూడా ఇలాంటి నీచమైన పని చెయ్యడానికి ఈయనకి మనసెలా ఒప్పిందో!

నేను వచ్చి నాలుగైదు రోజు లైంది కద !...పోనీ నేను లేనప్పు డేదో మనస్సు సరిలేక ఏదో పొరపాటు చేసేరేమో అనుకుంటే—నే నుండగానే.... నే నలా పేరంటానికి వెళ్ళీ వెళ్ళగానే—ఇక్కడ ఈ భాగోతం—! ఎంత అసహ్యకరమైన పని. —ఎంతకైనా తెగించా రన్నమాట!... ఛీ. ఈయన మొహం ఎలా చూడను !

మొహం తువ్వాలుతో తుడుచుకొని అద్దంలోకి చూస్తే అందులో నావేపు చూసి నవ్వుతున్నారాయన. అది తప్పించుకుందామని దృష్టి ఇటు మళ్ళించేను. ఇక్కడా ఆయనే; ఆ నవ్వే...చూసుకున్నావా, నీ అందం? చూశావా. నీ కన్నా అది ఎంత అందమైందోను !—ఇప్పు డేమంటావు? అణిగిందా నీ పొగరు ? — అన్నట్టుంది. ఆ నవ్వు....సిగ్గులేని మొహానికి నవ్వే శృంగార మట !—ఆ నవ్వుకి బదులు నేను నవ్వుతానా ?—చురుగ్గా మొహం యింకో వేపుకి తిప్పేసుకున్నాను—నా మొహంలో అసహ్యం ఆయనకి కనబడే వుండాలి.

"చాలా బావున్నావు లక్ష్మీ. నువ్వివాళ !" అన్నారాయన.

నేను మాట్లాడలేదు. నన్నుపొంగ వెయ్యడానికే అలా అన్నారు. అంతమాత్రంలో జరుగుతున్న దంతా మరిచిపోతానని గాబోలు, ఆయన ఉద్దేశం !

"ఎలాగో అయిపోతావని భయపడిపోయాను సుమా !" అంటూ దగ్గరి కొచ్చేరు. \

"నే నెలా అయిపోతే మీ కేఁవీఁ ?" అని విసిరికొట్టాను మాట.

మళ్ళీ నవ్వారాయన. "కోపం వొస్తే యింకా బావుంటావు సుమీ !"

ఎంతమంది పురుషులు ఎంతమంది స్త్రీలతో అన్నారో. ఈ మాట !—ఈ అర్థం లేని మాట—కోపం వొస్తే ఇంకా బావుండడం ! — అస లీయనే ఎంతమందితో అన్నారో !—

"నిజం. వొట్టు ! శ్రావణ లక్ష్మిలా ఉన్నావివాళ !" అంటూ నా నడుంచుట్టూ చేతులు

వేశారు...నిండా అరగంట కాలేదు; ఆ చేతుల్తోటే ఆ పనిమనిషిని....రామరామ!.... నాకు ముళ్ళకంచె గుచ్చుతున్నట్టుంది గాని ప్రియ పురుష స్పర్శలా లేదు....ఆ మనిషి మా యిద్దరి మధ్యా ఎంత దూరం సృష్టించక పోతే అంత చేతుల్ని అంత వెంటనే తొలగించ గలిగాను! .... ఆ చేతుల్లో పరవశం పొందే నా హక్కు పోగొట్టేస్తున్న పాపాత్మురాలు, దుర్మార్గురాలు, రంగమ్మ ! — నవ్వుతుంది. మళ్ళీనూ, ఏమీ ఎరగనట్టు.... ! ....ఎరగనట్టేం? దాని నవ్వు నన్ను సవాల్ చేస్తున్నట్టే వుంటుంది !—చూశావా, నా తడాఖా !-అని.

ఆయన చిరునవ్వుతో మళ్ళీ నన్ను పొదివి పట్టుకున్నారు. ఎడం చెయ్యి నా వీపు మీదుంచి కుడిచేత్తో గడ్డం ఎత్తుతున్నారు.... బలీయమైన కోర్కె, విపరీతమైన అసహ్యం "నే" నంటే "నే" నని నాలో విజృంభించి యుద్ధం చేసుకుంటున్నాయి. నేను నీరస పడిపోతున్నాను.... నాతల వాలి పోయింది...

"లేవండి, నేను వొంట చేసుకోవాలి!" అంటూ విడిపించుకున్నాను.

"ఇంకా ఒంట్లో సరీగా ఉండడంలేదా?" అని లాలిస్తూ అడిగి విడిచి పెట్టారాయన.... అంతా నటన! నిర్లక్ష్యం!

"భగవంతుడా! నాకీ కాన్పొకటి సృష్టించి పుట్టింటికి పంపించే ఏర్పాటుచేసి ఇంత అన్యాయం చేశావా?-ఈ వూళ్ళో ఆసుపత్రులేనట్టు అక్కడి కెందుకు వెళ్ళాను, తెలివి తక్కువ పెద్దమ్మనై! ఆసుపత్రులేకపోతే ఆరడుగుల తాడు లేకపోయిందా?" అని నాలో నేనే బొగ్గుల కుంపటి దగ్గిర కూచుని కుమిలిపోయాను.

రోజులు గడుస్తున్న కొద్దీ ఆయనకీ నాకూ మధ్య పెరుగుతున్న దూరం భయంకరమై పోతోంది....నా వంట్లో ఇంకా సరీగా లేదని తేల్చేశారుగా, ఆయన! ఇదంతా ఎందుకో తెలుస్తూనే ఉంది!

రాత్రి భోజనం కాగానే "కిళ్ళీ వేసుకొస్తానే" అంటూ ఆ పంచెతోటే ఎటో వెళ్తారు ఆయన. తొందరగానే వస్తారు గాని....ఏమో! దానిల్లు దగ్గిరే నేమో!... ఎంతసేపు కావాలి!....ఆపైన వూహించడానికే భయమూ, సిగ్గూ, అసహ్యమూ వేస్తాయి.

రాత్రిళ్ళు చాలా సేపటివరకూ నిద్రరావడం లేదు. పాపాయి పక్కన పడుకోవడం కొత్త అలవాటు....పాపాయిమీద కాలో చెయ్యో వేసేస్తానేమో....అదెక్కడ నలిగిపోతుందో అని దిగులూ; పైగా మంచం మరీ చిన్నదిగా వుండడం....పెద్ద మంచం మీద చాలా ఖాళీ వుంటుంది గాని-సమయానికి అభిజాత్యమో, అసహ్యమో ప్రాణాంతకంగా ఆవేశిస్తాయి...యాదాలాభంగా ఆయన స్పర్శ తగిల్తేనే ఉలిక్కి పడుతున్నాను-పవిత్రమైన ఆ స్పర్శ ఇప్పుడేదీ?

ఎలాగో కళ్ళు మూసుకుంటే ఏ కల్లోనో కనిపిస్తుంది, ఆ "రంగు!" దాని వికటాట్టహాసంతో, హేళనా పూర్వక సంభాషణతో నా మనస్సు ప్రతిధ్వనించి బీభత్సమయి పోతుంది.

వారం రోజులైంది.

ఆయ నెక్కడికో క్యాంపు వెళ్ళారు. అయిదు రోజుల వరకూ రారు.

ఏమీ తోచక కొత్తపేట వెళ్దామని బయల్దేరాను. ఎక్కడో ఊరికి అవతల వేపు చివర్ని ఉంది ఈ కొత్తపేట; మామూలుగా వెళ్ళడం వేం పడదు. మా మేనమామ కూతురు గారిల్లు వెతుక్కుంటూ రిక్షాలో వెళ్ళాను. నాలుగు నెల్ల క్రితమే వాళ్ళవూరు ట్రాన్స్ఫరై వొచ్చేరు. ఒక పెద్దయిల్లు చూపించి ఇదే నండీ వారిల్లు అని చెప్పి వొక అబ్బాయి.

ఆ పెద్ద యింట్లో వాళ్ళొక్కరే వుంటున్నారట ప్రస్తుతం. ఎవరో వొక ఆఫీసరు గారూ, వీళ్ళూ కలిసి మొత్తంగా ఇల్లంతా డెబ్భై రూపాయలకి తీసుకున్నారుట. అంతా మూడురోజులై వాళ్ళు ట్రాన్స్ఫరై వెళ్ళారట..."ఈ నెలాఖరువరకూ అద్దె యిచ్చే వెళ్ళారు వాళ్ళు. మేం ఈలోగా ఇంకో ఇంటికి మారాలి. మీ వేపు ఏవైనా ఇళ్ళు ఉంటే చూడు..." అంది మా ఒదిన.

"మీ రెంత యిస్తున్నారు?"

"ముప్ఫయ్యయిదు."

నా సమస్య పరిష్కార మయ్యే మార్గం కనబడ్డట్టు ఆనందం కలిగింది...

ఒకటి రెండు సార్లు ఆయనతో అన్నాను...."పనిమనిషిని మార్చేద్దాం అండీ" అని-ఆయన వొప్పుకోలేదు.

"నిష్కారణంగా ఎందుకు మాన్పించాలి?...పని శుభ్రంగానే చేస్తోందంటావు. ఆలస్యంగా రావడంలేదు. దొంగతనం యెరగదంటావు. చురుకైందే అని వొప్పుకున్నావు. పోనీ నాగాలు పెట్టడంలేదు... ఎందుకు మార్చాలి? .... ఇంతా చేస్తే పాపాయి కూడా అలవాటైపోయి అదొస్తే ఊరుకోదం. అది తీసుకెళ్తే ఏడవకపోడం తెలిశాయి. ఉట్టి పుణ్యానికి దాని నోటిదగ్గిర అన్నం ఎందుకు పడగొట్టాలి?' అన్నారాయన.

అన్నీ నిజమే.

పైకి చెప్పదగ్గ కారణం లేదు.

కాని నేను వాళ్ళిద్దరి మధ్యా వున్న కళుషిత బాంధవ్యాన్ని క్షమించలేను. మార్చలేను. రుజువు చెయ్యలేను! .... వాళ్ల ఏమాత్రం అజాగ్రత్తగా ప్రవర్తించడం లేదు....కాని నేను కలగజేసుకొని యేదో వొకటి చెయ్యకపోతే దీనికి అంతూ పొంతూ ఉండదు.

అయితే ఆయన సంగతి నాకు బాగా తెలుసును. చెయ్యదల్చుకున్నది ధైర్యంగా చెయ్యడమూ, చెప్పదల్చుకున్నది నిర్మొహమాటంగా చెప్పడమూ ఆయనకి బాగా చేతనవును. "నా యిష్టమ్." అన్న సమాధానం ఆయన నాలుక చివర్ని రెడీగా వుంటుంది. అంతేగాదు. ఎవరైనా అలా నిర్మొహమాటంగా, నిర్భయంగా ప్రవర్తిస్తే చాలా మెచ్చుకుంటారు కూడానూ.

నే నాయనతో కజ్జా పెట్టుకొని ఎన్నడూ ఏదీ సాధించలేను....దేనిమాటఎలావున్నా ఈ విషయం అసలే వీల్లేదు; "నిజమే! నీకు గనక గ్రహించడానికైనా యిన్నాళ్లు పట్టింది .... నాయిష్టం! ఏం చేస్తావు?

నువ్వెక్కడ. అదెక్కడ? దాని అందంలో గాని, బలంలోగాని పదోవంతయినానీకున్నాయా?" అని ఆయన అనేస్తే?

వెర్రెత్తిపోయీ, కోపంచేసుకునీ, అలిగీ, ముభావంగా వుండీ నేను చేయగలిగిం దేమీ లేదు .... ఒక సీన్ క్రియేట్ అవుతుంది, అంతే...ఎవరితో చెప్పినా మరింత ప్రచారం, దాని మూలంగా అవమానం తప్ప వేరే ప్రయోజనం లేదు—పనిమనిషి, నాకన్నా అందంగా వుందన్న కారణంచేత అల్లరి జరగడం - పూహించడానికే భయంగావుంది. ....ఆలస్యం చెయ్యడానికీ వీల్లేదు...ఆలస్యం అవుతున్నకొద్దీ ఆయన నాకెంత దూరమయ్యేదీ, దానివలన నే నెంత నష్టం పొందేదీ కనిపిస్తూనే ఉంది.

"ముప్ఫయ్యయిదు మీ రిస్తే మిగిలిన ముప్ఫయ్యయిదూ మేమిచ్చి యీ వాటాలో ఉంటామే. అంచక్కా ఇద్దరం కలిసుందాం.... మీ రిల్లు మార్చకండే." అని చెప్పేను.

ఆ సాయంత్రం దగ్గిరుండి యిల్లు వాళ్ళ పనిమనిషిచేత కడిగించేసి, మర్నాడు ఆఫీసుకి కబురుచేసి జవాను సాయంతో యిల్లు మార్చేశాను.

మా ఒదిన ఆశ్చర్యపడింది: "అదేమిటే. మీ ఆయన్ని అడక్కుండానే?"

"మా ఆయన సంగతి నీకు తెలీదు." అన్నాను.

ఈ యింటికి రంగమ్మ యిల్లు చాలా దూరం. ఎనిమిది రూపాయలకోసం ఆశించి అది పనికి యింతదూరం రాదు. 'కిళ్ళీ వేసుకొస్తానే' అని ఆయన వెళ్ళిరాగల దూరం కాదది......పైగా, మా యిల్లూ దా నిల్లూ ఒకే పేటలో వున్నట్లయితే ఆయన దా నింటిదగ్గిర తిరిగితే తప్పుపట్టరు కాని, యింతదూరం నుంచి కూడా ఆయన అక్కడికి వెళితే జనం మొహంమీదే అడుగుతారు......మొహం తప్పిపోతే మోహం తప్పుకుంటుంది. వ్యామోహం తగ్గిపోతే తరవాత ఆయనకే తెలుస్తుంది: నిజమైన విలువ ఏమిటో, ఎవరి దోసు—

ఆయన్ని నే నేమీ అనకుండా, ఘర్షణ పడక్కర్లేకుండా నిశ్శబ్దంగా గడుసుగా సమస్య పరిష్కరించుకున్నందుకు నన్ను నే నెంతో మెచ్చుకున్నాను.

"ఏమిటి లక్ష్మీ ఇలా చేశావు, సడెన్‌గా!" అన్నా రాయన ఇంట్లోకి వస్తూనే. నేను నవ్వాను.

ఆయనా నవ్వారు. "నీ కా యిల్లు నచ్చ లేదా?—నాతో మాట వరసకైనా చెప్పేవు కాదేం?"

"ఈ ఇల్లు చూసిచెప్పండి మీరు. బావుందా. లేదా?—మూడు గదులూ వంటిల్లూ, యింట్లోనే పంపూ. అద్దె అక్కడా యిక్కడా ఒకటే... పైగా మీ ఆఫీసుకి దగ్గిర; వేసంకాలం ఒస్తే డాబాకూడా ఉంది. బావులేదూ?'

"బాగానే ఉంది—" అని, మళ్ళీ నవ్వారాయన. ఆ నవ్వులో ఆశ్చర్యమే వుంది. "నేను క్యాంప్ నుంచి వొచ్చేవరకైనా ఆగలేకపోయావా?—పోనీ నీ మాట ఎప్పుడైనా కాదన్నాను గనకనా?"

"కాదంటారని కాదుగాని...అసలు కాదనరనేగా! ఊరికే మా ఒదిన్ని చూదామనొస్తే పోర్షన్ ఖాళీగా వుంది......పోనీ ఒకళ్ళకొకళ్ళు సాయంగా ఉంటాంకదా అని——ఇంతకీ మీకు నచ్చిందంటారా లేదా?"



"నచ్చిందిలే...... ఇక్కడ దోమలు కూడా అట్టే లేనట్టున్నాయ్" అంటూ దూలాల వేపూ, కిటికీలవేపూ పరీక్షగా చూస్తున్నారు ఆయన. ఆయనతో ఏదోచెప్పాలనిమహో ఉంది నాకు...ఆయన మొహంలో మార్పేమీ లేక పోవడం నాకు ఆశ్చర్యంగా వుంది...పని మనిషిని పూర్వంలా కలుసుకునే అవకాశం లేకుండా చేసినందుకు ఆయన మొహంలో నేననుకున్న మార్పు రాదేం? స్వతంత్రించి యింత పని చేసినందుకు నన్నేమీ అడగరేం?...ఏం అడుగుతారా, ఎంత గట్టిగా అడుగుతారా, దానికెలా సమాధానం చెప్పాలా, అని నాలుగు రోజుల్నించీ నా ఆలోచన.

ఆ సాయంత్రమంతా ఆయన నన్నేమీ అడక్కపోతే ఆశ్చర్యం వేసింది; రాత్రి భోజనాలుచేసి ప్రక్క దగ్గిర చేరాక నవ్వొచ్చేసింది నాకు.

మంచం మీద ఏట వాలుగా శేషతల్పశాయిలా పడుక్కొని, విలాసంగా తమలపాకు అందుకొంటున్నా రాయన. సున్నం

రాసి ఈనెలు తీసి చిలకలు చుట్టి అందిస్తున్నాను. నేను ఆఖరాకు అందిస్తూ "అసలు ఇల్లెందుకు మార్చానో చెప్పనాండీ?"అన్నాను. సన్నగా నవ్వుతూ.

ఆయన నవ్వారు. "ఎందు కేమిటీ?'

""పార్శ్వపు నొప్పికి భాస్కర లవణం."" అన్నాను. మంచం మీద చోటు చేసుకు కూచుని. పొడుపు కథ పొడిచిన చిలిపి తనంతో.

"అదేమిటది?" అన్నా రాయన; నాచెయ్యి పట్టుకుని, గాజులు వెనక్కీ ముందుకీ సర్దుతూ.

"చెప్పుకోండి చూద్దాం!"

"... ఏమిటి చెప్పుకోవడం! - వెనకెప్పుడో నాకు పార్శ్వపు నొప్పి వొస్తే అజీర్ణం మీద ఒచ్చిందని భాస్కర లవణం యిచ్చేరు ... దానిమాటేనా నువ్వు చెబుతున్నావ్?...దానికీ దీనికీ సంబంధమేమిటీ"

"అదే, చెప్పుకోవాలి మరి!"

"నువ్వే చెబుదూ నాకలా కలపడం చేత గాదు!"

"- చెప్ప మంటారా?...అక్కడ మీరు చిక్కి పోయారండీ. హోటలు మెతుకులూ. పని మనిషి చేతి నీళ్లూ...ఆర్నెల్లలో ఎంత మార్చేసిందండీ మిమ్మల్ని! ఛీ పాడు మనిషి!" అన్నాను. నవ్వుతూ. గోముగా ఆయన మీదికి వొంగుతూ.

మా ఆయన వొక్క నిమిషం మాట్లాడకుండా వూరు కున్నారు. నేనూ ఊరుకున్నాను.

ఆయన లేచారు. కిటికీలోంచి తమల పాకుల విప్పి వుమ్మేసి. లైట్ ఆఫ్ చేసి మంచం మీద కూచున్నారు...

"అర్థంలేని అనుమానంవేం పద్దావుగాని తెలివి తేటలేమీ ఉపయోగించావుకాదు... నే నెలాటి వాణ్నో తెలుసుకో లేక పోయావన్న మాట. అసలలాంటివి నేను ఆలోచించుకోవాలే గాని-ఏదేనా అయితే నన్ను నువ్వు ఆప గలననే అనుకున్నావా!'

అందులో నిజమెంతో. ఆయన మొహంలో భావం యెలాంటి దుందో తెలుసుకోవాలని. చూడాలనీ ఉంది నాకు...


కాని నేను లేచి దీపం వెయ్యలేదు. కనుక్కోవాలని నాకేం పట్టుదలా యేమిటి? నేను చీకట్లోనే నవ్వు కున్నాను. ●

గుర్రుస్వామి

"బ్రదర్! రాత్రి నువ్వు తెగ గుర్రు పెట్టావోయ్!" అన్నాడు రూమ్‌మేటు.
"ఛా. అబద్ధం. నా కసలు ఎవరన్నా గుర్రుపెడుతుంటే నిద్ర పట్టదు తెలుసా!"

అమోఘ వాక్కు

కొడవటిగంటి కుటుంబరావు



బ్రహ్మలోకం-వేదఘోష వినిపిస్తూ ఉంటుంది. సరస్వతీదేవి వీణమీద సరస్వతి రాగం ఆలాపన చేస్తూంటుంది.

నారదుడు : నారాయణ .... నారాయణ ...

సరస్వతి : (వీణ ఆపి) నారదుడు.

నార : తల్లిగారికి నమస్కారం.

సర : శుభమస్తు, నారదా. రా. కూచో. ఏ యే లోకాలు తిరిగి వస్తున్నావు? చాలా రోజులయింది నువు కనిపించి.

నార : నారాయణ. ఈసారి భూలోకంలో పెద్ద మజిలీ వేశానమ్మా.

సర : ఏమిటి విశేషాలు?

నార : ఎందు కడుగుతావు? మనుష్య జాతి పుచ్చి పురుగులుపడి పోతుంది. వాళ్ళ బుద్ధి వాళ్ళనే తినేస్తోంది. వాళ్లు సృష్టించుకున్న సమస్యల్లో వాళ్ళే మునిగి కొట్టుకు పోతున్నారు...నాన్నగారేరీ?

సర : భూలోకంలో నీకు కనిపించలా?

నార : (ఆశ్చర్యంగా) లేదే. ఆయన కక్కడ తొందరపనేం వచ్చిందీ?

సర : ఏవో కొత్త క్రిములు సృష్టించా

లని వెళ్లారు. రోగక్రిములా, విషక్రిములా? ఏదో చెప్పారు,

నార: (చిరాకుతో) నారాయణ. ఈయన ఒకటి చేసి ఒకటి చెయ్యకుండా వు[illegible]డా?

సర: (ఆందోళనగా) అదేం, నారదా? నాయన[illegible]గారి సృష్టిని ఎన్నడూ విమర్శించిన వాడివి కావే? ఈసారి—

నార: ఆ క్రిము లెందుకో తెలుసా? సృష్టి అంతం కావటానికి.

సర: (నవ్వి) వెర్రివాడా, ఆయన తన సృష్టిని తాను ఎన్నడూ చేజేతులా నాశనం చేసుకోరు. ఆయన సృష్టించిన జంతువు లను శివుడు నాశనం చేసినప్పుడల్లా ఈయన వెళ్ళి అంతకంటె మంచి ప్రాణులను సృష్టించారు, తెలుసా?

నార: ఆ క్రిములతో సృష్టి అంతా ఎందుకు నాశనమవుతుందీ? మానవసృష్టి మాత్రమే.

సర: (ఆశ్చర్యంగా) మానవులను మాత్రం ఆయన నాశనం కానిస్తారా?

నార: అసలుకే ఎసరు వస్తే ఏం జేస్తాడు మరీ?

సర: నీమాటలు నా కర్థం కావటం లేదు, నారదా.

నార: నీకు విశ్వరాజకీయాలు తెలియ నట్టుంది, తల్లీ. నాయనగారికీ ఆ పరమ శివుడికీ ఒకవిధమైన ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. దాన్ని భూలోకంలో కోల్డ్ వార్ అంటున్నారు.

సర: (అదుర్దాగా) యుద్ధమే.?

నార: భయపడకు, తల్లీ. భయపడకు. ప్రచ్ఛన్న యుద్ధంలో అసలు వాళ్ళకే ప్రమాదమూ ఉండదు. నలిగి చచ్చేది పైవాళ్ళే. అంచేత ఇటు మన బ్రహ్మలోకానికిగాని, అటు కైలాసానికిగాని ఏమీ ప్రమాదం ఉండదు.

సర: ఈ యుద్ధం ఏమిటో చెప్పావు కావు.

నార: రెండుముక్కల్లో టూకీగాచెప్పేస్తా. అసలు సృష్టికీ లయానికీ మధ్య ఎప్పుడూ రంధి ఉండనే ఉంటుందిగదా. నాయనగారికి లయమంటే పడదు, పరమ శివుడికి సృష్టి అంటే పడదు. ఇద్దరూ కలుసుకున్నప్పుడు ఓహో అంటే ఓహో అనుకుంటారన్న మాటేగాని ఒకరి శక్తిని ఒకరు బేరీజు వేసు కుంటూనే వుంటారు—

సర: పోనిస్తూ. నువ్వెప్పుడూ తంపుల మారి మాటలే చెబుతావు. వాళ్ళిద్దరికీ చాలా స్నేహం.

నార: అదే రాజకీయ పరిజ్ఞానం లేక పోవటమంటే. అసలు విషయం మనవి చేస్తా. ఇటీవల నాయనగారిది బాగా పై చెయ్యి అయిపోయింది. జంతుబలులు మానేశారు. ఇరుగు పొరుగు వాళ్ళతో అస్తమానమూ యుద్ధాలు చేస్తూండాలన్న రాజధర్మం కాస్తా అడుగంటి చక్కాపోయింది. మహమ్మారి మొదలుకొని సమస్త పీడలకూ మందులు కనిపెట్టారు. ఆ మధ్య నాయనగారు భూలో కానికి వెళ్ళి అనేకరకాల బూజు పదార్థాలు సృష్టించి వచ్చెనే, వాటన్నిటినీ యాంటీ బయో టిక్స్ అనే పేరుతో మందులు తయారుచేసి అడ్డమైన రోగాలను నయం చేస్తున్నారు మానవులు. వాళ్ళ ఆయుర్దాయం పెరిగి పోతోంది. జనాభా విపరీతంగా పెరిగి భూ భారం హెచ్చిపోతోంది. ఇంకేం? భూదేవి వెళ్ళి యమధర్మరాజుతో మొరబెట్టుకొన్నది. యమధర్మరాజు వెళ్ళి పరమశివుడితో చెప్పుకున్నాడు. ఓహో, బ్రహ్మ నన్ను సవాలు చేస్తున్నాడా? అనుకున్నాడు శివుడు.

సర: నేను నమ్మను.

నారా: నారాయణ. నే నెందుకు చెప్పటం? కంఠశోష.

సర: (గంభీరంగా) నేను నమ్మనన్నాను గాని, నిన్ను చెప్పొద్దనలేదు. చెప్పు.

నార: అప్పుడు పరమశివుడేం చేశాడూ చిచ్చర కన్ను తెరిచాడు. మారణాయుధాలు ఒకదాన్ని మించి ఒకటి తయారయాయి. ప్రపంచయుద్ధం వచ్చింది. జనం చచ్చారు. లక్షలకొద్దీ చచ్చారు. అది మొదటి ప్రపంచ యుద్ధం మాట. ఆ తరవాతే నాయనగారికి కోపంవచ్చి బూజు పదార్థాలు తయారుచేస్తా. మళ్లా జనాభా పెరిగింది. ఆయుర్దాయం పెరిగింది. పరమశివుడు మళ్ళీ మూడో కన్ను తెరిచాడు. మళ్ళీ మారణహోమం సాగింది. లక్షోప లక్షలు చచ్చారు. శివుడు తృప్తిచెందాడా? మళ్ళీ మళ్ళీ తనకు పని కలగకుండా మానవులకి పాశుపతాస్త్రం ఇచ్చే శాడు.

సర: పాశుపతాస్త్రమే?

నార: అహా, పాశుపతాస్త్రమే. దాన్ని వాళ్ళు అణుపు బాంబంటున్నారు. అది ప్రయో గించినచోట ప్రాణాలన్నీ తుడిచిపెట్టుకు పోతాయి. గడ్డి కూడా మిగలదు. అది సృష్టికే ఎసరు. నేను యీ మధ్య కైలాసం వెళ్ళినప్పుడు ప్రమధులు గుసగుస లాడుతూ నవ్వుకుంటున్నారు. ఏమిటి విశేషమంటే ఎవరూ చెప్పారుకాదు. ఒకడు తాగి కైపులో వున్నట్టున్నాడు... ఈ దెబ్బతో మీ బ్రహ్మ ఆటకట్టూ...అన్నాడు.

సర: వెధవా. అంత పొగరా?


నార: తల్లీ, నేను చెప్పానేగాని. నువ్వు నమ్మనవసరం లేదు.

సర: (ఆవేశంగా) ఆ తరువాత ఏం జరి గింది. నారదా? నువు విని ఊరుకున్నావా?

నార: నేనా ఊరుకునేది? నాయనగారితో అంతా చెప్పేశాను.

సర: ఆయన ఏమన్నారూ?

నార: నీలాగే మొదట్లో నామాటలు నమ్మలేదు, ఆ తరువాత అంతా నమ్మారు, పాశుపతాస్త్రానికి విరుగుడుగా ప్రజలలో ఒక ఉద్యమం బయలు దేరదీశారు. ఈ ఉద్యమం నిజంగా సఫలమయిందో పాశుపతాస్త్రాలన్నీ



హోటల్ గుమ్మంలో జారి పడబోయిన పెద్దమనిషి:— "ఏమిటయ్యా ఇక్కడ నీళ్లా?"

యజమాని: "మావాడు కాఫీ ఒలకబోసినట్టున్నాడు. రేయ్, ఇక్కడ క్లీన్ చెయ్!"

సముద్రంలో పారేస్తారు. పరమ శివుడి ఆట కట్టే.

సర: అంతేకావాలి. నా కళ్ళు చల్లగా ఉంటాయి.

నార: పరమశివుడి పక్షంవాళ్లు అంత అమాయకులా, తల్లీ? దేవలోకంలో యముడి ముఠావాళ్ళు యుక్తిగా నాయన గార్ని బుట్టలో వేసేసుకున్నారు.

సర: ఏమిటని? ఏమిటది?

నార: అయన్ని రాజకీయంగా గోతిలోకి దించేశారు. వాళ్ళ తెలివిమండా, ఆ గొయ్యి ఆయన చేతనే తవ్వించారు.

సర: (ఆందోళనతో) ఏమిటీ? నారదా, నువ్వనేదీ?

నార: వాళ్లు ఒకనాడు నాయనగారి వద్దకు వచ్చి, ఏమన్నారంటే...

(ఫ్లాష్ బాక్)

1: నమస్కారం పితామహా.

2: తాతగారూ. వందనాలు.

బ్రహ్మ: రండి. కూచోండి. దేవేంద్రుడు కుశలమా? దిక్పాలకులు సుఖంగా ఉన్నారా? మీరేం పనిమీద వచ్చినట్టు?

1: ఆ పరమేశ్వరుడి ప్రళయ యత్నాలు విఫలం చెయ్యడానికి మీరు సాగింపజేసిన ఉద్యమం మహత్తరమైనది. తమరికి అభివాదాలు చెప్పుకోవటానికి వచ్చాం.

బ్ర: పరమ శివుడిపై నాతో చాడీలు చెప్పకండి. నేను సహించను. అతను తన ధర్మాన్ని ఎన్నడూ మీరి నడవడు. మధ్యని ఈ మానవులే—

2: మానవుల దుర్బుద్ధి మీకు తెలియదా తాతగారూ? మీరు చక్రం అడ్డెయ్యకపోతే యీపాటికి భూలోకంలో నరపురుగు మిగిలి ఉండునా.?

బ్ర: (సంతోషంగా)ఏదోమరి. నాసృష్టిని నేను కాపాడుకోవాలిగద.?

1: మా భయమల్లా ఒక్కటే. పాశుపతాస్త్ర వ్యతిరేకోద్యమం సాగునా అన్నదే మా బెంగ.

2: ఎంచేతంటే. ఈ మానవులవి వొట్టి పుచ్చు బుద్ధులు.

బ్ర: అప్పటికీ మానవులు నాశనం అయిపోగోరితే నేను మాత్రం ఏం చెయ్యగలనూ? నాశనమైపోనీ.

1: బాగా శలవిచ్చారు. అసలు ఈ మానవులు వక్రసృష్టి అనే ఇటీవల దేవలోకంలో అందరూ అనుకుంటున్నారు. కాని పాశుపతాస్త్రంతో ఒక్క మానవులే పోతే అంత బెంగ పడనవసరం లేదు. తమరు కష్టపడి కృతయుగం నుంచీ చేసిన సృష్టి యావత్తూ నిర్మూలమై పోతుందే. ఏది దారీ అని మేం మహాదిగులు పడిపోతున్నాం.

2: ఆఁ దానిదేముంది? పాశుపతాస్త్రం కంటె నిపుణమైన అస్త్రాన్ని సృష్టిస్తేపోలా?

బ్ర: మరింత మారణం సాగటానికా?

1: ఛీ. ఛీ. అలాటిది తలవటానికైనా వీలుందా? ఇది సజీవాస్త్రం. దీన్ని సృష్టికర్త అయిన తమరే సృష్టించాలి. ఇది ప్రధానంగా మానవులనూ, వారినాశ్రయించిన పశు పక్షి వృక్ష జాలాన్నీ నాశనం చేస్తుంది. తమరు మారణ క్రిములను సృష్టించండి. కొత్త వాటిని సృష్టించండి. పాత క్రిములకు విరుగుళ్ళున్నాయి. వీటితో మానవులంతా నాశనమయారనే అనుకున్నా, పాశుపతాస్త్రం మూలపడిపోతుంది.

2: తాతగారూ, మరో విషయం చూశారో లేదో, ఈ అస్త్ర ప్రయోగానికి సాధనలు అవసరం లేదు. చప్పుడు కాదు, అంతా నిశ్శబ్దంగా జరిగిపోతుంది.

బ్ర: అదంతా సరేగాని, మానవుడు పోతాడే?

1: ఏమండీ పోతేనూ? వెధవ మానవుడు. వీడు మీరు సృష్టించిన జంతువులన్నిటిలోకీ అధమాధముడు. వాడు నిర్మించిన నగరాలు చూడండి, అటు అరణ్యాలు చూడండి. ఇటు దుర్గంధం అటు నైర్మల్యం. ఇటు అశాంతి, అటు శాంతి. ఇటు అకారణ హింస అటు పరిమితమైన, అనివార్యమైన హింస. ఇటు ప్రకృతి నియమాల ఉల్లంఘన, అటు ప్రకృతి పరిపాలన,

2: బోడి మానవులు. భూలోకంలో ఇవాళ కూడా కీటకాలకుగల దక్షతలో వెయ్యోవంతు మనిషికిలేదు, మనుషులసంఖ్య కంటే వాటి సంఖ్య కొన్ని లక్షల రెట్లు.

బ్ర: ఆహా, నా కీటకాలు. అవంటే నాకెంత ఇష్టమో చెప్పలేను.

1: మరీ మంచిది. మనం ఈ మృత్యుక్రిములను కీటకాల ద్వారానే ప్రచారం చేస్తాం.

2: ఇంకెందు కాలస్యం? గొప్ప మేధావులలో అనుకూలంగా ఉండేవారిని మీరే ఎన్నుకొని క్రిమి సృష్టి సాగించండి. భూలోకంలో డబ్బు కోసం ఏం చెయ్యమన్నా చేసే మేధావులు కొందరున్నారు.

బ్ర: లేకపోతే సృష్టికి పాశుపతాస్త్ర ప్రమాదం ఉందంటారా?

1: ఇంకా సందేహమా?

2: మెల్లిగా అడుగుతున్నారా?

బ్ర: సరే, మీరు వెళ్ళండి. నే నీ విషయం కాస్త ఆలోచించుకోవాలి.

ఇద్దరు: నమస్కారం.... శలవు.

బ్ర: పోనీగదా అని చూస్తున్నకొద్దీ ఈ శివుడు మహా రెచ్చిపోతున్నాడు. ఇతగాడి ఆట కట్టించాలిసిందే.

• • •

సర: చూశావా, నారదా? ఇంత జరిగినా ఆయన నాతో మాటమాత్రం చెప్పారు కారు.

నార: ఆయన రాజకీయా లాయనవీ.

సర: (అనుమానంగా) అంటే?

నార: నారాయణ... ఉన్నదుండగా ఉపాకర్మ అన్నట్టు, ఆయనకు ఉన్న చిక్కులు గాక, కొత్తవి కూడా ఎక్కడ తెచ్చిపెట్టను?

సర: చిక్కులా?

నార: ఆయన గుట్టు నీకు చెప్పేస్తాను.

ఆ లోకం

కొత్తగా వచ్చినవాణ్ణి కళ్లజోడులోంచి పరీక్షగా చూస్తూ చిత్రగుప్తుడు అన్నాడు: "మీ పేరేమిటన్నారు? మళ్లీ చెప్పండి."

ఆగంతుకుడు మళ్లీ పేరు చెప్పాడు.

చిత్రగుప్తుడు చిఠా పుస్తకం తిరగేసి చూసి "కాస్త తొందరపడ్డారు. 1965 దాకా మీకు టైముంది. ఎవరక్కడ మీ డాక్టరు?" అన్నాడు.

నువ్వాయనను నాలుగూ అడగకుండా ఊరు కుంటావా, తల్లీ?

సర: నన్ను గురించిన రహస్యాలే నాదగ్గర దాస్తున్నావా, నారదా? ఇదేనా నీ మాతృ భక్తి?

నార: మాతృ భక్తికోసం మీ కిద్దరికీ కీచులాట తెచ్చిపెట్టనా? నావల్లకాదు. అసలే కలహభోక్త అని నన్నందరూ ఆడిపోసుకుంటున్నారు. దయచేసి నన్నేమీ అడగవద్దు.

సర: (అధికారంగా) చెప్పితీరాలి. నీ మనస్సులో ఉన్నదేదో చెప్పక పోయావో, నిన్ను ఘోరంగా శపిస్తాను.

నార: శాపంకూడా ఎందుకు తల్లీ? నీ అజ్ఞ చాలదా? నేను పుట్ట రేపెట్టానని తరవాత నన్ను నిష్ఠురాలు మాత్రం ఆడవద్దు. కాకపోయినా ఇందులో పెద్దరహస్యం కూడా ఏమీ లేదు. కొంచెం ఆలోచిస్తే నాయనగారు మీకు చేస్తూ వస్తున్న అన్యాయం మీకే తెలుస్తుంది.

సర: (ఆశ్చర్యంతో) నాకు అన్యాయం చేశారా? ఎలాగ?

నార: సృష్టికర్త అని ఆయనని మూడు లోకాలూ తెగ పొగడేస్తాయిగదా, ఏమిటండీ ఆయన చేసిన సృష్టీ? చెదలూ, పొదలూ, చెట్లూ, చీమలూ, దోమలూ, తొండలూ, కప్పలూ, తేళ్లూ—ఇవేగా? రెండు కాళ్ళమీద పరిగెత్తే తోకలేని కోతులకన్న గొప్ప జంతువును ఆయన సృష్టించగలిగాడాంట.

సర: మానవుల మాటో.

నార: మానవులు ఆయన సృష్టి ఎలాగయిందో, మనిషికి నువు వాక్కిచ్చావు. దానితోనే వేదాలూ, శాస్త్రాలూ, పురాణాలూ, సమస్త కళలూ, నాగరికతా, మహానగరాలూ, ధర్మాలూ, నీతులూ, తత్వజ్ఞానమూ భూలోకంలో అవతరించాయి. ఇదంతా తన గొప్పేనంటాడా పిచ్చి బ్రాహ్మడు.

సర: (ఒకపక్క సంతోషపడుతూనే) అన్యాయం మాట లనకు. సృష్టికి నేను చేసిన సహాయం ఆయన ఎన్నడూ కాదనలేదు.

నార: తల్లీ, నీకు తృప్తి కలిగితే యిక నాకు కావలిసిం దేముంది? ఈసంగతి ఇంతటితో వదిలేద్దాం.

సర: కాదు, కాదు ఇంకేదో దాస్తున్నావు.

నార: సర్వజ్ఞురాలివి, నీ దగ్గి రేమిటి, నేనేమిటి, దాచట మేమిటి?

సర: (ఆగ్రహంతో) చెబుతావా, చెప్పవా?

నార: చెప్పేటందు కేముంది, తల్లీ కళ్ళు తెరిచిచూడు. నీకే తెలుస్తుంది. నాయనగారు మానవులికి ఇతర ప్రాణులతో బాటు జంతు ధర్మాలన్నీ ప్రసాదించారు. వాటికి లోబడి మానవుడు శరీరపోషణా, ఆత్మరక్షణా చేసుకుంటున్నాడు. సంతానాన్ని కంటున్నాడు. కాని నువ్విచ్చిన వాక్కు ఏమయింది? దాని ధర్మం ఏమైనా అమలు జరుగుతున్నదా?

సర: (ఆశ్చర్యంగా) అదేమిటి, నారదా? భూలోకంలో బళ్ళకు బళ్ళు సాహిత్యం తయారవుతున్నదనరూ? అవి పత్రికలుకావుట, పుస్తకాలుకావుట, నాటకాలుట, శ్రవ్య నాటకాలుట: సినిమాలుట, ఇంకేవేవోట.

నార: నారాయణ... పిచ్చితల్లీ, అందులో నిజమైన సారస్వతం లేదు. వేదాలు అడుగంటాయి. పురాణాలన్నీ మార్చేశారు. సినిమాలలో పురాణకథ లుంటున్నాయిగదా- చూస్తే నిర్ఘాంతపోతావు. అసలు సంగతి అదికాదు: మనిషి మాటకు విలువలేదు. పస లేదు. మొండి కత్తికైనా అంతో యింతో బలమూ, పదునూ ఉంటుందిగాని, మనిషి మాట చొప్పదంటు, మానవుల జంతుకర్మల కన్నిటికీ ఫలితం ఉంటుందిగాని, వాక్కుకు ఏమీ ఫలితం లేదు.


సర: మానవులలో అమోఘ వచస్కులు లేరూ?

నార: పూర్వం ఉండేవాళ్లు—మహామునులు, అదైనా వాళ్ళు తమ స్వశక్తిచేత సంపాదించుకున్న శక్తి, జన్మతహా వచ్చింది కానేకాదు... అవునుగాని, తల్లీ, నాయనగారు మానవులకు తానిచ్చిన శక్తులన్నీ సార్థకం చేసి, నువ్విచ్చిన వాక్కును ఎందుకు నిరర్థకం చేశారో కాస్త ఆలోచించావా?

సర: (కోపంతో) అదే ఆలోచిస్తున్నాను నారదా. ఆయన్ని రానీ చెబుతాను.

నార: నారాయణ... కొంపమునిగింది. చిన్నవాణ్ణయినా నామాట ఒక్కటీ ఆలకించు తల్లీ. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న తీరుగా అంతా మించిపోయాక ఇప్పుడాయనతో కలహం దేనికి? మానవుడు నశించటానికి అన్ని ఏర్పాట్లూ ఈ సరికి అయే పోయాయి. ఆకాస్త పీడా విరగడయాక ఆయనగారు మళ్ళీ కోతుల్నీ, కొండముచ్చుల్నీ చేసి చెట్లపైన వదిలేస్తాడు. నువ్వయినా మళ్లా ప్రాణులకు వాక్కు ప్రసాదిస్తావు గనకనా? మహా సృష్టిలో ఒక అధ్యాయం ముగియ బోతున్నది. నా విచారమల్లా నీ మహత్తరమైన కృషి యావత్తూ నీరుకారిపో బోతోందే అనే. హుం.

సర: అశుభాలు పలకు, నారదా. నువ్వన్నట్టు మానవులు నశించరు. నశించటానికి వీల్లేదు. నశించనివ్వను. పైపెచ్చు మానవులకు సార్థక వాక్కుకూడా ఇప్పిస్తాను. నన్ను బొత్తిగా అసమర్థురాలి కింద కట్టకు. (దురుసుగా వీణావాయిద్యం)



సర్వారేశ్వరుడు కాఫీ తీసుకొస్తూ ఇంకా రెండుగజాల దూరంలోవుండగానే "ఇంకా వేడిగా కావాలి" అన్నాడు ఆసామీ. సర్వర్ మళ్లీ వెచ్చచేసి తెస్తుంటే "ఇంకా వేడిగా" అన్నాడు. ఇలా నాలుగుసార్లు జరిగాక సర్వర్ కు వళ్లు మండి "ఏమిటయ్యా, కాఫీ తాకకుండానే వేడి లేదంటావు." అన్నాడు.

"నేనుకూడా తాకాలా? నువ్వు వేలెట్టి తెస్తున్నావుగా. దాంట్లో వేలు పెట్టలేనంత వేడిగా కావాలి." అన్నాడు ఆసామీ.

నార : నారాయణ.... నారాయణ.... మళ్ళీ కనిపిస్తాలే తల్లీ.

• • •

(వై కుం ఠ ం)

విష్ణు : వీళ్ళకేదో పెద్ద సమస్యే వచ్చి పడ్డట్టుంది. బ్రహ్మను వెంటబెట్టుకుని దిక్పాలకు లంతా వస్తున్నట్టు కబురు పంపారు.

లక్ష్మి : వాళ్ళ కెప్పుడూ సమస్యలే. మీరు మళ్ళీ ఇంకో అవతారం ఎత్తకండి, మీ పుణ్యం వుంటుంది.

విష్ణు : అందరూ చేరి బలవంతం చేస్తే తప్పుతుందా? అయినా ఈసారి అంత గండక త్తెర వస్తుందనుకోను. ఈ మధ్య నారదుడైనా వచ్చాడు కాడు — లోకాల వార్తలు బొత్తిగా తెలియటంలేదు.

నార : నారాయణ....నారాయణ....

లక్ష్మి : అడుగో, మాటలోనే వచ్చాడు. ఏం, నారదా? యీసారి ఎవరి కొంప కూల్చబోతున్నావు?

నార : నారాయణ .... నారాయణ.... ఆది దంపతులకు నమస్కారం.

విష్ణు : కూచో నారదా. ఏమిటి వార్తలు? ఎక్కణ్ణుంచి రావడం?

నార : తిరిగే కాలాయె. పద్నాలుగులోకాలూ చుట్టి మరీ వస్తున్నా. ఇక్కడికి వస్తే అన్ని లోకాల వార్తలూ అడుగుతారాయె.

విష్ణు : బ్రహ్మ వెంట దిక్పాలకులందరూ వస్తున్నారట. నన్ను చూడటానికి. కారణం ఏమై వుంటుందో చెప్పగలవా?

నార : ఊఁ .... మీ సలహాకోసమై ఉంటుంది.

విష్ణు : మాట నాన్చకు. దేన్నిగురించి నా సలహా కావాలి?

దేవతలు : (దూరంనుంచి జయధ్వానాలు) జై వైకుంఠవాసా ... జై లక్ష్మీపతీ .... జై రమారమణా .... (చివర ఒక గొంతు గోవిందా గోవింద-అంటుంది....

విష్ణు : రండి రండి. అంతా కూచోండి. మీ మాటే అనుకుంటున్నాం.

దేవేం : నువ్విక్కడే వున్నావా, బాబూ?

నార : శుభమస్తు దేవేంద్రా.

దేవేం : తథాస్తు.

నార : నువుగాని అశుభం శంకించటం లేదుగద?

దేవేం : అశుభమని మెల్లిగా అడుగుతున్నావా, నారదా. లోకాలన్నీ తల్లకిందులమే పరిస్థితి ఏర్పడబోతున్నది.

నార : అదేం?

దేవేం : మళ్ళీ నానోట చెప్పించటం దేనికి? అంతా తాతగారే చెబుతారు.

బ్ర : (గొంతు సవరించుకుని) దేవేశా, పెద్ద సమస్య వచ్చి పడింది.

విష్ణు : ఏమి టది?

బ్ర : మానవులకు అమోఘ వచనం ఇవ్వమని సరస్వతి పట్టుబట్టి కూచుంది. వారి వాక్కు నిరుపయోగంగా ఉంటోందట. భూలోకంలో ఉండే ప్రతి మనిషీ నోటంట ఏమంటే అదల్లా జరిగితీరాలట. ఇప్పు డలా జరగకపోవటం తనకు తీరని అవమానంగా వుందట.

దేవేం : తపశ్శక్తి సంపాదించుకునే వాళ్ళతోనే వేగలేక చచ్చాను. మనిషికి యీ వరం వచ్చిందో ప్రతిమనిషీ ఒక అగస్త్యుడూ, చ్యవనుడూ అయి కూచుంటాడు. తలుచుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తున్నది.

విష్ణు : ఆమెకు అకస్మాత్తుగా ఇలాటి ఆలోచన ఎందుకు కలిగిందీ?

లక్ష్మి : ఆమె మొదటినుంచీ అదొక రకం వ్యక్తి.

బ్ర : మీ ఆడవాళ్ళ సూటిపోటీల కిది సమయం కాదు. నన్నడిగితే యిది చాలా క్లిష్టమైన సమస్య. ఆవిడ కీ ఆలోచన ఎవరు చెప్పా రనేది కూడా—

దేవేం : ఎవరో తంపులమారివాడు చెప్పి వుంటాడు.

నార : నారాయణ .... నారాయణ .... నన్నేనా అంతమా టంటున్నారు దేవేంద్రుడుగారు.

దేవేం : పుచ్చకాయల దొంగంటే భుజాలు తడువుకున్నట్టుగా—

నార : నాలుగు లోకాలూ తిరిగి వచ్చే వాణ్ణి నా కాపాటి వ్యంగ్యం అర్థం కాదా, దేవేంద్రా? మా తల్లిగారి ఆలోచన నేను విన్నప్పు డేమని సలహాయిచ్చానో అడగండి. మానవ జాతే తుడిచిపెట్టుకుపోనున్న సమయంలో వాళ్ళ కీ సార్థక వాక్కు కూడా దేనికి తల్లీ అన్నాను. నా మా టెవరూ వినరు. పై పెచ్చు నాకు లేనిపోని ప్రవాదాలు అంటగడతారు.

విష్ణు : మానవజాతి అంతరించిపోవట మేమిటి? ఈమాట ఎలా పుట్టింది?

నార : మీ రింకా వినలేదా. దేవదేవా? భూలోకంలో వుండే సమస్త ప్రాణికోటినీ అయిదుసార్లు నాశనం చెయ్యటానికి తగినన్ని పాశుపతాస్త్రాలు గోదాముల్లో బుసలుకొడుతున్నాయి. ఒకవేళ ఒకరూ అరా మనుషులు మిగిలిపోతారేమోనని నాయనగారు ఇటీవలే మృత్యు క్రిములను సృష్టించి మానవుల కిచ్చారు.

విష్ణు : ఇది నిజమేనా బ్రహ్మా?

బ్ర : వాడిమాటలు నమ్ముతా రేమిటి మీరు కూడాను. ఆ పాశుపతాస్త్రాలను నిర్వీర్యం చెయ్యటానికే యీ క్రిములు సృష్టించాను. మానవులు పోతే పోతారు మరి. సృష్టి మొదలంట నాశనం కాకుండావుంటే, మానవుల జేజెల్లాటి ప్రాణులను సృష్టిస్తాను, ఇలా ఎన్ని జాతులు పోయాయికావు? వాటి స్థానంలో ఇంకా మంచి ప్రాణులను సృష్టించాను కానా?

విష్ణు : జగద్రక్షకుణ్ణి నేనొకణ్ణి వున్నానని ఆలోచించకుండా సృష్టితోనూ, లయంతోనూ యిలా ఆటలాడుకుంటున్నారా?

నార : మీ రామాట అన్నారుగనక తల్లిగారిని సమర్థిస్తూ ఒక్క ముక్క నన్ను చెప్పనిస్తారా?

బ్ర : (కోపంగా) చెప్పు. మేమంతా ఆవిడ శత్రువులమనా నీ వుద్దేశం?

జోగీ జోగీ

ఒక సన్యాసి : మనం పుట్టడమే దురదృష్టం. పుట్టకుండావుంటే ఎంత బావుండేది.

మరో సన్యాసి: బావుందయ్యోయ్. అంత అదృష్టానికి పెట్టి పుట్టద్దూ?

నార : అలా అనుకుంటే నే నసలు నోరే మెదపకపోదును. నే ననేదల్లా ఏమి టంటే, మానవు లంతా పోయాక నాయన గారు మరొక జంతువును సృష్టించినా తల్లి గారు వాక్కు ప్రసాదించకపోతే అది రాణిం చడం కల్ల. ఒప్పుకుంటారా ?

బ్ర : మాటవరసకు ఔనే అనుకుందాం. అయితే నువ్వనే దేమిటీ ?

నార : మనిషికి వాక్కు యిచ్చి కూడా నిష్ప్రయోజనమైపోయిందిగద. మానవ మారణానికి మన మంతా ఇంచుమించు ఆమో దించి నంతదాకా వచ్చాంగద, రేపు సృష్టించ బోయే జంతువుకైనా అమోఘవచనం లేక పోతే ఆ జంతువు గతీ యింతేగద. అలా టప్పుడు తల్లిగారి కోరిక పాటించి ఈ మాన వులు అంతరించకముందే అమోఘవాక్కు యిచ్చి చూడకూడదూ ?

దేవేం : (ఆర్భాటంగా) అలా జరిగితే నేను ఇంద్రత్వం క్షణం కూడా నిర్వహించ లేను. ఈ పదవి మరెవరికన్నా ఇవ్వండి.

యమ : ఇక యమత్వం నా వల్లకాదు. అసలు యముడి పదవి ఎత్తే పారెయ్యొచ్చు. చూస్తూ చూస్తూ ఏ ప్రాణీ చావు కోరదు. చావకుండా మానవులు తమను తాము చిరం జీవీ అని జీవించుకోగల స్థితిలో వుంటే ఇంక నాకు పనేముంటుంది ? మహాను భావులు, కోరి మరణించేవారు బహుకొద్ది మంది వుండేవారు. ఆఖరుకు జపానులో కూడా స్వచ్ఛంద మరణాలు పోతున్నాయి, సకృతుగా ఆకలి చావు లుంటున్నాయి. కాని నూటికి తొంభైతొమ్మిదిపాళ్ళు నేను బలవంతాన ప్రాణాలు తీయటమేగద. ఇం కేం ? మనిషికి అమోఘ వాక్కు ఇచ్చె య్యండి, నా బెడద తీరిపోతుంది. భూభారం ఎక్కువైతే ఆ సంగతి చూడటానికి దేవ దేవు డుండనే వున్నాడు.

విష్ణు : మీరంతా కాస్త తగ్గండి. నార దుడు చెప్పినమాట కొట్టివెయ్యటానికి లేదు. మీ అందరిమాటా తోసేసి మానవులకు అమోఘ వాక్కు ఇచ్చేద్దామని నేను అన లేదు. లోకాలను శాసించే మనం ఏదిచేసినా నియమబద్ధంగా చెయ్యాలి. ముందు ఒక్క మానవుడికి అమోఘవాక్కు ఇచ్చి చూస్తాం. సరస్వతే ఆ మనిషిని ఏరుకుంటుంది. అందువల్ల లోక కల్యాణం జరిగేటట్టు మనకు నమ్మకం కుదిరితే మానవుల కందరికీ అమోఘవాక్కు ఇచ్చేద్దాం. లేదూ, ఇచ్చిన దాన్నే ఉపసంహరించుకుందాం. ఏమం టారు ?

(అంతా తలా ఒక మాటగా... "భేషుగ్గా ఉంది, ఇదే సరయిన ఆలోచన... అలాగే చేద్దాం ... దీని ఫలితం క్షణంలో తేలిపోతుంది"...)

బ్ర : చూస్తూ వుండండి, సరస్వతే తన కోరిక ఉపసంహరించుకుంటుంది.

• • •

(భూ లో క ం)

సర : ఇదుగో చూడండి. నేను ఎన్ను కున్నవాడు వుండేది ఈ యింట్లోనే.

లక్ష్మి : (నిరసనగా) ఇల్లా ? ఛిఛీ... గొడ్లపాక నయం. వెయ్యేళ్లు నన్ను అర్చిం చినా ఇలాటి చోట అడుగు పెట్టను.

సర: అది నీ సంస్కారం. ఎవరేం

చేస్తారు? పరమ నీచుల ఇళ్ళలోకి తొంగి చూసే దానివి నీకు మనుషుల విలువ ఏం తెలుస్తుంది. ఈ యింట్లో ఉండేవాడు పరమ నైష్ఠికుడు. నీతిపరుడు. సమస్త వేదాలూ, శాస్త్రాలూ చదివినవాడు. మనుషులలో మాణిక్యంలాంటి వాడు. ఒక్క మానవుణ్ణే ఎన్నుకోమంటే ఎంత కష్టమవుతుందో అని భయపడ్డాను. ఈ భూలోకంలో నాకు నిజంగా నచ్చినవాడు ఒక్కడే ఒక్కడు న్నాడు అతనే యితను.

లక్ష్మి: అది నీ అభిరుచి. ఎవరేం చేస్తారు?

బ్ర: (చిరాకుగా) మీ ఆడవాళ్ళ కీచులాట ఇప్పుడే సాగాలా?

సర: లోపలికి పోదాం పదండి... అడుగో, ఆ నిద్రపోతున్న వాడికే మనం వరం ఇవ్వవలసింది. అవతల పడుకున్న అయన భార్య. చూడండి మెళ్ళో పసుపు కొమ్ముతప్ప ఇంకేమీ లేదు. ఆ నలుగురూ వాళ్ళ పిల్లలు, వాళ్లు దిసమొలలతో ఉండటాని క్కారణం ఉక్కకాదు.

లక్ష్మి: నేనిక్కడ ఒక్కక్షణం ఉండ లేను. త్వరగా మీరంతా బయటికి రండి. నే పోతున్నా.

సర: (నిరసనగా) హుం. మొగుళ్లు ఎలా తయారుచేస్తే పెళ్లాలలా తయారవుతారు.

బ్ర: నీకసి తరవాత తీర్చుకుందువుగాని ముందు పని జరగనీ.

సర: మీరు నాతో మాట్లాడకండసలు. మీ మూలానే ఇదంతా వచ్చి పడింది. (కసిగా) సృష్టి-కర్త.



"ఇంతా ఏం కావాలి సార్— దోసె, పూరీ— —"

"ఇం కేం వద్దుగాని ఓ లడ్డూ తీసుకురా కాస్త పెద్దది చూసి. ఇందాక నువ్వు తెచ్చిన ఇడ్లెన్ గాలి కెగిరిపోయినట్టుంది."

దేవేం: ఆగ్రహించక మా కర్తవ్యం తెలియబరచండి.

సర: ఇంకా తెలియ బరిచే దేముంది. యీ బ్రాహ్మడి పేరు శివావధాని—

బ్ర: ఆ పేరే దొరికిందా?

సర: మీ మగవాళ్ళ కీచులాటలతో నాకు పనిలేదు. ఈ బ్రాహ్మడికి అమోఘవాక్కు ప్రసాదించండి. అందరూ కలసి వరమి వ్వండి.

విష్ణు: శివావధానికి అమోఘ వాక్కు కలుగు గాక.

అంతా: తథాస్తు.

శివావ: (ఉలిక్కిపడి లేచి) నిజమా, కలా? నాకు కనబడింది మానవులు కారు. దేవతలే, ఏరీ, ఏమయారూ?

నార: అందరమూ యిక్కడే వున్నాం. నాయనా. ఇక చూపించు నీ ప్రతాపం.

శివావ: ఏమిటి నాలో యీ మార్పు... అందరూ నిద్రపోతున్నారు. వేళ ఎంత అయిందో. ఛీ ఛీ. ఏం కొంప. ఎంత దారి

ద్రవ్యం. నా కుచేల సంతానం. డబ్బు...డబ్బు... కొన్ని కొంపల్లో లక్ష్మి తాండవిస్తుందంటారు. లక్ష్మి ఎక్కడుంది? లక్ష్మి లేదు-డబ్బే వుంది.

నార: కొంప మునిగింది. బయటికి పోదాం పదండి.... ఏదీ లక్ష్మీ దేవి?

సర: మనని బెదరగొట్టటానికి ఎక్కడో దాగి వుంటుంది, నంగనాచి.

నార: తల్లీ, నువ్విచ్చిన వరంలో నీకే నమ్మకం లేదా?

విష్ణు: (ఆదుర్దాగా) లక్ష్మీ...ఓలక్ష్మీ.... నా నోటిమీదుగా ఇచ్చిన వరం ముందు నాకే ఎసరు తెచ్చింది.

దేవేం: ఇంతలో అయిందా, దేవదేవా? సూర్యోదయమమే లోపల యీ బ్రాహ్మడు మనందరినీ మాయం చేస్తాడు. చూస్తూండండి. ఇది కూడని పని అని నేను మొదటి నుంచీ నెత్తీనోరూ కొట్టుకుని చెబుతూనే వున్నాను. నా మాటెవరు వింటారు!

సర: నువ్వూరుకోవయ్యా. ఇంతమంది పిరికివాళ్ళను చూశానుగాని నీ అంత పిరికి పందను ఎక్కడా చూడలేదు.

దేవేం: చేసేదేదో చేసేసి మధ్య నా మీద పడటం దేనికీ?

విష్ణు: లక్ష్మీ... లక్ష్మీ...

సర: మగవాడి కింతగా పెళ్లాం కొంగు పట్టుకు తిరగటం భావ్యంకాదు.

దేవేం: పెళ్లామే లేకపోతే ఇంకా కొంగెక్కడ?

సర: (రుసరుసలాడుతూ) అంతా నాకు శత్రువులే. నేను పోతున్నాను.

బ్ర: మనంకూడా పోదాం. ఇంకా ఇక్కడ మనకేం పని?

అంతా: పదండి...పదండి.

శివా: ఇక నేనీ జీవితంతో సరిపెట్టుకోను. ఏదో చేస్తాను. చేసితీరుతాను.

(గట్టిగా) ఎవరడ్డొస్తారో చూస్తాను.

భార్య: (ఉలికిపడి లేస్తూ) ఏమిటండీ ఆ చప్పుడూ?...ఎవరో కేకలు పెట్టారే.

శివా: నేనేలే.

భార్య: మీరేనా?...అయితే, చూడండీ నాకో కల వచ్చిందిగదా, ఎంత మంచి కలో చెప్పలేను. మనింటికి దేవతలంతా వచ్చారు.

శివా: ఓసి నీయిల్లు బంగారంగానూ, నీక్కూడా అదే కల వచ్చిందా?

భార్య: (కెవ్వున అరిచి) గోడలన్నీ అంటుకున్నాయండీ. బయటికి పోదాం పదండి. పిల్లలు, అయ్యో, నా పిల్లలు... (శోకాలు పెడుతుంది)

శివా: ఊరుకోవే, మంటలైతే వేడి ఉండదూ. గోడలంతా బంగారమయాయి.... అదుగో కప్పుకూడా....ఇల్లంతా ఎలా మారిపోయిందో చూశావా? లక్ష్మి లేదనుకున్నాను, లేకేం? ఉంది. నా యింటికి వచ్చింది,

లక్ష్మి: ఇప్పు డీయిల్లు బాగుంది.... వీళ్ళంతా ఏరీ? నన్నొక్కత్తెనూ విడిచి వెళ్ళిపోయారే?

శివా: మనకు వచ్చిన కలేనే, నిజంగానే దేవతలు మనింటికొచ్చారు. మనిల్లు బంగారమయింది. నిజంగా బంగారమయింది. నిజంగా బంగారమయింది. నిజంగా...నిజంగా....

• • •

విష్ణు: వచ్చావా, లక్ష్మీ, నిజంగా వచ్చావా? నిన్ను మళ్లా చూడననుకున్నాను.

లక్ష్మి: అదిసరేగానీ. నన్ను ఒక్కత్తెనూ విడిచి మీరంతా వచ్చేశారేం?

విష్ణు: నువు ఎంత పిలిచినా పలకందే.

నార: నారాయణ....నారాయణ....

లక్ష్మి: మీకోసం యింటి బయట ఎంతో సేపు కనిపెట్టుకున్నానా, ఆ తరువాత అకస్మాత్తుగా ఇల్లూ, సమస్తమూ మాయమయింది. నాకు స్పృహలేకుండా పోయినట్టయింది. ఇంతలో ఎలా వచ్చానో నేనా బ్రాహ్మడి ఇంటో ఉన్నాను. అన్నట్టా యిల్లిప్పుడు ఎంత బాగుందను కున్నారు.

నార: నారాయణ...నారాయణ...

• • •

జనం కోలాహలం. ఇద్దరు మనుషులు మాట్లాడుకుంటూ వుంటారు. మధ్యమధ్య శివావధాని గొంతు వినిపిస్తూంటుంది.

1: అదేం విడ్డూరమండీ? లంకలో బంగారు మేడలున్నట్టు వాల్మీకిగారు రాశారని వినటమేగాని, బంగారపు గుడిసెలు ఎక్కడా వినలేదు.

2: ప్రత్యక్షంగా చూస్తూంటే యింకా వినటంకూడా దేనికీ?

3: ఇందులో ఏదో కనుకట్టుందిలెండి. అదంతా గిల్టయి ఉంటుంది.

శివా: (కేకలుపెడుతూ)ఏమిటీ తిరణాల? చూడండి. బాగా చూడండి. కావలిస్తే తలాకాస్త బంగారమూ తవ్వుకుపొండి.

2: ఆ బ్రాహ్మడి దరిద్రం తీరిపోయింది.

రిపోర్టర్ (టెలిఫోన్) హలో హలో... బంగారపు గుడిసె వార్త అక్షరాలా నిజం... కళ్ళారా చూశా...గీటు రాళ్ళమీద పరీక్షించారు...మేలిమి బంగారు... బంగారు గుడిసె ప్రభుత్వానికి చెందుతుందని ఒక న్యాయవాది అంటున్నాడు .... అవునవును ద్రవ్యోల్బణం...బంగారు ధర పడిపోతుందన్నారు. ...ఇల్లుగలాయనా? నిరుపేద బ్రాహ్మడు...తపస్సంపన్నుడని కొందరూ నీచోపాసనలు చేసి పరుసవేది సాధించాడని కొందరు అంటున్నారు...ఇంటిచుట్టూ ఇసక వేస్తే రాలని జనం...హలో.హలో....

• • •

దూత: దేవేంద్రా. శివావధాని తన శక్తులను గ్రహించాడు. తాగిన వాడులా అయిపోయాడు. చుట్టుపక్కల అందరినీ చంపి బతికిస్తున్నాడు, ఇళ్ళు తగలబెట్టి మళ్ళీ ఎప్పటిలాగా చేస్తున్నాడు. జనం అతన్నిచూసి దడుచుకుని పారిపోతున్నారు. ప్రభుత్వం పోలీసులను పంపింది. వాళ్ళందరినీ శిలలుగా చేసేశాడు. వెర్రికేకలు వేస్తూ, వికటాట్టహాసాలు చేస్తున్నాడు.

శివా: హహహహా....నాజోలి కెవరన్నా వస్తే మాయం చేస్తా. నన్నెవరూ ఏమీ చెయ్యలేరు. నేనే దేవుణ్ణి. లోకాలన్నీ నావే. ఇంద్రుడి సింహాసనంమీద కూచుని మూడు లోకాలూ ఏలుతా. హహహహా... హహ హహ....

• • •

దేవేం: దేవదేవా, మాకేం దిక్కు? ఇంతమంది రాక్షసుల బారిన పడ్డాముగాని,

ఇంత ప్రమాదం నేనెన్నడూ ఎదుర్కోలేదు. నహుషుడు పాలుతాగే పిల్లవాడే నన్న మాట. ఇంత బెడద ఎన్నడూ ఎరగం.

విష్ణు : ఏం నారదా, ఏమిటి నీ సలహా ? ఇదంతా నీ కల్పనేగద.

నార : నారాయణ...నారాయణ.... నేనే పాపమూ ఎరగను. అయినా, తమ సెలవైతే యీ కొత్త దేవేంద్రుణ్ణి ఒక్కసారి చూసి వస్తా.

దేవేం : వట్టి చేతులతో రాకు, నీకు పుణ్యం ఉంటుంది.

• • •

నార : నవ దేవేంద్రా, నమస్తే.

శివా : నువ్వెవరు ?

నార : నన్ను నారదుడంటారు, ఇలా వెళుతూ నా అభినందనలు తెలపటానికి వచ్చాను. నే పుట్టి పెరిగాక ఎందరో తపశ్శక్తి సంపన్నులను చూశానుగాని నీవంటి మహత్తర శక్తిమంతుణ్ణి చూడలేదు, వాక్శక్తి ముందు ఏ యితర శక్తులూ నిలవలేవని త్రిమూర్తులు గుర్తించారు. నీవు సాక్షాత్తూ మహేశ్వరావతారమేనని వారంటున్నారు.

శివా : వాళ్ళ ఎన్నిక ఎవడిక్కావాలి. బోడి ఎన్నిక.

నార : నువు సంతోషిస్తావని చెప్పలేదు నాయనా. అసలు విషయం విను. నీకు అమోఘ వాక్కిచ్చిన సరస్వతీదేవి ఇదే శక్తిని నీ భార్యక్కూడా యివ్వటానికి బ్రహ్మలోకంనుంచి నాతోబాటే బయలు దేరింది.

శివా : (ఆదుర్దాగా) వొద్దు, వొద్దు. అది వట్టి అమాయకురాలు. మహా పుణ్యాత్మురాలు. అది కాస్తా రాక్షసి అయిపోతుంది:

నార : అదేమోగాని మీ ఇద్దరికీ పోటీ పెట్టి దేవతలు సంతోషించటానికి ఆలోచిస్తున్నారు. ముందే చెప్పాను, తరవాత నీయిష్టం.

శివా : ఘోరం .... ఘోరం ... దానికి వాక్శక్తి యివ్వవద్దు. నాకూ వద్దీ పాపిష్టి శక్తి.

(దగ్గరలో పిడుగు పడిన చప్పుడు)

శివా : ఏమిటా చప్పుడూ ? ఎక్కడో పిడుగుపడ్డట్టుంది. ఇదేమిటి ? నే నెక్కడున్నానూ ? స్వర్గమేదీ ? నారదుడేడీ ?... ఇది నా గుడిసే. అదుగో మా ఆవిడ. (కోడికూత) తెల్లవారబోతున్నది. అంతా కలేనన్నమాట. నిజమైతే ఎంతబాగుండేదీ ? (ఆలోచించి) హుం. పోనిస్తూ, పీడకలా. ●

● "మీ కొచ్చిన జబ్బుంది చూశారూ. సాధారణంగా అది నయంకాదు. మీ అదృష్టం కొద్దీ అది నయమైంది" అన్నాడు డాక్టరు.

"బిల్లు యిచ్చేటప్పుడు కాస్త ఆ ముక్క జ్ఞాపకం వుంచుకోండి", అన్నాడు రోగి.

మీ పద్యాటోపం

అల్లము కారముండ దిల
అరికు అంతము కద్దు
చీకటిన్ పిల్లికి చూపు లేదు
వరి బియ్యము మాకులయందు తీయనా
బెల్లము చేదు మానదు
ఇల వేము సుధానిధి
చందమామ బిల్ నల్లగనుండు
కోయిల వనమ్ముల నుండు కిరాత జాతియే !

ఆచార్య ఆత్రేయ

అల్లము కారము
(పు)ండ దిల అరికు అంతము
కద్దు చీకటిన్ పిల్లికి చూపు
లేదు వరి బియ్యము మాకులయందు
తీయనా బెల్లము
చేదు మాన దిల వేము
సుధానిధి చందమామ
బిల్ నల్లగ నుండు కోయిల
వనమ్ముల నుండు కిరాత జాతియే !

హాస్య రుద్ర బాతాఖానీ

ప్రేక్షక మహాశయులారా।

మీ వినోదంకోసం నివేదించే అక్షరాల హత్యా సాహిత్యాన్ని చదివి మమ్ము ఆనందింప గోరుచున్నాము.

కిందటి నెల మేము ప్రకటించిన కొన్ని పుచ్చు తప్పులను పఠించి వాటినే మరణం చేదుకొంటున్న హాస్యనటుడి కారు కింద ఇద్దరు ప్రమోద వశమున పడి మరలించినట్టు రోజా వార్త. ప్రక్కనున్న మైద్యశాలలో హాస్యనటుడు మాత్రము పానములు గ్రోలిపోయినట్టు తెరుస్తున్నది.

ఈసారి మరికొన్ని ముద్రా రాజసాలను విన్నవిస్తున్నాము; అవి ధరించండి.

చల్ మోహన రంగా! నీకు నాకూ జోడు శరచెను గదరా!

నిత్య కల్యాణము: పిచ్చి తోరణము.

మేఘ సందేహమును తెగులులో చాల మంది అనువధించినారు.

త్వరలో రానన్నది మా జాణపద చిత్రము.

సిరి దా వచ్చిన వచ్చును సలలితముగ నారి కేలి సరసము భంగిన్

మోహన మురళీధారి— బృందావన సంసారి

ఆధునిక చైత్రకళ క్షీభాయమానంగా వుంటుంది

కొన్ని చిత్రాలు జతదినోత్సవాలు జరుపుకొంటాయి.

అశేష విశ్లేషములు సశేషము,

మీ

ఫ్రూట్ రీడరు.

జోకు

చైత్రయాత్ర

అఖిల భారత దేశంలో అసమాన నటీ మణి భానుమతి ఆ మధ్య తెరమరుగై పోయింది. ఆమెను చూసే భాగ్యం తెలుగు వాళ్ళకు కరువైపోయింది. "బాటసారి" రాక ముందు "దేశింగ్‌రాజుకథ" డబ్బింగ్ సిని మాలో కన్పడింది. అంతే. అంతకుముందు చిత్రం "సారంగధ"రేనేమో. ఆ రోజుల్లో తమిళంలో కూడా చాలా తక్కువ సినిమాలే ఆమెవి విడుదలైనవి. ఇంక భానుమతి వెనకబడి పోయిందని ప్రబుద్ధులు కొందరు తమ అవివేకాన్ని వెళ్ళబుచ్చారు. ఎ. వి. ఎం. వారి తమిళ చిత్రం "అన్నై" విడుదలైనది. ఏకగ్రీవంగా ఆంగ్ల, తమిళం పత్రికలు భానుమతి నటనను కొనియాడినవి. క్రిందటి నెలలోనే నూరు రోజుల ఉత్సవాలు తమిళ దేశంలో చేసుకొంది ఆ చిత్రం. మద్రాసులో ఇరవైఅయిదువారాలు ఆడవచ్చు ననుకుంటున్నారు. ఎందుకోసం ప్రజలు అంత విరగబడి చూస్తున్నారో తెలుసా? కథకోసం కాదు, నమ్మడానికి వీల్లేనిదిగా వుంది. సంగీతమూ కాదు. చప్పగానేవుంది. ఇం కెందుకోసం అయివుంటుందీ: మ రెం దుకు నరనరాల్ని తోడి, గుండెల్ని పిండి, కంటిలో మంటల్ని రేపే భానుమతికోసం. తండ్రి చనిపోయే సమయంలో కొడుకుని వేరుచేసి కూడా ప్రేక్షకుల జాలిని పోగొట్టు కొనని భానుమతికోసం. ఏడుపేదో నవ్వేదో తెలియని తికమక పెట్టి పిచ్చిని వాస్తవికంగా నటించిన భానుమతికోసం. ఈ చిత్రం త్వర లోనే తెలుగు సంభాషణలు సంతరించుకొని విడుదల అవుతుంది. అంతకుముందే భానుమతి ప్రధాన పాత్ర నటిస్తున్న "అనురాగం", ఆ తరువాత మల్లమ్మ భానుమతి అవతారం యెత్తబోతున్న "బొబ్బిలి యుద్ధం" వస్తాయి.

(1)

మానాపురం అప్పారావు ఈనాడు వోల్టావారి "పరువు ప్రతిష్ఠ"కు దర్శకుడు. ఇంతకు ముందు భరణీ రామకృష్ణ దగ్గర సహాయ దర్శకుడు. అంతకు ముందు బి. వి. రామానందం నిర్మించిన "పెంకిపిల్ల"లో నాయకుడు. పెక్కుచిత్రాలలో నటించినతరు వాత దర్శకు డవడం కొత్తకాదు. బొంబా యిలో గురుదత్, రాజకపూర్ మొదలైన వారూ, మనకు ఎన్టీరామారావూ వున్నారు. కాని ఒకే ఒక చిత్రంలో నాయకునిగా నటించి, ఆ పదవిని ప్రయత్నపూర్వకంగా

"దాగుడు మూతలు" లో బి. సరోజాదేవి



త్యజించి దర్శకునిగా రాణించిన వారు ఎవరూ లేరనే అనుకుంటాను. అది నిజమయితే ఆ ఘనత మానాపురం అప్పారావుకే దక్కుతుంది.


ఆ మధ్య వారిని చూడడానికి ఆఫీసుకు వెళితే లేరు. త్వరలోనే వస్తారు కూర్చోమని అక్కడ వున్న సహాయ దర్శకులు శ్రీరాం అన్నారు. ఊరికినే కూర్చోనబెట్టట మెందుకని టేపురికార్డు తెచ్చి ఆ చిత్రం తాలూకు పాటలను కొన్నిటిని వినిపించారు. వినగానే నన్ను పరవశింప జేసినది సుశీల పాడిన భజన. "ప్రభుగిరిధారి" అన్నది. ఎంత కమ్మగా, ఎంత హాయిగా వుంది ఆ పాట! విన్నవారికే తెలుస్తుంది. పెండ్యాల ఆ పాటకు పీలూ రాగంలో వరసను కూర్చారు. పెండ్యాల సంగీతంలో వున్న ప్రత్యేకత పాతరాగాన్ని తీసుకొని కొత్త తళుకులతో తాజాగా వినిపింప జేయడం యిందులోను స్పష్టంగా వుంది. ఈ పాటను వ్రాసింది యిప్పుడిప్పుడే సినిమా పాటల రచయితగా పైకివస్తున్న రాజశ్రీ. ఆ పాటలు పెండ్యాల వరసతో, సుశీల పాడడంతో పోటీపడుతున్నాయంటే సుశీలను, పెండ్యాలను చిన్నబుచ్చట కాదు. రాజశ్రీని తగురీతిని పొగడడం. ఈ చిత్రంలోని తక్కిన పాటలు ఆత్రేయ, రాజశ్రీ, నారాయణరెడ్డి, శ్రీశ్రీ, ఆరుద్ర, కొసరాజు మొదలగు హేమాహేమీలు వ్రాశారు.

తారాగణంలో రామారావు, అంజలి, కన్నాంబ, గిరిజ, సూర్యకాంతం, రేలంగి, రాజనాల, చలం మెరుస్తున్నారు. కథ, కథనం కూడ మానాపురమే. ఈ చిత్రం మేనెల విడుదల అనుకుంటున్నారు.

తిలక్ దర్శకత్వాన, అనుపమ పతాకాన తయారవుతున్న చిత్రం "ఈడూ-జోడూ". గుమ్మడి అతిముఖ్యమైన, అతిక్లిష్టమైన, అతి విచిత్రమైనపాత్ర ధరిస్తున్న ఈ చిత్రం ఈ మధ్యనే మూవియోలాకు ఎడిటింగ్ కోసం పయనించింది. మరొక నృత్యనాటిక చిత్రీకరణతో, సెన్సారు వారి అంతఃకరణతో; రీ రికార్డింగ్ అలంకరణతో ఆంధ్రుల నలరించడానికి సిద్ధంగా వుంటుందని తిలక్ ఆ మధ్య ప్రీవ్యూ పేరడైజ్ దగ్గర కనపడినప్పుడు అన్నారు. అన్ని తిలక్ చిత్రాలలో వలె ఇందులోను పెండ్యాల-ఆరుద్ర సంగీత సాహిత్యాల మేళవింపే. రికార్డులు అప్పుడే విడుదలై మీరు వినడానికి సిద్ధంగా మీ వూళ్లో గ్రామఫోను రికార్డు షాపుల్లో వున్నాయి. బ్రహ్మాండంగా వున్నాయన్న మాట అన్ని పాటలకీ ఉపయోగించవచ్చును గాని నిజంగా రెండు పాటలకే ఆ విశేషణం వర్తిస్తుంది: "ఇదేమిలాహిరి", "చిరుగాలి వంటిది". ఎడిటింగ్ జరుగుతుండగా ఆ రెండు పాటలున్న రీళ్లు చూశాను. ఎంత చక్కగా తిలక్ తీశారని! ఆరుద్ర, పెండ్యాల కష్టించి సృష్టించిన కళాఖండాలకు తగిన న్యాయం చేశారు.

ఈ చిత్రంలో నాయికా నాయకులు జమున, జగ్గయ్య. తదితరులు చలం, మణిమాల అనే కొత్తనటి, సూర్యకాంతం, చదలవాడ, మాలతి. సంభాషణలు పినిశెట్టి వ్రాశారు. అన్నట్టు మరిచాను రమణారెడ్డి కూడా ఉండడమే కాదు "విష్ణుపాద" మనే పాట విశిష్టంగా మాధవపెద్ది గొంతు అరువు తెచ్చుకొని పాడారు.

జ్యోతి



లలితా శివజ్యోతి వారి "లవకుశ" లో దృశ్యం

భరణి రామకృష్ణ దర్శకత్వాన తయారవుతున్నచిత్రం వాసవీవారి "అనుబంధాలు". ఈ చిత్రంలో శ్రీనివాస్ అనే సంగీత దర్శకులు ఆంధ్ర చిత్రావనికి పరిచయం కాబోతున్నారు. వీరికి పి. బి. శ్రీనివాస్‌కీ ఏమే బంధుత్వం లేదు. ఇంతకు ముందు తమిళ, మళయాళ చిత్రాలకు పనిచేశారు.

ఈ చిత్రంలో పి. బి. శ్రీనివాస్ జమునారాణీజంట జంట గీతం ఒకటి విన్నాను. ఎంతో సరదాగా వుంది. వీ రిద్దరూ కలసి యింతకుముందు పాడిన పాటలన్నీ (బాటసారిలో కనపడిన ఏడ్పుగీతం తప్ప) ప్రజాభిమానాన్ని సులభంగా పొందాయి. "ఆత్మబంధువు" లోని "దక్కెనులే" ఇటీవలిది. "అనుబంధాలు" లోని పాట యింకా పెద్ద హిట్టవే సూచనలు కనిపిస్తున్నాయి.

సి. నా. రే. వ్రాసిన ఒక హిట్ పాట చాలా అందంగా వుంది. "నా పేరు నెలమేరు న నెవ్వరాపలేరు" అన్నది. ఇంకా రికార్డు కాలేదు. ఈ పాట నర్తకి నాగరత్నంపై చిత్రీకరింపబడుతుంది.

నటీ నటులు జగ్గయ్య, గుమ్మడి, రమణారెడ్డి, పద్మనాభం, చదలవాడ, రామకోటి, మల్లాది, కృష్ణకుమారి, స్వర్ణకుమారి, బేబీ పద్మిని మొదలగువారు. పిచ్చేశ్వరరావు (చివరకు మిగిలేది) మాటలు వ్రాశారు. పాటలు సముద్రాల, కొసరాజు, దాశరధి, సి. నారాయణ రెడ్డి. కెమెరా వెంకట వారణాసి. శ్యామలరా వనే కొత్త ముఖం ఈ చిత్రంలో పోలీసు అధికారిగా కనబడుతుంది. త్వరలోనే ఈ చిత్రంకూడా విడుదల లవుతుంది.

బాలయ్య, కృష్ణకుమారి, హరనాథ్, రాజశ్రీ నాయికానాయకుల జంటలుగా నటించిన చిత్రం రానా వారి "తల్లీ గిష్టలు" లరు

నెలలు కోర్టులో కాపరం చేసి. ఆంధ్రదేశం పైకి విజయోత్సాహంతో దండెత్తనున్నారు. ఈ చిత్రానికి సంగీతం బి. శంకర్రావనే కొత్త స్వరకారులు. గోకుల్ వారి "తిరవ తమ్మ కథ"కి అజిత్ఆర్ట్స్ వారి పేరు పెట్టని చిత్రానికీ వీరే సంగీత దర్శకత్వం వహించింది, ఈపాటలు రికార్డులుగా ఎప్పుడో విడుదలైనవి. శ్రీనివాస్ పాడిన "నగుమోమున" అన్న మల్లాది రామకృష్ణ శాస్త్రి సాహిత్యం రసిక జనామోదాన్ని పొందినది. చిత్రంలో ఈ పాట పియానో వాయిస్తూ బాలయ్య పాడతారు. ఇందులో నాగయ్య. లింగమూర్తి. రజని. హేమలత. నిర్మల, శివరావు కూడా కనిపిస్తారు.

పై చిత్రానికి కథనూ, కథనాన్ని తయారు చేసింది యడవల్లి లక్ష్మీనారాయణ. దర్శకులు ఒకనాటి స్టంటు హీరోలైన పి. శ్రీనివాసరావు. నాలుగైదేళ్ళ క్రిందట వీరు ఆర్. బాలసరస్వతికి (నిన్నటి నేపథ్య గాయని)హిందుస్థానీ సంగీతం నేర్పుతుండేవారు. కంఠం సుమారుగా వున్నా, నేర్పే పక్కీ పాతదైనా. వీరికి తెలిసిన విద్య ఎంతోమంది సంగీత దర్శకులకు గ్రాంథికంగా తెలియదు. వ్యావహారికంగా తెలియవచ్చునుకోండి. అది వేరే సంగతి.

మొదటి చిత్రం "మాయింటి మహలక్ష్మి" లోనే మెప్పుపొందిన హరనాథ్ హిందీ చలన చిత్ర సీమలో ప్రవేశింతనున్నాడు. ఫిల్మిస్థాన్ వారితో కాంట్రాక్టు సంతకాలు ఈ మధ్యనే జరిగాయి. త్వరలోనే తక్కిన వివరాలు తెలుస్తాయి. ఈ యువ నటుడు ఇప్పుడు నటిస్తున్న చిత్రాలు అనురూపావారి "అనురాగం", రౌనౌ వారి "తల్లీ బిడ్డలు",మయూరావారి"ప్రాణస్నేహితులు", యూనీస్వారి "జన్మహక్కు". విక్రమ్వారి ద్విభాషా వర్ణచిత్రం "అమరశిల్పి జక్కన్న". కన్నడ చిత్రం "శివరాత్రి", ఎ. వి. ఎం. వారి రానున్న తమిళ చిత్రం, తాపీ చాణక్య దర్శకత్వం వహిస్తున్న "వాసవి కన్యకా పరమేశ్వరి కథ" మొదలైనవి.

"సవతి కొడుకు" చిత్రానికి కథ. దర్శకత్వం. కథనం అన్నీ పై. రంగారావే. ఆ చిత్రంలో లోపాలు ఈ మూడిటిలోనే వున్నాయి. కథ కొత్తదికాదు. వెంకయ్య ఒక సామాన్యపు రైతు. మొదటి భార్య చనిపోతే లక్ష్మమ్మను రెండవ పెళ్ళి చేసుకుంటాడు. ఆమె తుంటరియైన తన స్వంత కొడుకు శేఖర్ని సరిగ్గా చూడకుండా సవతి కొడుకు శేషని బాగాచూస్తుంది. కాబట్టి ఈ చిత్రానికి ఆ పేరు పెట్టడమయినది. కాల చక్రం తిరుగుతుంది. శేషకి జానకితో వివాహమవుతుంది. ఆ కుటుంబానికి పేరు ప్రతిష్ఠలతో బాటు ఆర్థిక బలం కూడా పెరుగుతుంది. శేఖర్ చదువనే పేరుతో పట్టణంలో వుంటాడు. ఆస్తినంతా శేష పేరిట భార్య వ్రాయమన్నట్టు వ్రాసి చనిపోతాడు వెంకయ్య. తమ్ముడు చదువు మాని వేయడం. స్వగృహానికి చేరుకొనడం, గృహచ్ఛిద్రాలు, చివర అందరూ కలుసు కొనడం జరుగుతుంది.

అతి సామాన్యమైన ఈ కథను బలహీనమైన రచన మరింత పేలవం చేసింది. ఏదృశ్యానికాదృశ్యంగా చూస్తే సంభాషణలు బాగానే వున్నా చిత్రం మొత్తానికి అవి



అన్నపూర్ణా వారి "చదువుకున్న అమ్మాయిలు" లో కృష్ణకుమారి, సావిత్రి

ఏమాత్రం నిండు తనాన్ని చేకూర్చలేకపోయినవి. ఒకటి రెండు చోట్ల వినపడిన చెణుకులలో మాత్రం బైరాగి పదును తెలుస్తున్నది.

ఈ సినిమా శంతకీ చక్కని నటన చూపించినదీ ఎన్. టి. రామారావే. అసలా పాత్రకే ఆ కొంచెమైన నటించడానికి అవకాశం వుంది. జానకిగా జానకి ఉన్న చాలా కొద్దిలో బాగా వున్నది. వర్ధమాన నటుడు బ్రహ్మం ధరించినది తమ్ముడు శేఖర్ పాత్ర. బ్రహ్మాండంగా నటించాడని అనటానికి వీలులేకపోయినా ఏమాత్రం నిరుత్సాహం కలిగించాడని చెప్పటానికి వీల్లేదు. ఇటువంటి హీరోలు ప్రబలితే నాయకుల ముఖాలలో ఒక కొత్త రకం అందాన్ని చూడగలుగుతాం. బ్రహ్మం చేసిన రెండు మూడు నాట్యాలు చక్కగా వున్నాయి. ఇంతకు ముందే నాట్యంతో ఏదో విధమైన పరిచయం వుందికాబోలు,

టి. వి. రాజు పర్యవేక్షణలో సిహెచ్. సత్యం ఈ చిత్రంలోని పాటలకు బాణీలు కూర్చారు. ప్రతీపాట వినసొంపుగా వుంది. హిందీ పాటలకు అనుకరణలైన నాలుగు పాటలు కూడా అందంగానే వుండటం ఈ యువ సంగీత దర్శకుని ప్రత్యేకత, వాద్యరచన హిందీ మాతృకలలో వున్నంత పటిష్ఠంగా వుంది. కొత్తగావున్న వరుసలలో ఘంటసాల, సుశీల పాడిన "నయనాల నీలాలలో" శ్రవణానందకరంగా వున్నది. శ్రుతిపేయంగా వున్న తక్కిన పాటలు

జానకి కంఠాన మెలికలు తిరిగిన "జరాతైరో", "సససస్సార్", జమునా రాణీ పాడిన "మామయ్యా" పాట, పి. బి. శ్రీనివాస్ పాడిన విషాద గీతం. బైరాగే అన్ని పాటలు వ్రాశారు. అతి సర్వంగా సరసంగా సాగింది రచన. అన్ని పాటల రచన యింత చక్కగా వుండడం సినిమాలలో అరుదైన విషయమే.


వి. జె. శర్మ నృత్య దర్శకత్వంలో జానపదపు ఊపు కనపడినవి బాగున్నవి. వై. రంగారావు దర్శకత్వం వలన యిది వారి మొదటి చిత్రమని తెలుసుకోవచ్చు.

అనుపమ ఆఫీసులోనే ఇటీవల ఆదర్శ నాట్యమండలి (పాలకొల్లు) వారు "పంజరంలో పక్షులు" నాటకం రిహార్సలు వేశారు. మూడు రోజుల తరువాత అన్నాపత్తై హాలులో నాటకం వేశారు.

రిటైర్డు జడ్జి రంగనాథం. రామం అతని కొడుకు. కొత్త పెళ్ళికొడుకు. పెళ్లాంతో ముభావంగా వుంటున్న పెళ్ళికొడుకు. ఆ అమ్మాయి రాధ. చిన్నప్పటి నేస్తురాలు, పరికిణీల వేళ మరదలు పిల్ల పైటలు వేసుకొనేసరికి పెళ్ళామై కూర్చుంది. ఆ యింటికి రామం స్నేహితుడు గోపీ వస్తాడు. ఒక్కడేకాదు, హిస్టీరియాతో బాధపడుతున్న తన భార్య సీతను తీసుకొని. ఊరికినే రాడు. తన భార్యకు వైద్యం చేయించుదామనే సదుద్దేశంతో. వీళ్ల నలుగురూ ముఖాముఖీ తారసపడిన కొద్దిసేపటిలోనే తెలిసిపోతుంది, గోపీ - రాధ, సీతా - రామం ఇంతకు ముందు ప్రేమించుకున్నారని, కారణాంతరాలవలన ఇలా వాళ్ళ పెళ్ళిళ్లు జరిగాయని. ఒక ఇంటిలో వుంటూ ఈ నలుగురు జీవులు ఎటువంటి మానసిక వ్యథకు లోనవుతారో, దాని కెటువంటి పరిష్కారాన్ని సాధిస్తారో చివరదాకా కుతుకతతో ప్రేక్షకులను కుతకుతలాడిస్తుం దీ నాటకం. దీనికి కారణం కథకుడూ, దర్శకుడూ అయిన పినిశెట్టి. వాస్తవికతను ప్రతిబింబించాలనే - అందులో ఇటువంటి ఇతివృత్తంతో - పొరబాటు పినిశెట్టి తలపెట్టలేదు. ఇంతటి నిర్దుష్టమైన దర్శక ప్రతిభ వుండకపోతే నాటకం అభాసై అపహాస్యం పాలయ్యేది. గులాబీ దండలు పినిశెట్టికే.

పాపయ్య వేషం కష్టమైన వేషం. తన భార్య యెవరితోనో లేచిపోయి ఆ వూరిలోనే కాపురం పెట్టింది. అందుకోసం ప్రతి స్త్రీ అందుబాటులోవున్న ఆడదే అని అపప్రథ పుట్టించడం అతని కలవాటు. అక్కడక్కడా జాలికలిగిస్తూ మరొక్క దగ్గర హాస్యాన్ని అందిస్తూ మరొక్కచోట రెండిటినీ మేళవిస్తూ ఈ పాత్రను కడు నేర్పుతో నిర్వహించారు పినిశెట్టి. గోపీ, రాధ, సీత వేషాలను ప్రవర్ధమాన నటులు రామకృష్ణ, మణిమాల, సుజాత వేశారు. సుజాత పిచ్చి ప్రేలాపన నమ్మదగ్గదిగా వుంది. జడ్జి వేషంలో మల్లాది నిండుగా, సేవకుని వేషంలో భూసారపు తౌణకని కుండగా నటించారు. రామం వేషంలో అంజిబాబు ప్రథమంగా రంగస్థలంపై అడుగుపెట్టి అందరిచేత సెభాషనిపించుకున్నాడు.

ఈ నాటకాన్నే య(శ)స్వీ రంగారావు ఈ నెల మొదటి వారంలో నాలుగైదుచోట్ల ప్రదర్శింప నున్నారు. మల్లాది ధరించిన పాత్ర వారు, మణిమాల పాత్ర శారద, నౌకరు పాత్ర సీతారాం ధరిస్తారు. మరొక రెండు పాటలు, చివరి దృశ్యంలో కొద్ది మార్పు వుంటుంది.


DURGA
BRAND
PORTLAND
CEMENT

1963

ప్రతి ఒక్కరు తప్పక చూడవలసిన చిత్రం

అజంతా ఆర్ట్సు సమర్పించు లోన్ స్టార్సువారి

యె రాస్తే హై ప్యార్ కె

ajanta arts present

ASHOK KUMAR
SUNIL DUTT
MOTILAL
REHMAN
AND
LEELA NAIDU
WITH
RAJENDRANATH &
SHASHIKALA
IN

అశోక్ కుమార్, రెహమాన్
మోతీలాల్, సునీల్‌దత్
& లీలా నాయుడు

మ్యూజిక్ : రవి

డైరెక్టర్ : R. K. నయ్యర్

ప్రొడ్యూసర్ : సునీల్ దత్

Drama that dares to deal with the explosive issues we face today!



Yeh Rastey Hain Pyar Ke

PRODUCED BY SUNIL DUTT DIRECTION R. K. NAYYAR
MUSIC RAVI LYRICS RAJINDER KRISHAN
WRITTEN BY AGHA JANI KASHMIRI PHOTOGRAPHY K. H. KAPADIA

వెరైటీ విడుదల —